
కొండపల్లి ప్రచురణలు

# టాల్‌స్టాయి కథలు

## మొదటి భాగము

భమిడిపాటి కామేశ్వరరావు



# టాల్‌స్టాయి కథలు

## మొదటి భాగము

కర్త: టాల్‌స్టాయి

అనువాదకర్త: భమిడిపాటి కామేశ్వరరావు

ప్రకాశకులు

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి

సర్వహక్కులు
గ్రంథకర్తవి

వెల
1—0—0

మొదటి ముద్రణ
జనవరి 1957

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రాజమండ్రి

500
ప్రతులు

# విషయ సూచిక


| | |
|---|---|
| | పేజీ |
| బాలికల కున్నపాటి బుద్ధి మనుషులకి లేందే! | 1 |
| కోడిగుడ్డంత ధాన్యపు గింజ .... ... | 5 |
| పశ్చాత్తప్తుడైన పాపి .... .... | 10 |
| పని, మరణం, అనారోగ్యం .... .... | 14 |
| కీడు వ్యామోహ పరుస్తుంది, కాని మేలు నిలుస్తుంది | 19 |
| మూడు ప్రశ్నలు .... .... .... | 24 |
| కుర్రశని, రొట్టె పెచ్చు .... .... | 32 |
| వ్యయం మరీ ఎక్కువ .... .... | 39 |
| అసురదేశరాజు – ఈశరషం .... .... | 43 |
| ఎలియాసా .... .... .... | 59 |
| ఢంకా .... .... .... | 69 |
| సూరత్‌లో కాఫీ ఆలయం .... .... | 83 |
| ముగ్గురు ఋషులు .... .... | 95 |

# కౌంట్ లియో టాల్‌స్టాయ్

(1828 - 1910)

టాల్‌స్టాయ్ రష్యాదేశపు ఇటీవలి సారస్వత చరిత్రలో అత్యున్నతమైన ప్రత్యేక స్థానం ఆక్రమించుకున్న మహావ్యక్తి. ఆయన జమీందారీ కుటుంబంలో జనించినవాడైనా, సాధారణ సైనికుడుగ సేనలో చేరి సంగ్రామానికి వెళ్లి, సైనికుల యొక్క కష్టాల్ని స్వానుభవంవల్ల తెలుసుకున్నాడు. ప్రజలయందు ఆయనకు గల సానుభూతి, సత్యాన్వేషణయందు ఆయనకు గల ఆసక్తి ఆయన్ని కలవరపెట్టాయి. నైతికమైన వేగాలకీ ఆధ్యాత్మికమైన ఆశయాలకీ ఆయన హృదయం నిరంతర సంగ్రామ రంగం అయింది. ఆయన ఆలోచన విప్లవాత్మకం అయినా, ఆయన శక్తి పరిణామవాదసమం. తలపెట్టిన కార్యరంగంలో తీవ్రంగా పనిచేయడం ఆయన స్వభావం. సకల విషయాలపట్ల జ్ఞానతృష్ణ ఆయన లక్షణం. మానవజాతియొక్క అపరిమిత సేకరణకి ఆయన కృషి. తన నైతిక లక్ష్యాన్ని చేరుకోగల మార్గాన్ని తన జీవితం మొదలుపెట్టినప్పటినుంచి గూడా అది చివరిదాకా ఆయన సాధిస్తూవచ్చాడు. తన యావజ్జీవితం తను వార్ధక్యంలో ఉంటూ ఆయన కర్షక జనానికి సేవ చేశాడు. మైమై జ్ఞానం ఆర్జించి విద్యావంతులం అనుకునేవారి సంకుచితత్వం ఆయన హేళనచేశాడు. ఆయన ప్రజ్ఞ సర్వతోముఖం. ఆయన రచనలు ఎక్కడ చూసినా అద్భుత చైతన్యం ఉట్టిపడింది. ఆయన సృష్టి అపారం - నవలలు, నాటకాలు, కథలు, చరిత్రలు, విమర్శనలు - అన్నీ చరిత్రాత్మకం అయినవి. ఆయన శైలి హృదయంగమం.

ఈ సంపుటంలో 23 కథ లున్నాయి. జీవిత సమస్యలలో ఏదో ఒకటి గాఢంగా చర్చించబడని కథ ఏదీ లేదు. ఈ ఇరవైమూడు కథల్నీ నేను సంవత్సరాల ప్రకారం క్రమపరిచాను. 'ఈ ఇరవైమూడు కథలు మాత్రమే రచించి ఉండి మరి యితర ఏ రచనా టాల్‌స్టాయ్ చేసుండకపోయినా, ఆయన రచనా ప్రసిద్ధి ఇప్పటిలాగే ఉండేది', అని ఒక మహావ్యక్తి చేసిన విమర్శ ప్రస్తావించుకుంటే, ఇవి ఎటువంటి మహిమ గలవో బోధపడుతుంది. వీటిలో ఒక్కొక్కటి, వ్యాసమా, కథా, కథానికా, సామ్యకథా, చరిత్రా, ఆత్మకథా, లేక అన్నింటి సమ్మేళనమా అనిపిస్తుంది.

వీటి ఆంధ్రభాషాంతరీకరణం గురించిన అనుమతికోసం ఢిల్లీలోని 'రష్యన్ ఎంబసీ' వారిని నేను కోరగానే, వారు అనుమతి ఇచ్చారు. వారికి కృతజ్ఞుణ్ణి.

అనువాదకర్త.

చెప్పులూ అవీ కాళ్ళకి ఉండగానే. కాని, పెద్దపిల్ల మందలిస్తూ 'వెళ్ళకు వెళ్ళకు మలాషా, మీ అమ్మ కోప్పడుతుంది. నేను చెప్పులూ మేజోళ్ళూ తీసేస్తాను. నువ్వూ తీసెయ్. ఏం?' అంది. అల్లాచేసి, పరికిణీ అంచు, మీదికి పట్టుగుని, వాళ్ళు ఆ బురద గుంటలో ఒకళ్ళకేసి ఒకళ్ళు నడవడం మొదలెట్టారు. మలాషాకి నీళ్ళు సీలమండదాకా వచ్చాయి. ఆ అమ్మాయి, 'అబ్బో, లోతుగా ఉంది అకూల్యా! నాకు భయంవేస్తోంది' అంది. ఆమె, 'అబ్బ, వస్తూ, ఇందులో భయానికేముందీ? అంతకంటె మరి లోతు రాదు' అంది. వాళ్ళు సమీపంలోకి రాగానే, అకూల్యా, 'జాగ్రత్త, మలాషా! చిందకొట్టకు. మెల్లిగానడు!' అంది. ఆమె ఈ మాటలు ఇంకా అందో లేదో, మలాషా తన కాల్తో బురదని దభుక్కున ఒక్కతొక్కు తొక్కింది. 'జా' మని బురదనీళ్ళు పైకి తన్ని అకూల్యా గౌను పరికిణీ నిండా పడ్డాయి. అంతటితో సరిపోలేదు, కళ్ళనిండా ముక్కునిండా కుడా పడ్డాయి అకూల్యా తన దుస్తు మీద పడ్డ బాడి డాగులు చూసుగుని కోపంవచ్చి మలాషాని కొట్టడానికి బయల్దేరింది. మలాషా హడిలిపోయి తను ఎల్లాంటి చిక్కులో పడ్డదో గ్రహించుగుని, కాలాచేతా బురదగుంటలోంచి బయటపడి, ఇంటికి పరారీ అయిపోవడానికి అయత్తపడింది. సరిగ్గా ఆ సమయంలోనే అకూల్యా తల్లి ఆ దారివెంట వెళ్ళడం తటస్థించగా, ఆవిడ తన కూతురి పరికిణీ అంతా బాడి మరకలు పడి కప్పులు కుడా బాడిగా ఉండడం గమనించి, 'ఓసి పెంకి అసహ్యాపు పిల్లగదే! ఏంజేస్తూన్నావే?' అని అడిగింది.

అకూల్యా, 'ఇల్లా చెయ్యాలనే చేసింది మలాషా!' అంది.

జాన్తో అకూల్యా పెళ్లి సంతోషంగా జర్గుతూంటే చూసేవాళ్లు ఆమె ఊహిస్తుంది. ఆ సంగతి ఎవరికీ చెప్ప నివ్వదంటేనే కాక మరొకరు బొబ్బలెడుతూ బాగావెళ్లింది. మరొకరి పెళ్లి జరగటానికి వచ్చింది. 'చూసి. నా పిల్లని అల్లాకొడుకు ఏదేమి చెప్పగలరు' అంటూ కొడుకావిణ్ణి కోప్పడటం మొదలెట్టింది. మాట మీద మాట పెరిగి, వాళ్ళిద్దరూ కోపంగా వాగ్వాదం చేశారు. విషయం అంతా వీధి పైకొచ్చేసి, వీధి వీధంతా నిండిపోయారు. ప్రతివాళ్లూ అనుకొన్నదే గాని, ఎవ్వరూ వినిపించుకోరు. అంతా కలిసి కొట్లాడేస్తూండగా ఎవరో అవతలివాళ్ళి ఓ తోపు తోసేసరికి. ఇక వ్యవహారం కొట్టుకోవడంతో పడపోతోంది. అప్పుడు అకూల్యా నాయనమ్మ వాళ్ళ మధ్యకి వెళ్ళి వాళ్ళని శాంతపరచాలని అనుకుంది. 'స్నేహితులారా! ఏమిటి ఆలోచించి చేస్తున్నారు ఇల్లాగ? ఇల్లా ప్రవర్తించడం ధర్మమేనా? అందులో ఇటువంటి రోజున? ఇది ఆనందించవలసిన రోజుకాని, ఇటువంటి అవివేకంతో గడపవలసిందికాదు' అని ఆమె చెప్పింది.

ముసలమ్మ మాటలు వాళ్ళు వినిపించుకోక. ఆవిణ్ణి పెంటపడగొట్టే టంత పనిచేశారు. మళ్ళీ ఆ అకూల్యా సహాయం ద్వారా కాకపోతే ఆ ముసలమ్మ ఆ మూకని శాంతపరచలేకపోయుండేది.

సంగతేమిటంటే. తల్లులిద్దరూ దెబ్బలాడుకుంటూన్న సమయంలోనే అకూల్యా తన పరికిణీమీది వాడి తుడిచేసుకుని. వెంటనే మళ్ళీ ఆయిరపుగుంట దగ్గరికేవెళ్ళి. ఒకరాయి పుచ్చుకుని దాన్తో మట్టిగీకేసి అగుంటలోంచి నీరు పారడానికి చిన్న

ముదుగుతూం లాంటిది తవ్వి, వీధంట ఆనీరు వెళ్ళేటట్టు చేసింది. తక్షణమే మలాషాకూడా వచ్చేసి, ఓ పుల్లతో తనుకూడా పిల్ల కాలవ తవ్వుతూ అకూల్యాకి తోడ్పడింది. మనుషులు కొట్టు గోడం ప్రారంభించబోయే సమయానికల్లా, ఆ పిల్లలు తవ్విన పిల్లకాలవ నీరు బాగా వీధినిపడి. జనాన్ని శాంతపరచడానికి ముసలమ్మ యత్నిస్తూన్న స్థలం దగ్గిరికే దేకింది. అ పిల్లకాలవకి చెరోపెడా పహరాయిస్తూ ఆ బాలికలూ ఉన్నారు. అకూల్యా, "పట్టుగో, మలాషా, దాన్ని పట్టుగో!" అని కేకలేస్తోంది. మలాషా నవ్వుతో ఊపిరితిరగక అసలే మాట్లాడలేకుండా ఉంది. ఎంతో ఆనందపడుతూ, తవ్వడానికి తెచ్చిన కర్రముక్క తమ కాలవలో తేలి ముందుకి పోతూండడం గమనిస్తూ, ఆబాలికలు తిన్నగా జనసమూహంలోకి పోయారు. అప్పుడు ఆముసలమ్మ వాళ్ళసి గమనించి జనంతో, "మిమ్మల్ని చూచుగుని మీరింకా సిగ్గుపడడంలేదూ? మీదెబ్బలాటంతా ఈబాలకల గురించే. కాని వాళ్ళే సర్వమూమరిచిపోయి సుఖంగా కలిసి ఆడుకుంటూఉండే సమయంలోనే మధ్యమీరెందుకు దెబ్బలాడుకోడం? నాచిట్టి అత్మలారా! ఈబాలికలు మీకంటె ఎక్కువ బుద్ధిగలవాళ్ళు" అంది.

మనుషులంతా ఆబాలికలకేసి చూసి, సిగ్గుపడిపోయి, తమలో తమరు నవ్వుకుంటూ ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

"మీరు మారిపోయి చిన్నపిల్లలయిపోతే తప్ప, స్వర్గరాజ్యం లో ప్రవేశించడానికి మరో మార్గమేలేదు."

---

# కోడిగుడ్డంత ధాన్యపుగింజ

ఒకనాడు కొందరు పిల్లలు ఒక లోయలో ధాన్యపుగింజవంటి రూపంలో ఒక వస్తువు చూశారు. దానికి మధ్య నిలువుగా ఒక గాడి ఉంది, కాని ఆ వస్తువు బాగా కోడిగుడ్డంత పెద్దదిగా ఉంది. దారిని పోతూండే బాటసారి ఒకడు అది వాళ్ళ దగ్గిర్నించి ఓ కానికి కొన్నాడు. అతడు పట్టణానికి వెళ్ళగానే విచిత్రవస్తువుగా దాన్ని రాజుగారికి అమ్మేశాడు. రాజుగారు తన పండితులికి కబురంపి అదేమిటో తేల్చవలసిందిగా వాళ్ళని కోరాడు. వారు ఎంతేనా ఆలోచించారుగాని దాన్ని గురించి తలా తోకా తేల్చలేకపోయారు. ఒకనాడు అది ఒక కిటికీ కమ్మి మీద ఉంటూన్న స్థితిలో ఒక కోడిపెట్ట అక్కడికి ఎగిరి ముక్కుతో పొడవగా దానికి చిల్లుపడింది. దాంతో అది ధాన్యపుగింజ అనే సంగతి అందరికీ విశదమైంది. పండితులు వెళ్ళి 'అది ధాన్యపుగింజేనండి' అని రాజుతో విన్నవించారు. రాజు మిక్కిలి ఆశ్చర్యపడిపోయాడు. అటువంటి ధాన్యం ఎక్కడ ఎప్పుడు పండేదో కనుక్కోవలసిందిగా ఆ పండితుల్ని కోరాడు. పండితులు మళ్ళీ ఆలోచనలోపడి గ్రంథాలు తిరగెయ్యడం మొదలెట్టారు. దాన్ని గురించిన సంగతి ఎక్కడా దొరకలేదు. అప్పుడు వాళ్ళు రాజు దగ్గిరకొచ్చి, 'మీకు సమాధానం చెప్పడం మా వల్లకాదు. పుస్తకాల్లో ఎక్కడా దీని ప్రమేయంలేదు. రయితులెవర్నైనా పిల్చి అడగండి ఇంత పరిమాణంలో ఇటువంటి ధాన్యం ఎప్పుడు ఎక్కడ పండేదో. ఆ రయితులు వాళ్ళ తండ్రులు చెప్పగా

వినేవా ఉండవచ్చును.' అన్నారు. ముసలి రైతు నెవర్నైనా తన ఎదటికి తీసుకు రావాలని రాజు ఆజ్ఞాపించాడు. అటువంటి వాణ్ణి వెతికి నౌకర్లు తీసుకువచ్చారు. ఆ ముసలివాడు నడుం వంగిపోయి పాలిపోయి దంతహీన్యంగా ఉంటూ, రెండు కర్రల మీద ఆనుకుంటూ రాజు సమక్షంలోకి తూలుకుంటూ వచ్చాడు.

అతడికి రాజు ఆ ధాన్యపుగింజ చూపించాడు. దృష్టిలోపం వల్ల ఆ ముసిలాడు దాన్ని తిన్నగా చూడలేక పోయాడు. కాని, ఎల్లాగైతేం అది పుచ్చుకుని ముట్టుకుని చూశాడు. రాజు, 'ఓ వృద్ధా, చెప్పగలవా ఇల్లాంటి ధాన్యం పూర్వం ఎక్కడ పండేదో? ఇల్లాంటి దెప్పుడేనా కొన్నావా? ఇల్లాంటి విత్తులు నీ పొలంలో ఎప్పుడేనా చల్లి చూశావా?' అని అతణ్ణి అడిగాడు. ముసలాడికి చెముడు కూడానూ, కర్మం! అందుచేత రాజు ప్రశ్నలు అతడికి అవగాహన అయేసరికి చచ్చినంతపని జరిగింది. సమాధానం బ్రహ్మాండంమీద, చెబుతూ 'అబ్బెబ్బే! నా పొలాల్లో ఇల్లాంటిది ఎన్నడూ నేను చల్లలేదు, పండించ లేదు. ఇల్లాంటిది ఎన్నడూ నేను కొనాలేదు. మీరు మా నాన్నని కనుక్కోండి. ఇల్లాంటి ధాన్యం ఎక్కడ పండేదో అతడు వినుండవచ్చు' అన్నాడు. ఆ మట్టున రాజు అతడి తండ్రికి కబురు చెయ్యగా అయన్ని రాజు ఎదట హాజరు పెట్టారు. ఆయన ఒక్క కర్రమీదే ఆనుకుంటూ వచ్చాడు. రాజు ఆ గింజ ఆయనకి చూపించాడు. ఆ ముసిలి రైతుకి దృష్టి యింకా సరిగ్గానే ఉండడంవల్ల ఆ గింజని ఆయన పరిశీలనగా చూశాడు. రాజు, 'ఓ వృద్ధా! చెప్పగలవా ఇల్లాంటి ధాన్యం పూర్వం

ఎక్కడ పండేదో? ఇల్లాంటి చెప్పుడేనా కొన్నావా? ఇల్లాంటి విత్తులు నీ పొలంలో ఎప్పుడేనా చల్లి చూశావా?' అని ఆయన్ని అడిగాడు. ఈయనకి చెముడు లేకపో తేమగాని, కొడుకుకి వినపడేకంటే ఈయనకే బాగా వినిపిస్తుంది ఆయన. "అబ్బెబ్బే! నా పొలాల్లో ఇల్లాంటిది ఎన్నడూ నేను చల్లలేదు. పండించాలేదు. కొన్నావా అంటారా. ఇల్లాంటిది కొనాలేదు. ఏమంటే నా కాలంలో ధనం అనేది అట్టే వాడుకలోకి రాలేదు. ఎవడి ధాన్యం వాడే పండించుకునేవాడు లోటొచ్చిన వాడికి అవసరంగా పండించినవా డిచ్చేవాడు. ఇటువంటి ధాన్యం ఎక్కడిక పండేదో నే నెరగను. మా నాటి ధాన్యం ఈ నాటి ధాన్యం కంటే పెద్దదిగా ఉంటూ ఎక్కువ పిండికుడా అయేదేకాని, ఇంత పెద్దగింజ మాత్రం నే చూడలేదు. కానైతే మా కాలంలో కంటే, తమరి కాలంలో గింజ పెద్దదనిన్నీ ఎక్కువపిండి అయే దనిన్నీ మా నాన్న చెబుతూండగా వింటూండే వాణ్ణి. ఆయన్ని పిలిపించి కనుక్కోండి.' అన్నాడు. అందు మీదట రాజు ఈ ముసిలాయన తండ్రిగారికి కబురు చెయ్యగా, వార్నికుడా ఎక్కడున్నారో వెతిగి. పట్టుకుని రాజు సమక్షంలోకి రావిం చారు. వారు ఏ కర్రా గర్రా అక్కర్లేకుండా స్వంత కాళ్ళతో నడుస్తూ సుళువుగా చక్కావచ్చారు. వారిచూపు సుబ్బరంగా ఉంది. వినికిడి చక్కగా ఉంది. మాట స్పష్టంగా ఉంది. రాజు ధాన్యపుగింజ వారిచేతి కిచ్చారు. వారది పుచ్చుగుని దాన్ని చేతులో తిరగా బోర్లావేసి చూశారు.

వారు—ఇంత చక్కటి గింజ చూసి చాలాకాలం అయింది. (అని అది కొరికి రుచి చూస్తూ) అవునవును, ఆ జాతిదే!

రాజు—తాతగారూ! ఎప్పుడు ఎక్కడ పండేదీ ఇటువంటి ధాన్యం? ఇల్లాంటి దెప్పుడేనా మీరు కొనుక్కున్నారా? లేక మీ పొలాల్లో చల్లి చూశారా?

వారు—ఇల్లాంటి ధాన్యం నా కాలంలో ప్రతీచోటా పండేది, నా చిన్నతనంలో ఇల్లాంటి ధాన్యమే మేం తిని ఇంకోళ్ళకీకుడా పెట్టేవాళ్ళం. మేం ఇల్లాంటిదే చల్లి, పండించి, నూర్చేవాళ్ళం.

రాజు—తాతగారూ! చెప్పండి. ఎక్కడేనా మీరు ఇల్లాంటి ధాన్యం కొనుక్కునేవారా, అంతా మీరే పండించుగునేవారా?

వారు—(కొంచెం నవ్వుతూ) నాకాలంలో ఎవడూకుడా ఆహారం కొనుక్కోడమనే పాపమూ, ఆహారం అమ్మడమనే పాపమూ ఎరగడు. ధనం అంటే ఏమిటో మాకు తెలియదు. ఎవడిమట్టుకి సరిపడ ధాన్యం వాడికుండేది.

రాజు—అయితే, తాతగారూ, చెప్పండి చెప్పండి. మీ పొలం ఎక్కడ ఉండేదీ! మీ రెక్కడ పండించేవా రిల్లాంటి ధాన్యం?

వారు—భగవంతుడిదైన ఈ భూమి నా పొలం. నే నెక్కడ దున్నితే, అదీ నా పొలం. నేల అప్పుడు స్వేచ్ఛగా ఉండేది. నేల తనదీ అని ఎవడూ అనుకునేవాడు కాడు. ఎవరేనా తమది అని చెప్పుకో తగ్గది ఒక్కటీ ఏమిటంటే, కాయకష్టం.

రాజు—మరి రెండు ప్రశ్నలకి సమాధానం చెప్పండి. మొదటి ప్రశ్న—అప్పట్లో ఇంత పెద్ద ధాన్యం పండే భూమి ఇప్పుడు మానేసిందేం? రెండో ప్రశ్న—మీ మనమడు రెండు కర్రలమీద అని కుంటుతూ రాగా, మీ కొడుకు ఒక్క కర్రమీద అని రాగా, మీరు ఏ ఆసరాలేకుండా ఖరాగా వచ్చేశారే! పైగా మీ

కళ్ళు ప్రకాశవంతంగానూ మీ పళ్ళు గట్టిగానూ మీ మాట స్పష్టంగానూ చెవికింపుగానూ ఉన్నాయే! మార్పులు ఎల్లా వచ్చాయి ?

వారు——నా కొడుకు తరంలోనూ, నా మనమడి తరంలోనూ మార్పులు ఎందుకు వచ్చాయంటే, స్వకాయకష్టంవల్ల జీవించడం మానేసి, అన్యుల కాయకష్టం మీద ఆధారపడడం జనం మరిగారు గనక. పూర్వకాలంలో భగవంతుడి శాసనాన్ని అనుసరించి జనం జీవించేవారు. వారు తమ శ్రమఫలితమే తమ ఆస్తి అనుకుని, అన్య శ్రమవల్ల ఉద్భవించే వాటిని స్వంతానికి భుక్తం చేసుగోవాలని యెంచేవారు కారు.

# పశ్చాత్తప్తుడైన పాపి

"అతడు ఏసుతో: ప్రభూ! మీ రాజ్యానికి మీరు రాగ లప్పుడు నన్ను జ్ఞాపకం ఉంచుగోండి—అన్నాడు. అతనితో ఏసు : రూఢిగా నీతో అంటున్నాను, నేడే నువ్వు నాతో స్వర్గంలో ఉంటావు"—(లూకా xxiii-42, 43)

పూర్వం ఒకానొకడు భూమిమీద డెబ్భైయేళ్ళపాటు జీవించాడు అన్నమాటే కాని, డెబ్భైయేళ్ళూకుడా పాపాల్లోనే మునిగి తేలాడు. మంచం పట్టాడు, పట్టినానరే పశ్చాత్తాపపడలేదు. చిట్టచివర క్షణంలో, ఇక మరణిస్తాడనగా, అతడు ఏడుస్తూ, "ప్రభూ! నన్ను క్షమించు. సిలువమీది దొంగని క్షమించిన వాడవుగదా నువ్వు." అన్నాడు. అతడు ఈ మాటలు అంటూండగానే, అతని ఆత్మ ఆతని శరీరాన్ని విడిచిపెట్టేసింది. అప్పటికి ఆపాపి యొక్క ఆత్మకి దేవుని యెడల భక్తీ దైవ కృపలో విశ్వాసమూ అనుభవంలోకి రాగా, ఆ ఆత్మ స్వర్గద్వారం దగ్గిరికి వెళ్ళి పరలోక రాజ్యంలోకి ప్రవేశం అర్థిస్తూ తలుపు తట్టడం జరిగింది. అప్పుడు ఆగేటులోపల్నించి ఒక కంఠస్వరం, "ఎవడా మనిషి, స్వర్గద్వారం తెరవండనితట్టుతున్నాడూ? భూమి మీద జీవించినప్పుడు వాడు చేసిన పన్లు ఏమేమిటి?" అని వినపడింది. అప్పుడు లోపలే ఉన్న నేరారోపకుడు ఆ ప్రశ్నలకి సమాధానంగా, ఆమనిషి చేసిన చెడుపనులన్నీ ఏకరువుపెట్టాడు, మంచిపని ఒకటీ చెప్పలేదు. తరవాత, మళ్ళీ మొదటి కంఠస్వరం, "పాపులు స్వర్గరాజ్యంలో ప్రవేశించలేరు. వెళ్ళిపో!" అని

వినపడింది. అప్పుడా మనిషి, "ప్రభూ! నీ కంఠస్వరం వినిపిస్తోంది. కాని, నీ ముఖం కనపడటంలేదు. నీ పేరూ నాకు తెలియదు" అన్నాడు. "నేను అపోస్తలుడైన పేతురుని" అని కంఠస్వరం వినపడింది. పాపి, "అపోస్తలుడవైన పేతురా! నన్ను కనికరించు. మానవుని లోపాలూ దేవుని కృపా జ్ఞాపకం చేసుకో. నువ్వు క్రీస్తు శిష్యుడవై ఉండలేదా? ఆయన బోధ ఆయన నోటంటే నువ్వు వినుండలేదా? ఆయన జీవితం మార్గదర్శకంగా నువ్వు గణించవా? అయితే జ్ఞాపకం చేసుకో. ఆయన దుఃఖిస్తూ ఆత్మలో క్షోభపడేటప్పుడు నిన్ను మెలకువగా ఉండి ప్రార్థించు అని మూడుసార్లు కోరగా, మూడు సార్లూ నువ్వు నిద్రే—నీ కన్ను బరువెక్కడంచేత. మూడు సార్లూ నీ నిద్ర ఆయన చూశాడు. నా సంగతీ అటువంటిదే. ఇంకా జ్ఞాపకం చేసుకో. చచ్చిపోయేవరకూ కృతజ్ఞుణ్ణి అయి ఉంటానని వాగ్దానం చేసిన మహానుభావుడవే. ఆయన్ని కైఫా ఎదటికి తీసుకుపోయినప్పుడు, ఆయన్ని ఎరగను పొమ్మని మూడుసార్లు అనేశావు. నా విషయమూ అటువంటిదే. మరికొంచెం జ్ఞాపకం చేసుకో. ఏరీతిగా కోడికూసినప్పుడు నువ్వెళ్ళి గొల్లుమని దుఃఖిస్తూ ఏడిచావో, నా వ్యాపారమూ అటువంటిదే. నువ్వు నన్ను లోపలికి రాకుండా చెయ్యగలవాడవు?" అన్నాడు. గేటు అవతలి కంఠస్వరం మరి లేవలేదు. కొంతసేపు ఊరుకుని. పాపి, స్వర్గరాజ్యంలోకి రానియ్యవలసిందని మళ్ళీ తట్టడం మొదలెట్టాడు.

అప్పుడు గేటువెనకాలనించి మరోకంఠస్వరం పాపికి వినపడింది: "ఎవరు ఈమనిషి? భూమిమీద ఏరకంగా జీవించాడు?" అని. మళ్ళీ లోపలేవున్న నేరారోపకుడు ఆమనిషిచేసిన చెడ్డుపను

లన్నీ ఏకరువుపెట్టాడు, మంచిపని ఒకటీచెప్పలేదు. ఆపైని, గేటు అవతలి కంఠస్వరం: "ఇక్కణ్ణించి వెళ్ళిపో. ఇటువంటి పాపులు మాతోకలిసి స్వర్గరాజ్యంలో ఉండజాలరు" అని వినిపించింది. అప్పుడు ఆపాపి, "ప్రభూ! నీ కంఠస్వరం వినిపిస్తోంది. కాని, నువ్వు కనిపించడంలేదు. నీపేరూ నాకుతెలియదు" అన్నాడు. ఆమీదట ఆ కంఠస్వరం, "నేను దావీదుని—రాజుని, ద్రష్టని" అంది. పాపి నిస్పృహచెందక స్వర్గంయొక్క గేటుని పట్టినపట్టూ వదలక, "నామీద కనికరం చాల్చు, దావీదు రాజా! మానవుని లోపాలూ దేవునికృపా జ్ఞాపకం చేసుకో. దేవుడు నిన్ను ప్రేమించి మానవులలో నీకు మహౌన్నత్యం కల్పించాడు. సమస్తమూ నీకిచ్చాడు—రాజ్యం, గౌరవం, ఐశ్వర్యం, భార్యలు, సంతానం! కాని, నీ మేడమీదినుంచి నువ్వు ఒక పేదవాని భార్యని చూశావు, పాపం నీలో ప్రవేశించింది, ఆపేదవాణ్ణి మరొకళ్ళచేత చంపించేసి ఆవిణ్ణి నువ్వు పుచ్చేసుకున్నావు. ధనికుడవై ఉండి ఆపేదవాడి ఒక్క ఆడగొఱ్ఱెని లాక్కున్నావు, వాణ్ణి కాజేశావు. అటువంటిచే నేనూచేశాను. ఇంకా జ్ఞాపకం చేసుకో. నువ్వు పశ్చాత్తాప పడ్డావే, పైగా రచనచేశావ్, "నా పాపాలన్నింటినీ నేను ఒప్పుగుంటున్నాను. నేచేసిన పాపం ఎల్లకాలమూ నాకళ్ళముందు ఉంటుంది," అని. నేను చేసిందీ అటువంటిదే. నన్ను లోపలికి రాకుండా నువ్వుచెయ్యలేవు." అన్నాడు. గేటు అవతలి ఈకంఠస్వరమూ మరిలేవలేదు. కొంతసేపు ఊరుకుని, పాపి, స్వర్గరాజ్యంలోకి రానియ్యవలసిందని మళ్ళీ తట్టడం మొదలెట్టాడు. ఇప్పుడు గేటువెనకాల్నించి మూడో కంఠస్వరం వినపడింది: "ఎవరు ఈ మనిషి? భూమిమీద జీవితం ఏప్రకారంగా గడిపాడు? అని. అప్పుడు నేరారోపకుడు

మూడోసారి ఆపాపిచేసిన చెడుపనులు ఏకరువుపెట్టడమూ, మంచిపని ఒక్కటీకూడా చెప్పకపోవడమూ వినిపించింది. తరవాత గేటులోపల్నించి, "ఇక్కణ్ణించి వెళ్ళు. పాపులు స్వర్గరాజ్యంలో ప్రవేశింపలేరు" అని వినపడింది. అందుకు పాపి, "నీకంఠస్వరం వినిపిస్తోంది, కాని నీముఖం నాకు కనిపించడం లేదు. నీపేరూ నాకు తెలియదు," అన్నాడు. దానికి లోపల్నించి, "నేను యోహాను అనే దివ్యజ్ఞానిని, క్రీస్తు ప్రియశిష్యుణ్ణి" అని వినపడింది. ఆమట్టున, పాపి, ఆనందంతో, "ఇకనిప్పుడు తప్పకుండా నన్ను లోపలికి రానిస్తారు మీరు. పేతురూ దావీదూ నన్ను రానిచ్చితీరాలి. ఏమంటే: వాళ్ళకి మానవుడి లోపమూ దేవుని కృపా తెలుసు. నువ్వూ నన్ను రానిస్తావు. ఏమంటే: నీప్రేమ అపారం. దివ్యజ్ఞానివైన యోహానువి నువ్వే కదయ్యా "దేవుడు ప్రేమయే" అనీ, "విశ్వప్రేమలేనివాడు దేవుణ్ణి తెలుసుగోలే" డనీ లిఖించిన వాడవూ? పైగా నీవార్తకంలో నువ్వు మానవులతో చెప్పలేదూ: "సోదరులారా! అన్యోన్యప్రేమ గలిగి ఉండండి"—అనీ? అటువంటప్పుడు, నువ్వు నన్నుద్వేషించి ఎట్లా బయటికి తరిమివెయ్యగలవు? లోగడ నువ్వు అన్నమాటలు ఇప్పుడు ఉపసంహారమేనా చేసుగోవాలి, లేదా నామీద ప్రేమచూపి, స్వర్గరాజ్యంలోకి నన్ను రానిచ్చి తీరాలి" అన్నాడు.

అప్పుడు స్వర్గరాజ్యం తలుపులు తెరుచుకోగా, పశ్చాత్తప్తుడైన ఆపాపిని యోహాను కౌగిలించుకొని స్వర్గరాజ్యంలోకి తీసుగు పోయాడు.

# పని, మరణం, అనారోగ్యం

ఒక పుక్కిటి పురాణం

ఇది దక్షిణ అమెరికా హైండవుల్లో ప్రచారంలో ఉన్న ఒక పుక్కిటి పురాణం.

దేవుడు మానవ జాతిని నిర్మించడంలో వాళ్ళు పనిచెయ్య వలసిన అవసరం లేకుండానే ఏర్పాటు చేశాడు—అంటారు. మొదట్లో మానవులకి ఇళ్ళ అవసరంగాని, దుస్తుల అవసరం గాని, ఆహార అవసరం గాని లేకుండా ఆయన ఖంజాయింపు చేశాడుట. ప్రతీవాడూ నూరేళ్ళూ జీవించేవాడుట, సుస్తీ అంటే యేమిటోకుడా తెలియకుండా.

కొంతకాలం జరగగా, మానవజాతి ఎల్లా ఉంటున్నారో చూడడానికి వచ్చి దేవుడు గమనించేసరికి, సుఖంగా జీవితాలు గడుపుగోడంబదులు మానవులు ఒకరితో ఒకరు కాట్లాడుకుంటూ, ఎవరి పొట్టగురించి వారు జాగ్రత్తపడుతూ వ్యవహరించి, జీవితానికీ ఆనందానికీ చుక్కెదురనుకుని జనం జీవితాన్ని శపించడం మొదలెట్టే విషమ పరిస్థితి కల్పించారు. అప్పుడు దేవుడు, 'ఇదంతా జనంయొక్క వేర్పేరు ఒంట్రెత్తు జీవితాలవల్ల పుట్టింది', అనుకుని ఆ పరిస్థితి మార్చదల్చుగున్నాడు. పని చెయ్యకుండా మానవులు జీవించడం అసంభవం అయేలాగు ఆయన కొత్త ఏర్పాటు చేశాడు. చలిబాధ తట్టుగోడానికి వాళ్ళు కొంపలు కట్టుగోవలి సొచ్చింది, ఆకలిబాధ తీర్చుగోడానికి నేల తవ్వి ధాన్యాలూ పళ్ళూ కాపించి భోగుచేసుగోవలి సొచ్చింది.

'పని మానవుల్ని సమూహపరుస్తుంది. వాళ్ళు పనిముట్లు చేసుగోదలిచినా, కలపకోసి రవాణా చేయదలిచినా, ఇళ్ళు కట్టదలిచినా, విత్తులు చల్లి కుప్ప నూర్చదలిచినా, దారంతీసి బట్టలు నెయ్యదలిచినా, దుస్తులు కుట్టదలిచినా, ఒక్కొక్కడివల్ల అయేది కాదుగదా. అందరూ హృదయపూర్వకంగా కలిసి పనిచేస్తే ఫలితం వృద్ధి అవుతుందనీ, జీవితం సుఖతరం అవుతుందనీ మానవులకి అప్పుడు బోధపడుతుంది. ఆ అవగాహన వాళ్ళని ఐక్యపరుస్తుంది', అని ఆయన అనుకున్నాడు.

కొంతకాలం గడిచింది. మానవుల స్థితి ఏమాత్రం మారిందో వెనకటి కంటె సౌఖ్యం ఎక్కువైందేమో చూడడానికి దేవుడు మళ్ళీ వచ్చాడు. మానవులు పూర్వంకంటె పాడైనట్టు ఆయన గ్రహించాడు. గత్యంతరం లేనప్పుడు వాళ్ళు కొంతవరకు కలిసి పనిచేసినా, పూర్తిగా కలియలేవనివన్నీ చిన్నచిన్న సంస్థలుగా విడిపోయినట్టున్నూ కూడా ఆయన గమనించాడు. ప్రతీ సంఘమూ తక్కిన సంఘాల పని ఊడలాక్కోడమూ, తక్కిన సంఘాలకి ఆటంకాలు కల్పించడమూ, కలహాల్లో కాలమూ బలమూ అందరూ వ్యర్థం చేసుగోడమూజరిగి, మొత్తంమీద మానవుల వ్యవహారం బాగులేనట్టు కనబడింది. రెండో విధానంకూడా పట్టివ్వకపోవడం గుర్తించి, దేవుడు కొత్తఏర్పాటు చేశాడు, మరణం ఎప్పుడు రాగలదో ఇకమీదట మానవుడికి తెలియబడదు, మానవుడు ఏక్షణంలోనైనా మరణించవచ్చు, జాగర్త—అనే విషయం మానవజాతికి యథావిధిగా తెలుపుడు చేశాడు. ఆయన ఉద్దేశం ఏమనీ; మానవుడు ఎవడైనా సరే ఏక్షణంలోనైనాసరే మరణించ

వచ్చు అనే సంగతి మానవులకి తెలిసిఉంటే, తమరికి కేటాయింపబడ్డ జీవితవ్యవధి కాస్తా పాడుచేసుగుని క్షణికలాభాలు గుంజుకోడానికి మానవులు యత్నిస్తూ కూర్చోరు—అని.

కాని, ఈ సారికూడా మరొక మోస్తరుగానే జరిగింది. మానవుల సంగతి ఎల్లా ఉందో అని దేవుడు మళ్ళీవచ్చి చూడగా, అది ఎంత పాడుగా ఉండి ఉండేదో అంత పాడుగానూ ఉంటూనే ఉంది. ఏ క్షణంలో నైనాసరే మానవుడు మరణించవచ్చు, అనే కొత్త యథార్థ విషయాన్ని పురస్కరించుగుని సొమ్ము చేసుగో వచ్చు, ఒక్కలి బలవంతులు బలహీనుల్ని కొంతర్ని చంపి తక్కిన వాళ్ళని చంపుతామని బెదిరించి అణగ దొక్కేశారు. మరోటి ఏం జరిగిందంటే, బలవంతులూ వాళ్ళ వారసులూకూడా పని ఎగబెట్టేసి. బలహీనులు తమ శక్తికి మించిన పని చెయ్య వలి సొచ్చి విశ్రాంతి లేక బాధపడుతూంటే, తమరు సోమరి తనంతో అసిలిపోయి బాధపడుతోచ్చారు. ఈ రెండు తెగల వాళ్ళకీ పరస్పరభయమూ పరస్పర ద్వేషమూ ప్రబలి పోయాయి. మానవజీవితం మరీ అసౌఖ్య దాయకం అయింది. దేవుడు ఇదంతా చూసి పరిస్థితి తిన్న పరచడానికి చివరిసాధనం కూడా ప్రయోగించ నిశ్చయించుగుని, రకరకాల అనారోగ్యాలు మానవుల కోసం పంపించాడు. ఆయన సంకల్పం ఏమిటీ: మానవులు అనారోగ్యానికి లోనైనప్పుడు ఆరోగ్యవంతులు వ్యాధిగ్రస్తుల మీద కనికరం చూపించి వాళ్ళకి సాయపడతారనిన్నీ. వాళ్ళ వంతు వొచ్చినప్పుడు వాళ్ళకి రోగం రాగానే అప్పట్లో ఆరోగ్యవంతులు వాళ్ళకి సాయపడతారనిన్నీ. దేవుడు వెళ్ళిపోయాడు.

మానవులు వ్యాధిపీడితు లవడం మొదలెట్టిం తరవాత ఎల్లా ఉంటున్నారో చూడడానికి ఆయన మళ్ళీ వచ్చాడు. మానవుల జీవితం ఎప్పటికంటె మరీ పాడుగా ఉంటూన్నట్టు ఆయన గ్రహించాడు. మానవుల్ని ఏకం చేస్తుందని ఆయన ఉద్దేశించిన అనారోగ్యం మానవుల్ని ఎప్పటికంటె ఎక్కువగా చీలదీసేసింది. ఇతరుల్నించి పనిపుచ్చుకో గలిగినలాంటి బలవంతులు తమరికి అనారోగ్యం రాగానే ఆ యితరులు తమరికి ఉపచరించాలని నిర్బంధించారేకాని, మళ్ళీ ఆయితరులకి రోగసమయం వచ్చినప్పుడు వాళ్ళ అతీగతీ కనుక్కోడం మానేశారు. అల్లాగ్గా, బలవంతుల బదులు పనీచెయ్యవలసివచ్చి, బలవంతుల వ్యాధి కాలంలో వాళ్ళకి ఉపచరించావలిసొచ్చి, బలహీనులు తమలో ఎవరికేనా సుస్తీచేసినప్పుడు వాళ్ళని కాస్త కనిపెట్టడానికి తీరిక లేక ఎల్లాఉన్న వాళ్ళని అల్లా వదిలేసి ఊరుకోవలిసొచ్చేది. పైగా, రోగిష్టి హీనుల దర్శనం వల్ల ధనికుల ఆనందానికి భంగపాటు రాకుండా ఉండడానికి, వాళ్ళయిళ్ళు దూరంగా కట్టి వాటిల్లో వాళ్ళు బాధపడి మరణించడానికి వీళ్లుకలిగించారు—దగ్గిరిగా ఉంటే కనికరంగలవాళ్ళెవళ్ళేనా వచ్చి వాళ్ళకి కాస్త ధైర్యమేనా చెప్పుండేవాళ్ళు గదా అని అనుకో అక్కర్లేకుండానూ; అదీకాక, ఆ మరణం కుడా కూలికి కుదురుకున్న ఉపచారకుల చేతుల్లో; వాళ్ళకి కనికరం లేకపోవడం మాత్రమేకాదు, అసహ్యం ఉండడం కుడా యాధే. మరోవిషయం ఏమంటే, వ్యాధుల్లో చాలాభాగం అంటుడురకంగా వ్యాపించి, జనం రోగుల్నించేకాదు, ఆ రోగులికి ఉపచరించే వాళ్ళనుంచి కుడా వీలైనంత ఎడంగా

ఉండేటట్టు జాగ్రత్త పడుతోచ్చారు. అప్పుడు దేవుడు అనుకున్నాడు; ఈ సాధనంవల్లా మానవులకి బోధకలిగి తమసౌఖ్యం ఎక్కడుందో తమరికి తెలియకపోతే, పోనీ వాళ్ళు బాధలు పడుతూ బోధపరుచుగుంటూ ఉండనీ, అని.

అట్లా దేవుడు మానవుల్ని వాళ్ళని వాళ్ళకే వదిలేసిన ఎంతో దీర్ఘకాలానికి గాని—మానవులందరూకూడా ఎంత సుఖంగా ఉండవలసినమాటో, ఎంత సుఖంగా ఉండడం సంభవనీయమో. మానవులకి బోధపడలేదు. చాలా ఇటీవలే మానవులు గ్రహించడం మొదలెట్టారు: పని అనేది కొందరికి పెనుభూతంలాగా ఇంకా కొందరికి సంకెళ్ళ దాస్యంలాగా కనిపించవలసిందికాదు, అది అందరికీ సంబంధించి సుఖదాయకమైన వృత్తిగా తోచి మానవుల్ని ఏకం చెయ్యాలి, అనిన్నీ—మరణం అనేది మానవుల్ని అనుక్షణమూ బెదిరిస్తూనే ఉంటుంది గనక, మానవులు తమరి వాటాకి ఏర్పాటైన వత్సర మాస దిన నిమిష ముహూర్తాలు ఐక్యభావంలోనూ విశ్వప్రేమలోనూ గడపాలి, అనిన్నీ—అనారోగ్యం అనేది మానవుల్ని వేరు చేసేదికాదు, సరిగదా. అనేకులు ఐక్యం అవడంగురించి మక్కువ పెంచుగోడానికి మానవులకి తరుణం ఇచ్చేది, అనిన్నీ!

# కీడు వ్యామోహపరుస్తుంది, కాని మేలు నిలుస్తుంది

వెనకటి కాలంలో దయాపరుడైన ఒక మంచి మనిషి ఉండేవాడు, ఐహిక సౌఖ్యం చేకూర్చే వస్తువులన్నీ అతడికి కొల్లలుగా ఉండేవి, సేవించడానికి పోతెడుమంది బానిసలుండే వారు. ఆ బానిసలు తమ యజమాని గురించి సగర్వంగా మాట్లాడుతూ. "మా యజమాని కంటె శ్రేష్ఠతరుడైన యజమాని భూమ్మీద లేడు. ఆయన మాకు సమృద్ధిగా తిండిపెట్టి బట్టలిచ్చి, పనివాడి బలానికి తగ్గపనే చెబుతూంటాడు. ఆయన పరహింస తల పెట్టడు, ఎవడితోనూ పరుషంగా పల్లెత్తు ఎన్నడూ మాట్లాడడు. ఆయన తక్కిన యజమానులకి మల్లేకాదు—బానిసల్ని పశువుల కంటె అన్యాయంగా చూసే, శిక్షాపాత్రులైనా కాకపోయినా వాళ్ళని శిక్షించే, అంతఃకరణ శుద్ధిగల మాట ఒక్కటీ కూడా వాళ్ళతో ఆడకుండా ఉండే, వ్యవహరించడానికి! ఆయన మా బాగు కోరతాడు, మాకు మేలు చేస్తాడు, మాతో దయగా మాట్లాడతాడు. ఇంతకంటె సుఖతర జీవితం మేం కోరుకోం" అనేవారు.

ఆ బానిసలు తమ ప్రభువుని ఆ రీతిగా ప్రశంసించడం గమనించి, మహాశని—సేవకులు తమ యజమానితో ఇంత అన్యోన్య ప్రేమతో ఇంత కలిసి మెలిసి ఉండనా, అని మహా కుళ్ళిపోయాడు. అందుకని, అతడు ఆ బానిసలో ఒకడైన ఆలిబా అనే

వాణ్ణి వశపరుచుగుని, తక్కిన బానిసల్ని కుడా బెల్లించి లాగె య్యాని అతణ్ణి ఆజ్ఞాపించాడు. తరవాత ఒకనాడు బానిసలంతా కలిసి విశ్రాంతిగా కూచుని యజమాని మంచితనం చెప్పు కుంటూండే సమయంలో, అలిబా కుడా నోరెత్తి, 'మన యజ మాని మంచితనమే ముఖ్యాతి ముఖ్యం అయినట్టు మాట్లాడ్డం బుద్ధితక్కువ. ఏ మహా శని అయినాగానీ, అతడు కోరింది మనం చేసిన నాడు, మన యెడల దయగానే ఉంటాడు. మనం మన యజమానిని సరిగ్గా సేవిస్తున్నాం. అన్ని విషయాల్లోనూ ఆయన మాటకి తాళం వేస్తున్నాం. ఆయనకి ఏదేనా సంకల్పం కలగగానే, ముంజూపుతో, ఆయన కోరేది చేస్తున్నాం, అటువం టప్పుడు ఆయన మన యెడల దయగా ఉండక ఏం జెయ్యగల దేమిటి! ఏదీ. ఆయన అన్నదానికి తాళం వెయ్యడం మానేసి, దానికి బదులు ఏ కొంచెం హానోచేసి చూడండి, కాస్త. అప్పు డెల్లా ఉంటుందో రంగ!? అప్పుడు ప్రతీ యజమానీ ప్రవర్తించే టట్టే ఆయనా ప్రవర్తిస్తాడు, మనం చేసిన కీడుకి తగ్గ కీడు ముట్ట చెప్పేస్తాడు, మిక్కిలి దుష్ట యజమాని లాగ!'' అన్నాడు.

తక్కిన బానిసలు అలిబా చెప్పిందాన్ని వ్యతికరించడం మొదలెట్టారు. చిట్టచివరకి పంధెం అంటే పందెంలోకి దిగింది. తమ యజమానికి కోపం తెప్పించుతానని అలిబా అచ్చు కున్నాడు. అతడట్లా చెయ్యలేకపోతే, అతడి పండగదుస్తు అతడు వదులుకునే టట్టున్నూ, అతడు నెగ్గితే తక్కిన వాళ్ళంతా తమ పండగదుస్తులు వదులుకునే టట్టున్నూ ఒప్పందం అయారు.

పైగా, ఒకవేళ అలిబాని గొలుసుల్తో కట్టెయ్యడంగాని చెఱసాలలో పెట్టెయ్యడంగాని జరిగితే, తక్కిన బానిసలు యజమానికి ఎదురు తిరిగి అలిబాని వెనకేసుకొచ్చి అతణ్ణి బంధవిముక్తుణ్ణి చేసేటట్టు కుడా వాళ్ళు నిరుకు పరచుగున్నారు. పందెం ఖంజాయింపు అల్లా అయిన తరవాత, యజమానికి కోపం వచ్చేటట్టు ఆ మర్నాడే చేస్తానని అలిబా ఒప్పుగున్నాడు.

అలిబా గొల్లవాడు. అక్కడి కాపలాలో హెచ్చు విలవలు గలిగిన జాతి గొఱ్ఱెలు చాలా ఉన్నాయి. అవంటే యజమానికి చాలా అప్యాయం. మర్నాడు పొద్దున్న యజమాని తన విలువ గొఱ్ఱెల్ని చూపించడానికి కొత్త చూపర్లని తీసుగుని ఆ ఆవరణలోకి రాగానే అలిబా తనసాటి వాళ్ళకేసి కన్ను గీటాడు——చూస్కోండరా, ఈయనకి నేను ఎంత కోపం తెప్పించేస్తానో!—అన్నట్టు.

తక్కిన బానిసలంతా పోగుపడి కొందరు దాకుల దగ్గిర నుంచునీ కొందరు సరిహద్దు కంచెపైనించీ గొఱ్ఱెల దొడ్లోకి చూస్తూ ఉన్నారు. తన భృత్యుడు పని ఎట్లా సాధిస్తాడో చూడడానికి మహాశని ఆ దగ్గిరేఉన్న చెట్టెక్కి కూచున్నాడు. ఆవరణచుట్టూ నడుస్తూ యజమాని తనకున్న ఆడగొఱ్ఱెల్నీ గొఱ్ఱెపిల్లల్నీ అతిథులకి చూపిస్తూ, వెంటనే మిక్కిలి ఉత్తమమైన తన పొట్టేల్ని చూపించ దల్చుగుని, 'పొట్టేళ్ళన్నీ కుడా విలవగలవే. కాని, ఒత్తుగా ఉంగరాలు తిరిగినకొమ్ముల్తో పొట్టేలు ఒకటి ఉంది. అది అమూల్యం. ఆ పొట్టేల్ని ప్రాణపదంగా చూసుగుని, మురిసిపోతూ ఉంటాను' అన్నాడు.

కొత్తమొహాల్ని చూసి బెదిరిపోయి గొర్రెలు ఆవరణ అంతటా ఎటుపడితే అటు పరుగు మొదలెట్టాయి. అందువల్ల ఆ కొత్త చూపర్లు ఆ పొట్టేల్ని తిన్నగా చూడడమే పడలేదు. అది ఒక సారి నిశ్చలంగా నుంచుంది. అప్పుడు అలిబా వెళ్ళి మందని బెదరగొట్టాడు—ఆ బెదరడం ధైర్యమే గాని మరోటి కాదని ఇతరులు అనుకునేటట్టు జాగ్రత్తపడి. దాన్తో అవన్నీ మళ్ళీ కలగాపులగం అయిపోయినాయి. చూడొచ్చినవాళ్ళు ఆ అమూల్య మైన పొట్టేలు ఫలానా అని నిర్ధరించుగోలేకపోయారు. చివరికి యజమానికి విసిగెత్తిపోయి, "అలిబా, ప్రియనేస్తం! దయచేసి మన పొట్టేళ్ళరాజుని పట్టుగో—కొమ్ములు ఒత్తుగా మెలికెలు తిరిగుంటాయే: దాన్ని. అతి జాగ్రతగా పట్టుగోమీ, పట్టుగుని ఒక్కక్షణం దాన్ని కదలనీకు, బాబూ!" అన్నాడు.

యజమాని ఇల్లా అన్నాడో లేదో అమట్టున అలిబా ఆ గొర్రెల్లో సింహంలాగ దొరబడి, ఆ అమూల్యమైన పొట్టేల్ని పట్టేశాడు. ఉన్నిదొంకపుచ్చుగుని దాన్ని ఆపేసి, దాని ఎడమ వెనక్కాలు ఒడేసిపట్టి ఆ యజమాని కళ్ళముందే, ఆకాలు లేవ నెత్తి గభుక్కున ఒక్కలాగు లాగేశాడు, ఎండు చిమ్మగులాగ అది పళక్కుమంది. ఇల్లా అతడు పొట్టేలు కాలు విరిచెయ్యగా అది బాబా అని అరుస్తూ ముందరకాళ్ళమీదికి కూలబడిపోయింది. ఎడంవెనక్కాలు పూర్తిగా కుంటుపడి వేళ్ళాడి మెలికెలు తిరిగి పోతుండగా, అలిబా దాని కుడివెనక్కాలు పట్టుగున్నాడు. చూడొచ్చినవాళ్ళూ బానిసలూ దుఃఖపడి హాహాకారాలు చేశారు. వెళ్లైక్కి కూచున్న మహాళని, అలీబా తన విధి అంత తెలివి

తేటల్తో నిర్వర్తించినందుకు, ఆనందించేవాడు. యజమాని కాలమేఘగర్జనలాగ గోచరించి, ఆగ్రహించి, తలవంచేసుకుని, నోరుమూతవేసుకున్నాడు. ఏమేమి జరగబోతుందోకదా అని, చూడొచ్చినవాళ్ళూ బానిసలూ కూడా మౌనంగా నిల్చిపోయారు. యజమాని అల్లాగే కాస్సేపు నిశ్శబ్దంగా ఉండి. భుజం మీది బరువుమూట కింద విసిరి పారేసేటప్పుడులాగ. ఒక్కసారి ఒళ్లు విదిలేశాడు. తరవాత ఆయన తన తలపైకెత్తి, దృష్టి ఆకాశం కేసి తిప్పి, మరోకాస్సేపు నిల్చిపోయాడు. వెంటనే ఆయన ముఖంమీది ముడతలన్నీ పోయాయి. అప్పుడు, ఆయన అలిబా వైపు తిరిగి చిరునవ్వు నవ్వుతూ,

"బాబా! అలిబా, అలిబా! నాకు కోపం తెప్పించడం పని మీద నీ యజమాని నిన్ను నియోగించాడు కాని, నాయజమాని నీ యజమానికంటె బలవత్తరుడు. నీమీద నాకు కోపంలేదు. కాని, నీ యజమానికి కోపంవచ్చేలాగ చేసేస్తాను. నేను నిన్ను శిక్షిస్తానని భయపడుతున్నావు, దాస్యవిముక్తి కోరుకుంటున్నావు. కనక, అలిబా, విను. నేను నిన్ను శిక్షించను. సరిగదా, నువ్వు విముక్తి కోరుకుంటున్నావు గనక, ఇదుగో, నా అతిథుల సమక్షంలో చెబుతున్నాను, నీకు ముక్తి ఇస్తున్నాను. నీ చిత్తం వచ్చిన చోటికి వెళ్ళు. నీ పండగ దుస్తు నీకూడా తీసిగెళ్లు" అన్నాడు.

అని, దయాపరుడైన ఆ యజమాని తన అతిథులతో కలిసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు. కాని, మహాశని, పళ్ళు పటపట లాడిస్తూ ఆ చెట్టుమీంచి చచ్చేటట్టు కిందపడి, భూమిలో మునిగి చక్కాపోయాడు.

---

# మూడు ప్రశ్నలు

పూర్వం ఒకరాజు ఉండేవాడు. ఒకసారి అతనికి ఏమని తోచిందంటే: ప్రతిపనీ ప్రారంభించడానికి సరియైన కాలమేదో, వినిపించుకోడానికి గాని తప్పించుకోడానికి గాని తగ్గ మనుషు లెవరో, అన్నింటికీ పైమాట — చెయ్యడానికి మిక్కిలి ముఖ్యమైన పని ఏదో, ఎప్పటి కప్పుడు తనకి తెలిసిపోతూంటే, తను ఏపని చేపట్టినా అపజయం అనేది ఉండదు, అని. ఈఊహ పుట్టగానే, ఆయన తన రాజ్యమంతటా దండోరా వెయించాడు: "మూడు ప్రశ్నలున్నాయి — ప్రతిపనికీ సరియైన కాలం ఏది? మిక్కిలి అవసరమైన వ్యక్తు లెవరు? మిక్కిలి ముఖ్యమైన పని ఏది? — అనేవి. ఈ మూడింటికీ సరియైన సమాధానాలు సాకు బోధించగలవారికి మంచి బహుమానం ఇస్తాను" అని. ఆకర్ణించి చాలామంది పండితులు రాజుని చూడ వచ్చి విధ విధాలుగా సమాధానాలు చెబుతోచ్చారు.

మొదటి ప్రశ్నకి సమాధానంగా: ప్రతిపనికీ అర్హ సమయం తెలియాలంటే రాబోయే దిన మాస సంవత్సరాలకి ఒక కాలపట్టీ తయారు చేసుకుని తూచాలు తప్పకుండా దాన్ని అనుసరిస్తూ జీవించాలి. అల్లా చేస్తేనే ప్రతిపనికీ సరియైన కాలం ఏర్పాటవు తుంది — అని కొందరన్నారు. మరికొందరు, ప్రతిపనికీ అర్హ కాలం ముందుగానే నిర్ణయించడం అసంభవం అని వక్కాణిస్తూ, సోమరులై వినోదాల్లో పడకుండా పరిస్థితులు శ్రద్ధతో గమనించి అప్పటి కప్పుడు అవసరం ఏమిటో తెలుసుకుంటే ఆ పనికి

అర్హకాలం అదే అన్నారు కాని, వేరే కొందరు: వర్తమాన పరిస్థితులు రాజు ఎంత శ్రద్ధతో పరిశీలించ గలిగినా ప్రతీపనికీ అర్హకాలం నిర్ణయించటం అనేది ఏకవ్యక్తికి అసంభవమైన విషయం గనక, బుద్ధిమంతుల్ని పిల్చి ఓ సంఘం ఏర్పాటు చేసుకుంటే ప్రతీపనికీ అర్హకాలం స్థిరపరచడానికి వాళ్ళు సాయ పడవచ్చును, అన్నారు. కాని, ఇంకాకొందరు: సంఘంలో ప్రవేశపెట్టి వారి ఆమోదం పొందేవరకూ ఆగడానికి వీల్లేనివీ, ఒకేవ్యక్తి తక్షణ నిర్ణయం చేసుకోవలసొచ్చేవీ ఔతూఉంటాయి. అయినా, ముందు ఏమి జరగదల్చి ఉందో తెలిస్తేగాని, ఏక వ్యక్తి నిర్ణయానికి రాలేడు. ఏం జరగదల్చి ఉందో తెలిసిన వాళ్ళు జ్యోతిష్కులు. కాబట్టి, ప్రతిపనికి అర్హకాలం తెలియా లంటే జ్యోతిష్కుల్ని సంప్రదించాలి, అన్నారు. రెండో ప్రశ్న సమాధానాల్లోకూడా వైవిధ్యం మొదటి ప్రశ్న సమాధానాల్లో అంతా ఉంది. రాజుకి ముఖ్యులు మంత్రులు, అని కొందరు; అర్చకులని కొందరు; వైద్యులు అని కొందరు; మిక్కిలి అవ సరమైనవాళ్లు యోధులు అని మరికొందరు—సెలవిచ్చారు. మిక్కిలి ముఖ్యమైన పని ఏది అనే మూడవ ప్రశ్నకి సమా ధానంగా కొందరు: శాస్త్రం అన్నారు, మరి కొందరు: యుద్ధ క్రియలో నైపుణ్యం అన్నారు. ఇతరులు మతపరమైన ఆరాధన అన్నారు. ఇన్ని విధాలుగా ఉన్న ఈసమాధానాలలో ఏదీ రాజుకి నచ్చలేదు. అందుచేత అతను బహుమానం ఎవరికీ ఇయ్యలేదు. కాని, ఈ మూడు ప్రశ్నల యొక్క సక్రమ సమాధానాలుగుర్తించిన తాపత్రయం మాత్రం రాజుకి వదలలేదు.

అందువల్ల, ఆ ప్రాంతంలోనే ఒక సుప్రసిద్ధజ్ఞాని వనవాసిగా ఉంటూన్నట్టు విని, రాజు ఆ వనవాసి దర్శనం చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు.

ii

ఆ వనవాసి తనుండే అడవి దాటి బయటికి వచ్చి ఎరగడు. సాధారణ జనాన్ని తప్ప లోపలికి రానిచ్చేవాడు కాడు. అందుకని, రాజు సాదాబట్టలు ధరించి, అతని కుటీరానికి చాలా దూరంగానే గుర్రం దిగి, అంగరక్షకుల్ని వెనకాల వదిలేసి, ఒంటరిగా వెళ్ళాడు. రాజు కుటీరం సమీపించుతూన్న సమయంలో వనవాసి తన కుటీరం ఎదటి స్థలం తవ్వుకుంటున్నాడు. రాజుని చూసి మౌనంగానే హెచ్చరిస్తూ ఇంకా తవ్వుకుంటూనే ఉన్నాడు. అతడు ముట్టుగుంటే చితిగిపోయేటంత పీలగా ఉన్నాడు. పారతో నేలకొడుతూండడమే కాని, కొత్త మట్టేనా రావడంలేదు. పైగా, అతడు ఎంతో భారంగా రోజుతున్నాడు.

రాజు అతణ్ణి సమీపిస్తూ, “ఓ వనవాసీ, మహాజ్ఞానీ! నేను మీ వద్దకు వస్తా మూడు ప్రశ్నల సమాధానాలకోసం. ఏదేనా పనిచెయ్య తగ్గ కాలం నేను ఎట్లా గ్రహించగలను? నాకు మిక్కిలి అవసరం వచ్చేజనం—అనగా తక్కిన వారి యెడల కంటె ఎవరి యెడల నేను ఎక్కువ శ్రద్ధవహించాలో—అటువంటి జనం ఎవరు? నేను శ్రద్ధపట్టవలిసిన అతి ముఖ్య విషయాలు ఏవి?” అని అడిగాడు. వనవాసి రాజు మాటలు విన్నాడే కాని కిమ్మనకుండా ఊరుకుని, చేతులో మాత్రం ఒకసారి ఉమ్మేసుకుని, మళ్ళీ పారపట్టుగున్నాడు.

రాజు —''మీరు అలిశారు ఆపార ఇల్లా తెండి. నాన్నేపు నేను తవ్విపెడతాను'' అన్నాడు

''సరే, నాయనా'' అని, వనవాసి పార రాజుకిచ్చి, తను వెళ్ళి పక్కని కూచున్నాడు.

రెండు మళ్ళు తవ్వడం అయిం తరవాత, రాజు ఆగి, మూడు ప్రశ్నలకీ సమాధానాలు కావాలని మళ్ళీ అడిగాడు. ఏమీ సమాధానం చెప్పకుండానే వనవాసి లేచి, పారకోసమా అన్నట్టు చెయ్యిచాస్తూ, 'మీరు కొంచెం విశ్రమించండి. నన్ను కాస్త చెయ్యనీయండి,' అన్నాడు.

కాని, రాజు అతడికి పార ఇచ్చెయ్యక, తనే తవ్వడం సాగించాడు. గంట దాటింది, రెండు గంటలు దాటాయి. చెట్ల వెనకాల సూర్యుడు అస్తమించబోతున్నాడు. పార నేలలో గుచ్చేసి, రాజు, 'మహాజ్ఞానీ! నేను మీ దగ్గిరికి వచ్చింది, మూడు ప్రశ్నల సమాధానాలకోసం. అవి మీ వల్ల కాకపోతే, అల్లా చెప్పెయ్యండి, నేను వెనక్కిపోతాను.' అన్నాడు.

వనవాసి, 'ఇట్లా ఎవడో పరిగెత్తుకుని వస్తున్నాడు. చూద్దాం ఉండండి,' అన్నాడు.

iii

రాజు తిరిగి చూడగా ఒక గడ్డం మనిషి అడివికి అడ్డంపడి పరిగెత్తుకుని వస్తున్నాడు. వాడు తనపొట్ట చేతుల్తో అదిమి ఉంచగా, రక్తం కిందికి ఓడిపోతోంది. రాజుని సమీపించగానే వాడు నీరసంగా మూలిగి సొమ్మసిల్లి నేలమీద పడిపోయాడు. రాజూ వనవాసీ అతడి దుస్తులు వదులుచేసి చూడగా, అతడి

పొట్టమీద పెద్దగాయం ఉంది. రాజు వీలైనంత నేర్పుతో గాయంకడిగి తన చేతి రుమాలుతోనూ వనవాసి దగ్గిరున్న తువ్వాలుతోనూ కట్టేశాడు. కాని, రక్తప్రవాహం ఆగేట్టు కన పడలేదు. ఆ గాయం దగ్గిర ఏ బట్టపీలిక పెట్టినా ఆ వెచ్చటి నెత్తుట్లో అది నానిపోతోచ్చింది. కాని రాజు పాతకట్టు తీసేస్తూ, గాయం మళ్ళీ కడుగుతూ కొత్తకట్టువేస్తూ తంటాలు పడ్డాడు. చిట్టచివరకి రక్తప్రవాహం కట్టగా, ఆ మనిషి తేరుకుని, దాహం అడిగాడు. రాజు మంచినీళ్ళు తెచ్చి యిచ్చాడు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు, అంతా చల్లపడింది. అందుకని రాజు, వనవాసి, ఒకచెయ్యి వెయ్యగా. గాయంమనిషిని కుటీరంలోకి సాయంపట్టి. పక్కమీద పడుకో పెట్టాడు. పక్క మీద చేరగానే ఆ మనిషి కళ్ళు మూసుకుని మరి మాట్లాడ లేదు, నిద్రట్లోపడ్డాడు. రాజుకూడా నడకవల్లా, పవ్వడంవల్లా, గాయం మనిషికి చేసినసేవవల్లా దానా దీనా చాలా అలిసిపోయి ఉన్నాడేమో, గుమ్మందగ్గిరికి చేరి, ఒరిగి, ఉనూ నిద్దర పోయాడు. నిద్దర పోవడంలోనూ, మళ్ళీ ఉదయందాకా ఒళ్ళెర గడు. రాజుకి ఉదయాన్నే మెళుకువ వచ్చిందిగాని, తనెవరో గడ్డంమనిషి ఎవరో పక్కమీద పడుకుని మిలమిలలాడే కళ్ళతో తనవేపు దీక్షగా అతడు ఎందుకు చూస్తున్నాడో కొంత సేపటికి గాని గుర్తుకి రాలేదు. గడ్డం మనిషి రాజుకి మెళుకువవచ్చి తన కేసి చూస్తూన్నట్టు తను గ్రహించగానే. రాజుతో, 'నన్ను క్షమించండి,' అని చాలా పీల కంఠస్వరంతో అన్నాడు.

రాజు:—"నేను నిన్ను పూర్వం ఎరగను. క్షమించవలసిన విషయం ఏదీ నాకు కనిపించదు." అన్నాడు.

గడ్డంమనిషి, 'మీరు నన్నెరగరుగాని మిమ్మల్ని నేనెరుగు దును. ఒకణ్ణి మీరు ఉరిదీసి వాడి ఆస్తి లాక్కున్నారు. వాడి సోదరుణ్ణి నేను. మీ మీద కసి తీర్చుగోడానికి ఒట్టుపెట్టుగున్న మీ శత్రువుని నేను. వనవాసిని మీరు చూడ రావడం నాకు తెలుసు. మీరు వెనక్కి వచ్చేటప్పుడు మిమ్మల్ని పొడిచి చంప డానికి నిశ్చయించుగుని పొంచి ఉన్నాను. సాయంత్రమేనా పడిందిగాని, మీరు వెనక్కిరాలేదు. ఆగలేక మీ కోసం మాటు స్థలంలోంచి పైకొచ్చేశాను. ఇంతలో మీ అంగరక్షకులు నన్ను ఎరుగున్న వాళ్ళవడంచేత, కత్తిపుచ్చుగుని నన్ను గాయపర్చారు. వాళ్ళని తప్పించుగుని మీ దగ్గిరికివచ్చి పడ్డాను. మీరు నాకు కట్టుకట్టక పోయుంటే, ఈ పాటికి నేను పరలోకంలో ఉండేవాణ్ణి, మిమ్మల్ని చంపదలిచి వచ్చిన వాణ్ణినేను, నా ప్రాణం రక్షించినవారు మీరు. అందుచేత. నేను బతికి ఉండాలని మీరు కోరితే, సభక్తికంగా మీకు యావజ్జీవిత దాస్యం చేస్తాను. నా కొడుకులచేత కుడా చెయిస్తాను. నన్ను క్షమించండి," అన్నాడు.

అంత తేలికగా శత్రువుతో సంధి కుదిరినందుకున్నూ శత్రువు మిత్రుడుగా మారినందుకున్నూ రాజు చాలా సంతోషించి, అతణ్ణి క్షమించడమేకాక, తన సేవకుల్ని వైద్యుణ్ణీపంపి అతడికి ఉప చారం చెయిస్తాననిన్నీ ఆస్తికుడా వాపసు చేస్తాననిన్నీ అన్నాడు.

## iv

ఈరీతిగా గాయంమనిషిదగ్గిర సెలవు తీసుగుని, రాజు బయటికి వచ్చి వనవాసికోసం పరికాయించాడు. వెళ్ళిపోయే

లోపల ఏన ప్రశ్నలు మళ్ళీ ఓసారి వనవాసికి జ్ఞాపకం చేద్దాం అని అతడు అనుకున్నాడు. వనవాసి బయటే మోకరించి క్రితం నాడు తవ్విన మళ్ళల్లో విత్తులు చల్లుతున్నాడు. రాజు అతణ్ణి సమీపిస్తూ, "మహాజ్ఞానీ, కడసారి ప్రార్థిస్తున్నాను నా ప్రశ్నలకి తమ సమాధానాల గురించి," అన్నాడు. మోకరించే ఉంటూ, వనవాసి, "సమాధానాలు చెప్పేయ్యడం అయిపోయిందే!" అన్నాడు. తన మొహం ఎత్తి ఎదురున్న రాజుని చూస్తూ.

రాజు—సమాధానాలు చెప్పేయ్యడం అయిపోయిందా? ఏమిటి తమ అభిప్రాయం?

వనవాసి—నీకు తెలియడం లేదూ? విను. నా దౌర్బల్యం గురించి నిన్న నువ్వు జాలి వహించి నా మళ్ళు తవ్వి పెట్టకుండా వెళ్ళిపోయావే అనుకో. గడ్డం మనిషి నిన్ను అటకాయించి ఉండేవాడు, వనవాసితో ఉండకపోతినే అని నువ్వు పశ్చాత్తాప పడి ఉండేవాడవు. కాబట్టి మిక్కిలి ముఖ్యమైన కాలం ఏదీ అంటే నా మడి నువ్వు తవ్వి పెట్టినకాలం. అప్పుడు నీకు ముఖ్యమైన మనిషిని నేను, నీ ముఖ్యమైన పని ఏదీ అంటే ఇతరులకి మేలు చెయ్యడం. తరవాత, ఆ మనిషి మనకేసి పరిగెత్తి వచ్చినప్పుడు, మిక్కిలి ముఖ్యమైన కాలం ఏదీ అంటే నువ్వు అతనికి ఉపచారం చేసిన కాలం. ఏమంటే, అతడికి ఆకాలంలో నువ్వు కట్టు కట్టకపోతే, నీతో సొసాయింపు చేసుగోకుండా అతడు గతించి ఉండేవాడు. అందు కని అప్పుడు అతడే నీకు ముఖ్యవ్యక్తి అయాడు, అతడికి నువ్వు చేసిన ఉపచారమే మిక్కిలి ముఖ్యమైన పని

అయింది. సరి, జ్ఞాపకం ఉంచుగో. ముఖ్యమైనకాలం ఏదీ అంటే: వర్తమానకాలం. అది ఎందుచేత మిక్కిలి ముఖ్యమనగా, వర్తమానకాలం మీద మాత్రమే మనకి అధికారం ఉందిగనక! మిక్కిలి ముఖ్యమైన వ్యక్తి ఎవరు అనగా, నువ్వు ఎవరితో వ్యవహరిస్తూంటావో. ఆవ్యక్తే! ఎందుచేత అనగా, ఆవ్యక్తి మరెవరితోనేనా వ్యవహరించడం అనేది ఆ తరవాత ఉంటుందో ఉండదో ఎవడూ చెప్పలేడు గనక! ఇక, మిక్కిలి ముఖ్యమైన పని ఏది అనగా ఎదురుండే వ్యక్తి మంచి చెయ్యడమే. ఎందుచేత అనగా మానవుణ్ణి ఈ జీవితంలోకి పంపించింది కేవలం ఆ పని మీదే గనక!

# కుప్రశని, రొట్టెపెచ్చు

ఒక పేదరైతు పొలం దున్నుకోడానికి ఉదయాన్నే బయల్దేరి వెళ్ళాడు. అతడు వెళ్ళేటప్పుడు తన చద్ది నిమిత్తం ఒక రొట్టెపెచ్చు పట్టిగెళ్ళాడు. నాగలి సిద్ధంచేసి, రొట్టె తన కోటులో చుట్టేసి అది ఒక గుబురుకింద పడేసి, అతడు దున్నడం ప్రారంభించాడు. కొంతసేపటికి గుర్రం అలిసి పోయింది. అతనికి ఆకలేసింది. సరి, నాగలి ఆపుచేసి, గుర్రాన్ని మేతకి వదిలేసి, తన కోటూ చద్దీ తెచ్చుకోడానికి అతడు వెళ్ళాడు. కోటుతీసి చూశాడు, చూస్తే రొట్టె కనపడదే! అతడు చూశాడు చూశాడు, కోటు తిరగా బోర్లావేశాడు, తెగ దులిపాడు—కాని రొట్టె మాయమై పోయింది. అదెల్లా జరిగిందో అతడు ఎంత మాత్రమూ ఊహించుగో లేకపోయి, తనలో, 'ఇది చాలా వింతగా ఉందే! నా కెవడూ కనిపించ లేదిక్కడా! అయితేం, ఎవడో వచ్చుండాలి, రొట్టె లాగేసుండాలి' అనుకున్నాడు.

ఆఁ, మరెవరూకారూ, ఒక కుబ్రశని, ఆ రొట్టె తస్కరించినవాడు! రైతు దున్నుకుంటూ ఉండేసమయంలోవాడు ఆ గుబురు వెనకాలే కూచుని ఉన్నాడు, ఈ రైతు మహాశనిని తల్చుగుని ఎప్పుడు తిట్టి పోస్తాడా, విందాం, అనుకుంటూ.

రైతు, తన చద్ది లేకుండా పోయినందుకు బాధపడ్డాడు గాని, 'కానీ, ఎంచేస్తాం? ఇంతాచేసి, ఆకలివల్ల చచ్చిపోను గదా! రొట్టె ఎవడు తీసుగుంటేం గనక, వాడికి దాని అవసరం

వచ్చుంటుంది. 'అవి వాడికి మేలు చేకూర్చుగాక!' అనుకుని, నూతి దగ్గిరకి వెళ్ళి కడుపునిండా నీళ్ళ తాగేసి, ఒక్క రవ్వ విశ్రమించి, లేచి గుబ్రాన్ని పట్టుకుని, పూన్చి, మళ్ళీ దుక్కి ప్రారంభించాడు.

రైతు పాపం చేసేటట్టు తను నిర్బంధించలేకపోవడం కుబ్రశనికి తలకొట్టేసినట్టుంది. ఇక్కడ ఏమి జరిగిందో తన యజమాని మహాశనికి నివేదించుకోవాలని వాడు పోయాడు. వాడు మహాశని దగ్గిరికెళ్ళి, రైతు రొట్టె తను ఎట్లా తీసేసుకున్నాడో, ఆ రైతు తనని తిట్టిపొయ్యడం బదులు, 'అది వాడికి మేలు చేకూర్చుగాక!' అని ఎట్లా అన్నాడో అవంతా చెప్పాడు. మహాశని కోపంతో, 'ఆ మనిషి నిన్ను మించాడూ అంటే ఏమిటి, తప్పు నీదే అన్నమాట. నీ విధి నీకు తెలియలేదన్నమాట. రైతులూనూ వాళ్ళతోక పట్టుకుని వాళ్ళ భార్యలూనూ అల్లాంటిపన్లు మొదలెట్టారంటే, మనపని ఆఖరే! ఈ వ్యాపారం ఈ పళంగా వదిలేసి ఊరుకో వలసింది కాదు. అందుకని పో వెనక్కిపో! సంగతులు చక్కబెట్టు! మూడేళ్ళ లోపల నువ్వు ఆ రైతుని మించిపోయి పడగొట్టెయ్యకపోతే, పవిత్ర జలంలో నిన్ను ముంచి పారెయిస్తాను' అన్నాడు. కుబ్రశనికి భయంవేసింది, తనవల్ల వచ్చిన అపరాధం రద్దుచేసుకోడానికి మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ, వాడు ఎగబాకి భూమి మీదికి వచ్చాడు. వాడు ఆలోచించగా ఆలోచించగా వాడికి ఒక పన్నాగం తట్టింది.

వాడు ఒక కూలిమనిషిగా మారి, వెళ్ళి, ఆ పేదరైతు దగ్గిర పనికి కుదురుకున్నాడు. మొదటియేడు, ఒక బాడవలో పైరు

ఊడ్చండి అని అతడు రైతుకి సలహా ఇచ్చాడు. అతడి సలహా మన్నించి రైతు వాడవలోనే ఊడ్చాడు. ఆయేడు వాళ్లు వెన కట్టి, తక్కిన రైతుల పైరులన్నీ ఎండకి మాడిపోయాయి. కాని ఈ పేదరైతు పైరుమాత్రం లావుగా ఎత్తుగా పెరిగివేసి కంకులు వేసింది. అతనికి ఆ యేటికి సరిపడ ధాన్యమే కాదు, ఇంకా బోలెడంత మిగిలిపోయేటంత పంట పండింది.

రెండో యేడు ఆ కుర్రశని ఒక గుట్టమీద ఊడ్చండి అని రైతుకి సలహా చెప్పాడు. సరి ఆయేడు వాళ్లు ముంచెత్తాయి. తక్కినవాళ్ళ పైరులు దెబ్బతినేసి, పళ్ళ కంకుల్లో గింజ లేకుండా పోయాయి. కాని, ఈ రైతు పైరు గుట్టమీద ఉండటంవల్ల, భేషుగ్గా ఉంది. అతనికి క్రితం యేడుకంటె మరీ ఎక్కువ మిగిలిపోయే పంట పండింది. అంత ఏంజేసుకోవాలో అతనికి బోధపడలేదు కుడానూ!

అప్పుడు కుర్రశని ఆ రైతుకి బోధించాడు—ధాన్యం రుబ్బేసి వండి ఎల్లా బట్టీ పట్టి ద్రావకం తయారు చెయ్యాలో, అదంతా. అక్కణ్ణించి ఈ రైతు మత్తుపానీయం తయారుచేసి, తను తాగడమూ స్నేహితులు తాగడానికి ఇయ్యడమూ మొదలెట్టాడు.

కుర్రశని తన యజమాని, మహాశని దగ్గిరికి వెళ్ళి తన అపరాధం తొలిగిపోయేటట్టు తను చెల్లగట్టడం అయిందంటూ బడాయిలు కొట్టడం మొదలెట్టాడు. తనే స్వయంగావచ్చి వ్యాపార పరిస్థితి చూసుగుంటానని మహాశని అన్నాడు.

మహాశని, ఆ రైతు ఇంటికి వెళ్ళాడు. ఆ రోజున రైతు తన యిరుగుపొరుగు తడిగలవాళ్ళందర్నీ తనింటికి తాగుడు విందుకి

ఆహ్వానించాడు. అతిథు లందరికీ రైతు భార్యే మద్యం అందిస్తోంది. ఆమె అటూ యిటూ తిరగడంలో ఒకసారి ఎదురుదెబ్బ తగిలి బల్లకి కొట్టుగుని ఒక గ్లాసు మద్యం ఒలకబోసింది. ఆమట్టున రైతు చప్రుమని ఆవిడమీద లేచిపోయి 'ఓసి కుక్కకానా! ఏమిటి నీ అభిప్రాయం? ఇదేమన్నా మురికిగుంటలో నీరనుకున్నావా యేమిటే కుంటిపీనుగా! అంత మంచి దినుసు అంత నిర్లక్ష్యంగా నేలపాలు చేసెయ్యడానికే!' అని మందలించాడు. కుప్రశని తన యజమాని మహాశనిని తన మోచేత్తో తాకుతూ, 'చూడండి చూడండి. ఒకప్పుడు తనకున్న కాస్తరొట్టెపెచ్చుకుడా పోయినా సణుక్కోని మనిషి. వీడు!' అన్నాడు.

భార్యని ఇంకా తిట్టిపోస్తూనే, చుట్టూవెళ్ళి రైతు తనే మద్యం వడ్డించాడు. అప్పుడు ఒక పేదరైతు తన పని పూర్తిచేసుగుని వచ్చేస్తూ లోపలికి ఆహ్వానం లేకుండా దిగాడు. సభవారిపట్ల మర్యాదలు చూపించి, అతడు కూచుని వాళ్ళు తాగుతూండడం చూశాడు. రోజంతా పనిచేసి అలిసి ఉన్నాడేమో, మనంకుడా ఓ చుక్క వేసుగుంటేనే బాగుంటుందని అతనికి అనిపించింది. వాడు అల్లా కూచుని కూచుని విసిగిపోయాడు. అతడికి ఏక నోరూరిపోవడమే! కాని, ఆతిథేయుడు అతడి దగ్గిరికి వెళ్ళి ఇదుగో పుచ్చుగో అనడంలేదు, దిబ్బాలేదు. పైగా వినిపించీ వినిపించకుండా, 'ఇంట్లోకి చొరబడ్డ అడ్డమైనవాడికీ అందియ్యడానికి తాగుడులేదిక్కడ!' అంటూ సణుక్కోడం కుడా మొదలెట్టాడు.

ఇందుకు మహాశని సంతోషించాడు. కుప్రశని, వచ్చేనవ్వు నొక్కేసుగుంటూ, 'ఉండండీ, ఇప్పుడేం జూశారూ! మరి ముందుంది ఇంకా గ్రంథం!' అన్నాడు.

ధనికులైన రైతులంతా కూడాను అతిథేయుడు కూడా తాగాడు. అప్పుడు వాళ్ళు అబద్ధాలూ పైపూతలూ గల సంభాషణలు ప్రారంభించారు.

మహాశని అవి విని విని, కుర్రశనిని మెచ్చుగుంటూ, 'వీళ్ళు ఒకళ్ళ నొకళ్ళు మోసగించుగోడం ప్రారంభించే గుంట నక్కల్లాగా ఆ మద్యం చేసేసింది గనక, త్వరలోనే వీళ్ళంతా మనచేతుల్లో ఉంటారు' అన్నాడు. అందుకు కుర్రశని, 'ఇంకా వచ్చేది చూద్దురుగాని ఆగండి, వీళ్ళందర్నీ చిలో రెండోగ్లాసూ పుచ్చుగోనీండి. ఇప్పుడేముందీ, గుంటనక్కల్లాగ ఉన్నారు— తోకలు మూడిస్తూ, ఒకర్ని ఒకరు పడగొట్టాలని చూస్తూ: కాని, కాస్సేపట్లో చూద్దురుగాని, తోడేళ్ళలాగ క్రూరంగా తయారవు తారు' అన్నాడు.

రైతులంతా తలోగ్లాసూ మళ్ళీ పుచ్చుగున్నారు. వాళ్ళ సంభాషణ మరీ క్రూరంగానూ మరీ మోటుగానూ మారింది. పైపూత మాటలు పోయి వ్యాపారం తిట్లల్లోనూ కోరలు చూపెట్టు గోడంలోనూ పడింది. మరి కాస్సేపటికి వాళ్ళు చావగొట్టుగుని ముక్కులు ఊడకొట్టేసుగున్నారు. అతిథేయుడు కుడా దెబ్బ లాటలో చేరడంవల్ల అతణ్ణి కుడా చక్కగా చితగ్గొట్టేశారు.

ఇదంతా చూసేసరికి మహాశనికి పరమసంతోషం అయింది. 'ఇది ఒకటోరకం రా, కుర్రా!' అన్నాడు.

కాని, కుర్రశని, 'మరో క్షణం ఉండండి—అసలు మజా రాబోతోంది. వీళ్ళందర్నీ తలో మూడోగ్లాసూ తాగనీండి మాద్దురుగాని. ఇప్పుడు తోడేళ్ళలాగ చెలరేగిపోతున్నారా,

ఆ మూడోగ్లాసు పుచ్చుకోగానే, వీళ్ళంతా పందులుగా తయారవుతారు' అన్నాడు.

రైతులు మూడోగ్లాసు పుచ్చేసుకుని, పూర్తిగా పశువులులాగ అయారు. సణుక్కోడం, అరవడం, ఎందుకో ఎవడికీ తెలియదు. ఎవడూ ఎవణ్ణీ వినిపించుగోకపోవడం!

సభవారు లేచిపోవడం మొదలెట్టారు. కొందరు ఒక్కొక్కరే, కొందరు ఇద్దరేసి, కొందరు ముగ్గురేసి, ఇల్లాగా తూలిపోతూ అందరూ వీథిని పడ్డారు. అతిథులికి సాయంచెయ్యడానికి వెళ్ళి ఆతిథేయుడు ముక్కు చితికేలాగ ఒక బురదగుంటలో పడడం వల్ల నఖశిఖ పర్యంతమూ అతడికి బురదపామినట్టై అక్కడే గురుగురు మంటూ పందిలాగ అతడు పడుకున్నాడు.

ఇందుకు మహాశని ఇంకా సంతోషిస్తూ, 'అబ్బ! నీ కెల్లా తట్టిందోకాని, ఈ పానీయం ఒకటోరకం అని చెప్పాలి. రొట్టె పెచ్చుగురించి నువ్వు చేసిన అపరాధానికి చెల్లకట్టవలిసిందానికి ఎక్కువే చెల్లించేశావు. కాని, చెప్పుచెప్పు, ఈ పానీయం ఎల్లా తయారుచెయ్యడం? మొట్టమొదట నువ్విందులో గుంటనక్క నెత్తురుకలిపి ఉంటావు. అందుకని రైతులు గుంటనక్కల్లాగ జిత్తులమారి రకంగా ఉన్నారు. తరవాత నువ్వు తోడేలు రక్తం కలిపావనుకుంటాను అందుకనే వాళ్ళు తోడేళ్ళలాగ భయంకరం అయారు. చిట్టచివరకి నువ్వు పందిరక్తం రంగరించి రసం పూర్తి చేసుంటావు, వాళ్ళకి పంది ప్రవర్తన రావడానికి!' అన్నాడు. అందుకు, కుబ్రశని, "అబ్బెబ్బే, నేను అవలంబించిన మార్గం అది కానేకాదు. నేను జాగర్తపడ్డదంతా ఏమిటంటే ఈ

రైతుకి అవసరమయ్యే ధాన్యం కంటె ఎక్కువ అతని దగ్గిర పోగయ్యేటట్టు చూడడమే! జంతువుల రక్తం మనిషిలో అనాది నించీ ఉంటూనేఉంది. కాని, మానవుడి అవసరాలకి సరిపడ మాత్రమే ధాన్యం ఉంటూన్నంతకాలం, ఆ జంతురక్తం హద్దుల్లో ఉంటుంది. పరిస్థితి అల్లా హద్దుల్లో ఉండి ఉన్నప్పుడు, ఈ రైతు తనకున్న కాస్త రొట్టె పెద్దా పోయినా సణుక్కోలేదు. కాని, అతడు తన దగ్గిర మిగిలి పోయిన ధాన్యరాశి చూడగానే, దాని మూలంగా ఆనందం పొందడానికి మార్గాలు అన్వేషించడం మొదలెట్టాడు. అతనికి నేను ఒక ఆనందం చూపించాను—త్రాగుడు: మరి, దేవుడు ప్రసాదించిన సత్పదార్థాల్ని మద్యంగా మార్చి తను ఆనందించడం ఎప్పుడు మొదలెట్టాడో, వాడిలో ఉండే గుంటనక్క రక్తమూ, తోడేలు రక్తమూ, పందిరక్తమూ, బయలేశాయి'' అన్నాడు.

అప్పుడా మహాశని, కుర్రశనిగాణ్ణి చాలా మెచ్చుగుని, వెనకవాడివల్ల వచ్చిన అపరాధానికి వాణ్ణి క్షమించేసి, ఊరు కోక, ముందెప్పుడో వాడికి వస్తే రాగల గొప్ప హోదాపదవిలో వాణ్ణి తక్షణమే నియమించేశాడు.

---

# వ్యయం కంటే ఎక్కువ

(గై డి మొపాసా రచించిన ఒక కథకి టాల్‌స్టాయ్ అనుసరణ)

ఫ్రాన్సు ఇటలీల సరిహద్దు ప్రాంతంలో మధ్యధరా సముద్ర తీరాన్ని మొనాకో అనే మిక్కిలి చిన్ని రాజ్యం ఉంది. జనాభా విషయంలో ఈ రాజ్య వాసుల సంఖ్యకంటె తన సంఖ్యే ఎక్కువని ఏ కుగ్రామమైనా సరే బడాయికొట్టొచ్చు. ఏమంటే, ఈ రాజ్యంలో అంతా కలిపి మొత్తం ఏడువేలు. రాజ్యం యావత్తూ పంచిపెడితే తలకి ఎకరమైనా కిట్టదు. కాని, ఈ చిన్నారి రాజ్యానికి ఓ పొన్నారి రాజు; అతడికి అంతఃపురం, సభికులు, మంత్రులు మతగురువు, సేనానులు, సేన: సేనంటే పెద్దసేన కాదనుకోండి! అంతా పోగుచేస్తే అరవైమందే. అయితేనేం, అదిసేనే! పైగా ఇంతోటి రాజ్యంలోనూ పన్నులూ ఉన్నాయి, తక్కిన చోట్లలాగ—పొగాకుమీద పన్ను, ద్రాక్ష సారా మీదా, సారాయిల మీదాపన్ను, తలపన్ను కూడా ఉంది. ఈ రాజ్యంలోవాళ్ళు తాగుతా రనుకోండి, పీలుస్తా రనుకోండి తక్కిన చోట్లలాగే కాని అటువంటి వాళ్ళసంఖ్య ఇక్కడ చాలా తక్కువ అవడంచేత, తద్వారా ఆదాయం అట్టేలేక, రాజుగారు తన సభ్యులకీ తన సిబ్బందికీ తనకీ తిండిఖర్చు చాలక టకటక లాడిపోయిండేవాడు కాని, నూతనమైన ఒక ప్రత్యేక ఆదాయ మూలం కనిపెట్టి అతడు సొమ్ముచేసేవాడు. ఆ ప్రత్యేక ఆదాయానికి జన్మస్థలం ఒక ద్యూతగృహం. అక్కడ జనం చేరి గోళీలతో జూదం ఆడతారు. ఆడే జనంలో ఎవళ్ళు ఓడినా

ఎవళ్ళు నెగ్గినా, పందెం సొమ్ముల మొత్తంమీద నూటికి ఇంతా అని శాలా యజమానికి వస్తుంది అతడు పన లాభాల్లోంచి రాజుకి చాలా పెద్దమొత్తం చెల్లించాలి. యూరపు ఖండం మొత్తానికి మిగిలిన ద్యూతసంస్థ అదొక్కటే అవడంచేత ఆశాలా యజమాని రాజుకి అంతంత పెద్ద మొత్తాలు చెల్లించవలి సొచ్చేది. ఇటువంటి ఉరిహాలో. కొన్ని ద్యూతగృహాలు జర్మనీలో కొందరు ఛోటారాజులు నడుపుతూండేవారు, గాని కొంతకాలం కిందట వాటిని నిషేధించారు. ఆ ద్యూత గృహాల్ని ఎత్తెయ్యవలసిన కారణం ఏమిటంటే, అవి చేస్తూండే హాని. ప్రతీవాడూ రావడం, తన అదృష్టం ఎల్లా ఉందో చూడడానికి కొంత కాయడం తరవాత తనకి ఉన్నదంతా కానేసి పోగొట్టు కోడం, ఆ పైని తనదికాని సొమ్ముకుడా కానేసి అది కుడా నష్ట పోవడం, చివరకి నిస్పృహచెంది గంగలో దూకడం లేకపోతే తుపాకీతో కాల్చేసుగోడం. అందువల్ల ఇట్టి మూలంగా ప్రవ్యార్జన ప్రభుత్వంవారు చెయ్యకుండా జర్మను ప్రజలు నిషేధించేశారు. కాని, మొనాకో రాజుని అరికట్టడానికి ఎవడూ లేకపోవడంవల్ల, ఈ వ్యాపారంలో ఏకైక స్వామ్యం ఆయనకే దక్కింది. ఇక ఇప్పుడు ఎవరు జూదం ఆడవలిచినా మొనాకో పోతారు. వాళ్ళు నెగ్గినా ఓడినా సరే, రాజుకి లాభమే. 'నిజాయితీగా చెమట ఓడ్చడంవల్ల పాలరాతి సౌధాలు ఆర్జించ గలమా' అని నడా సామెత! మొనాకో రాజుకీ తెలుసు ఆ వ్యాపారం చాలా హేయం అయింది—అని, తెలిస్తేమాత్రం, ఏం చెయ్యమన్నా రతన్ని? అతడు బతగాలి, తాగుడుమీదా పొగాకుమీదా రాబడి ఏర్పాటు

చేసుగోడం మెచ్చతగ్గది కాదు, నిజమే. అయితేం? అతడు జీవిస్తున్నాడు, పాలిస్తున్నాడు, సొమ్ము నొల్లు కుంటున్నాడు. యథార్థపు రాజులాగే లాంఛనాలన్నింటితోనూ కొలువు తీరుస్తున్నాడు. పట్టాభిషేకం అయింది. ప్రజలంతా మోకరించారు. అతడు బహూకరిస్తున్నాడు, శిక్షిస్తున్నాడు. క్షమిస్తున్నాడు. ఇతర రాజులకేలాగే అతనికి కూడా, కొంత చిన్న ప్రమాణంలోనే అనండి,—సమితులూ, సభా సమావేశాలూ, చట్టాలూ, న్యాయస్థానాలూ—అన్నీ ఉంటున్నాయి.

ఇల్లాఉంటూండగా ఆ చిట్టిరాజు రాజ్యంలో ఒక హత్య జరిగింది—ఇప్పటికి కొన్నేళ్ళక్రితం. ఆ ప్రజలంతా మేకలవంటి వాళ్ళు, హత్యవంటిది వాళ్ళ లోగడ ఎరగరు. న్యాయమూర్తులు మిక్కిలి పటాటోపంతో సమావేశమై అత్యంతమైన న్యాయ వైఖరితో విషయం విచారణచేశారు. సమావేశంలో న్యాయమూర్తులు, శిక్షకులు, పంచాయితీవాళ్లు, న్యాయవాదులు—అంతా ఉన్నారు. వాదోపవాదానంతరం చిట్టచివరకు ఏమని తీర్చారంటే : చట్టప్రకారం నేరస్థుడి తలతీసివేయాలి—అని. అంతవరకు పోనీ బాగానే ఉంది. తరవాత, వాళ్ళు ఆశిక్షణవాక్యం చిట్టిరాజుకి పంపించారు. అది అతడు చదువుకుని ధ్రువపరస్తూ "వాణ్ణి ఉరితియ్యవలసుంటే, ఉరితీసెయ్యండి" అన్నాడు. అనేసరికి వ్యాపారంలో ఒక్కటే మెల్తి బయల్దేరింది. అదేమిటంటే, తలలు తీసెయ్యడానికి వీలైన ఉరిచట్రమూ వాళ్ళ దగ్గిరలేదు, తలలు ఉత్తరించడానికి హంతకారుడూ లేడు. ఆ మట్టున మంత్రులంతా ఏకమై సంగతంతా తలపోసి ఒక నిశ్చ

యానికి వచ్చి ఇల్లా అన్నారు: ఫ్రెంచి ప్రభుత్వము వారికి వ్రాసి కనుక్కోండి. వాళ్ళు ఒక ఉరియంత్రాన్నీ, దాన్ని వాడడంలో నైపుణ్యం గలవాణ్ణీ పంపగలరేమో! పంపగల పక్షంలో: ఖర్చు ఏమాత్రం అవుతుందో కూడా దయచేసి చెప్పమనండి—అని. అలా వ్రాశారు. వారంనాటికి సమాధానం వచ్చింది—యంత్రమూ నిపుణుడూ పంపబడగలరనిన్నీ ఖర్చు పదహారువేలనిన్నీ. ఈ సమాధానం రాజు ఎదట ఉంచారు. అతడు సమగ్రాలోచన చేశాడు. పదహారువేలే? ఈ పాపిష్ఠుడు అంత విలువచేస్తాడా? ఇంతకంటె చౌకగా, ఎట్లాగో ఒకలాగ, అది చెయ్యడానికి వీలులేదా? ఏమంటే, పదహారువేలంటే, యావత్తు జనాభానూ ఆలోచిస్తే ఒక్కొక్కడిదీ రెండు పైచిలుకు రూకలసొమ్ము అన్నమాట! ఈవ్యయం జనం భరించరు, వాళ్ళు ఒకదొమ్మీ లేవదియ్యగలరు—అన్నాడు. మరి యేమిటి చెయ్యడం శక్యమా అని ఆలోచించడానికి ఒక సంఘం నియమించారు. లోగడ ఫ్రెంచిప్రభుత్వాన్నిలాగే ఇటలీప్రభుత్వాన్ని కూడా వాకబుచెయ్యాలన్నారు వీరు. ఫ్రెంచి ప్రభుత్వం ప్రజాపాలన రాజ్యం కావడంనించి రాజుల్ని ఎన్నడూ ఖాతరుచెయ్యదు. ఇటలీవారి వేరు. అది రాజపాలితరాజ్యంగనక ఆరాజు చిట్టిరాజంటే సోదరభావం వహించి, మన పని కాస్త చౌకగాచేసిపెట్టడానికి మెత్తపడవచ్చు అనికూడా వీరు సెలవిచ్చారు. ఆ రీతిగానే ఉత్తరం వ్రాయడమూ, దానికి తక్షణ సమాధానం రావడమూ జరిగాయి, ఒక ఉరి యంత్రాన్నీ ఒకనిపుణుణ్ణీ కూడా మిక్కిలి సంతోషంతో పంపించగలం, వ్యయం—దారి ఖర్చు

లక్షోపహో. మొత్తం పన్నెండువేలు అవుతుంది—అని ఇటలీ ప్రభుత్వంవారు రాశారు. పదహారువేలకంటె పన్నెండువేలు కొంతనయమే కాని. పన్నెండువేలు కూడా మరీ ఎక్కువలాగే కని పించింది ఆ దుష్టుడు నిజంగా అంత చెయ్యడు. ఈ ఖర్చు కూడా మొత్తం మీద చూస్తే ప్రతిజనుడికీ దగ్గిరిగా రెండురూకలు పన్ను విధించడం అన్నమాట. మహాసంఘం ఏర్పాటైంది. వాళ్ళు వాదోపవాదాలు చేసి ఈ పని ఇంకా తక్కువ వ్యయంతో జరపడం ఎట్లాగా అని పునరాలోచన చేశారు. ఏమాటుగానో గృహ కృత్యంలాగ ఇది చేసి పారెయ్యడానికి, యోధభటుల్లో ఎవడేనా ఒకడు దొరక్కపోతాడా అన్నారు వారు. సేనానిని పిల్చి కను క్కున్నారు: "ఏమయ్యా! వీడి తల తీసెయ్యగల యోధుణ్ణి ఇయ్యగలవా? యుద్ధంలో చీకూ చింతా లేకుండా జనాన్ని చంపేస్తారు. నిజానికి అందుకే వాళ్ళని తరిఫీయతు చెయ్యడం కూడానూ?—అని. అప్పుడు సేనాని పెక్కు భటులతో వ్యక్తి పరంగా మాట్లాడి చూశాడు, ఎవడేనా పలకాయ తీసెయ్యడం పని ఒప్పుకుంటాడేమో అని. ఆ పని ఏభటుడూ కూడా ఒప్పుకో లేదు. "ఏమో! మాకు తెలియదు. అందుకు తయారు చెయ్య లేదు మమ్మల్ని" అనేశారు. మరేమిటి చెయ్యడం? మళ్ళీ సమావేశమై మంత్రులు ఆలోచించి బుర్ర చించుకున్నారు. ఒక ప్రత్యేకసంఘం, ఒక సాధారణ సంఘం, ఒక ఉపసంఘం నియ మించి వాళ్ళు చివరికి తేల్చిందేమిటంటే! ఉరిశిక్ష ఉపసంహ రించుకుని దాని బదులు యావజ్జీవ కారాగృహశిక్ష వేస్తే బాగుం టుందని. ఇలా చేస్తే కనికరం చూపించడానికి చిట్టి రాజుకి

విలుంటుందనిన్నీ, ఖర్చు తేలికవుతుందనిన్నీ కూడా వాళ్ళన్నారు. ఇందుకు చిట్టిరాజు అనుమతించగానే తద్వతుగా ఏర్పాట్లు చేశారు. కాని, ఒక్క చిక్కుమాత్రం తటస్థించింది. యావజ్జీవ కారాగృహశిక్షవాడికి తగ్గ కారాగృహం ఎక్కడా లేకపోయింది. తాత్కాలికంగా జనాన్ని ఉంచడానికి చిన్న చెఱసాల ఒకటి ఉన్నా, శాశ్వతోపయోగానికి అనువుపడే పక్కా కారాగృహం లేదు. ఏమైతేం, పూచీపడివి పోవడానికి ఓ గది వెదికి నిర్ణయించి, ఆయువకుణ్ణి అందులో పెట్టి, ఆ గది కాపలా కాయడానికి ఓ భటుణ్ణి నియమించాడు. కాపలా భటుడు నేరస్థుణ్ని కాపలాకాయడమే కాక, సౌధంలోని పాకశాలనించి నేరస్థుడికి భోజనంకూడా తెచ్చిపెట్టాలి. ప్రదీ అల్లా ఉంటోచ్చాడు. నెలలు గడిచి సంవత్సరం గడిచింది.

ఒకనాడు చిట్టిరాజు తన ఆదాయ వ్యయపట్టీ చూస్తూ, వ్యయం వైపు ఒక కొత్తపద్దు గమనించాడు. అదేమిటంటే నేరస్థుణ్ణి జైలులో ఉంచినందుకు అయినఖర్చు. అది చిన్న మొత్తమూ కాదు, పోనీ. ప్రత్యేకంగా నియమింపబడ్డ కాపలాభటుడి ఖర్చూ నేరస్థుడి తిండి ఖర్చూ అందులో ఉన్నాయి. ఆ మొత్తం సంవత్సరానికి ఆరువందలు దాటింది. అన్నిటికంటె ప్రారబ్ధం ఏమిటంటే, ఆ నేరగాడు చాలా యువకుడు, పైగా రాయల్లా న్నాడు, మరో యాభైఏళ్ళు బతగడానికి అభ్యంతరం లేనట్టు న్నాడు, ఎవడేనావచ్చి లెఖ్ఖ పూర్తిగా కట్టిచూస్తే, వ్యాపారం యంవేసి పోయేట్టుంది. పరిస్థితి ఇట్లానే ఉండిపోకూడదు. అందు ని చిట్టిరాజు మంత్రుల్ని పిలిపించి "ఈ దిక్కుమాలిఘటంతో

వ్యవహరించడానికి ఇంతకంటె తక్కువఖర్చు మార్గం చూడాలి,
ప్రస్తుతమార్గం మరీ వ్యయకరంగా ఉంది'' అన్నాడు. మంత్రులు
సమావేశమై ఆలోచించి ఆలోచించి తెగఆలోచించారు. వాళ్ళల్లో
ఒకడు: ''అయ్యా: నన్నడిగితే ఆకాపలా భటుణ్ణి తొలిగించాలి''
అన్నాడు. ''బాగానే ఉంది, అల్లాయితే ఆ కుంక ఉడాయించే
స్తాడు'' అని అందించాడు మరో మంత్రి. ''ఉడాయించ
నియ్యండి, మనం వెన్నంటి చూస్తూందాం'' అని మొదట
మాట్లాడిన మంత్రి అన్నాడు. తమ సమాలోచనల ఫలితం
వాళ్ళు చిట్టిరాజుకి నివేదించారు, ఆయన ఆమోదించాడు. కాపలా
భటుణ్ణి తొలగించేశారు, తరవాత ఏం జరుగుతుందా అని వాళ్లు
చూస్తూ ఉండిపోయారు. జరిగిందేమిటంటే, భోజన సమయం
కాగానే, నేరస్థుడు బయటికివచ్చి, కాపలావాడు లేకపోవడం
గమనించి, తనే చిట్టిరాజుగారి పాకశాలకి తన భోజనం తను
తెచ్చుగునేటందుకు వెళ్ళాడు. అక్కడ ఏమిచ్చారో అది పుచ్చు
గుని, చెఱసాల గదికి వచ్చేసి అందులో ప్రవేశించి తలుపు
వేసేసుగుని ఉండిపోయాడు, మర్నాడూ అల్లానే వ్యవహ
రించాడు, సకాలంలో అహారనిమిత్తం వెళ్ళాడు. అంతేకాని,
పారిపోవడం గురించి అతనికి ధ్యాసేలేనట్టు కనపడ్డాడు : మరే
మిటి చెయ్యడం? అంతా ఈ విషయం గురించి పునరాలోచ
నలో పడ్డారు. 'వీణ్ణి ఇక్కడ ఉంచాలని మనం కోరుకోడంలేదు
గనక, ఆ సంగతి వాడి మొహంమీద చెప్పేసెయ్యడం కర్తవ్యం
అన్నారువారు. అందువల్ల న్యాయశాఖామంత్రి అతణ్ణి తన
సమక్షానికి రప్పించారు. 'నువ్వు పారిపోవేం అబ్బాయ్?' అని

వాణ్ణడుగుతూ, 'నీ మీద వేసిన కాపలావాణ్ణి తీసేశా - నువ్వు నీ చిత్తం వచ్చిన చోటికి వెళ్ళచ్చు. చిట్టిరాజుగారు మరేమీ అనుకోరులే' అన్నాడు. వాడు "చిట్టిరాజుగారు మరేమీ అనుకోరని నాకూ ధైర్యమే—కాని, నేను ఎక్కడికి వెళ్ళనూ ఏట్లోకి? ఏం చెయ్యగలనూ? మీ శిక్షా తీర్మానంతో, నా శీలం నాశనం చేశారు. అందుచేత జనం నా వైపు తమ వీపుపెట్టి పోతారు. అదీకాక, పనిచెయ్యడం వాళ్ళీ నాకు తప్పిపోయింది. నన్ను మీరు అనాదరణతో చూశారు. అది న్యాయం కాదు. అసలు మొదట మీరు నాకు ఉరిశిక్ష విధించిన వెంటనే, నన్ను మీరు ఉరితీసి ఉండవలిసింది. కాని మీరు అల్లా చెయ్యలేదు, అది ఒక విషయం. అందుగురించి నేను ఏమీ ఫిర్యాదు చెయ్యలేదు. అంతట్లో మీరు నాకు యావజ్జీవ కారావాస శిక్ష విధించి. నా అన్నం తేవడానికి ఓ కాపలా భటుణ్ణి నియమించారు. కాని కొంత కాలానికి వాణ్ణీ మీరు తీసెయ్యగా, నా భోజనం నేను తెచ్చుగోవలి సొచ్చింది. అప్పుడూ నేను ఫిర్యాదు చెయ్యలేదు. సరి ఇప్పుడు నన్ను వెళ్ళిపొమ్మని మీరే కోరుతున్నారు. అందుకు నేను ఒప్పుగోలేను. మీరు ఏమట చేసుగోండి గాని, ఎంతమాత్రమూ పారిపోను" అన్నాడు.

ఇప్పు డేమిటి చెయ్యడం? మళ్ళీ ఒకసారి సభ ఏర్పాటు చేశారు. మనిషి వెళ్ళరా అంటే వెళ్ళకుండా ఉన్నాడుగదా, ఇప్పుడు అవలంబించవలసిన దారి యేది? వాళ్ళంతా కలిసి చింతించి యోచించి ఆలోచించారు. వాణ్ణి విరగడ చేసుగోవా లంటే వాళ్ళకి తోచిన ఏకైకమార్గం ఏమిటంటే, వాడికి పింఛను

ఇస్తాం అనడమే. సరి, ఆ సంగతి వాళ్ళు చిట్టిరాజుగారికి తెలియ పరుస్తూ, 'మాకు ఈ విషయంలో గత్యంతరంతోచటంలేదు. వాణ్ణి ఎల్లాగో అల్లాగ విరగడ చేసుగోవాలి' అని రాశారు. పింఛను మొత్తం ఆరువందలు. ఆ సంగతి ఖైదీకి అధికారికంగా తెలుపుడు చేశారు. వాడు, 'సరే. పోనీ ఇల్లానే కానీండి. నే నేమీ అనుకో న్లెండిగాని, సొమ్ముమాత్రం సక్రమంగా మీరు చెల్లగట్టేపూచీ పడితేనే!' అన్నాడు. ఇక్కడితో వ్యాపారం ఇల్లా స్థిరపడింది. వార్షికపుసొమ్ములో మూడోవంతు ముమ్మందే పుచ్చుగుని వాడు ఆ రాజుగారి రాష్ట్రంలోంచి లేచిపోయాడు.

సరిహద్దుదాటి మరోస్థలానికి వలసవెళ్ళాడు ఆ కొత్తస్థలమూ అట్టేదూరంలేదు. ఇప్పటి చోటునించిరైలుమీద ఓ పావుగంట ప్రయాణం! అక్కడ అతడుస్థిరపడి, స్థలంసంపాదించి, కూరలు కాపించి అమ్మించిసొమ్ము చేసుగుంటూ సుఖంగా జీవిస్తున్నాడు. సకాలంలో వెళ్ళి తనకి రావలిసిన పింఛను వసూలు పుచ్చు గుంటున్నాడు. అది పుచ్చుకోగానేమాత్రం, జూదపు బల్లల దగ్గిరికి వెళ్ళి రెండుమూడు రూకలు పందెం కాసి చూస్తాడు. ఒక్కొక్కప్పుడు నెగ్గుతాడు, మరో అప్పుడు నష్టపోతాడు. కాని, తక్షణం ఇంటికి పోతాడు. అతడి జీవితం ప్రశాంతంగానూ బాగానూ జరిగిపోతోంది. ఒక మనిషి తలకొట్టెయ్యడానికి అయే ఖర్చుగాని ఒకణ్ణి యావజ్జీవమూ చెఱసాలలో ఉంచడానికి అయే ఖర్చుగాని పెట్టుగోడానికి వెనుదియ్యకుండా ఉండే ప్రభుత్వంగల దేశంలో ఏ నేరం అతడు చెయ్యకుండా ఉండడం అనేది చాలా గొప్పసంగతి!

# అసురదేశరాజు, ఈశరథం

అసురదేశరాజు, ఈశరథం అనేవాడు లైలీరాజు రాజ్యాన్ని జయించి, నగరా లన్నింటినీ ధ్వంసంచేసి తగలబెట్టి, దేశ వాసుల్ని అందర్నీ తన దేశానికి బానిసలుగా తీసుకుపోయి, యోధుల్ని సంహరించి, కొందరు నాయకుల్ని ఉరితీసి కొందరికి సూదులుగుచ్చి కొందరి చర్మాలు ఒలిపించి, చివరికి ఆ లైలీ రాజుని కూడా ఒక బోనులో బంధించాడు.

ఒకరాత్రి ఈశరథరాజు తన పక్కమీద పడుకుని లైలీ రాజుని ఎట్లా ఉరితీయవలిసి ఉంటుందా అని కళ్ళుమూసుకుని తలపోస్తూ ఉండగా, పక్కకి పక్కనే ఆకస్మికంగా అయిన ఏదో చప్పుడు విని కళ్లుతెరిచి చూశాడు. ఒక ముసలివాడు కని పించాడు. అతనికి పొడుగాటి బూడిదరంగు గడ్డముంది, చల్లని దృష్టిఉంది.

ముసిలి—లైలీని ఉరితియ్యా లనుకుంటున్నావా!

రాజు—ఆ. కాని చేసే విధానం గురించి నిశ్చయం చేసుకో లేకుండా ఉన్నాను.

ము—కాని, నువ్వే లైలీవి.

రా—ఈమాట సత్యంకాదు. లైలీ లైలీయే, నేను నేనే!

ము—నువ్వూ లైలీ ఒకటే. నువ్వు లైలీ కావనీ లైలీ నువ్వుకాదనీ ఊరికే భ్రమపడుతున్నావ్.

రా—ఏమిటి నీ ఉద్దేశం? ఇదుగో ఇక్కడున్నాను నేను, మెత్తటి తల్పంమీద. ఇదుగో నా చుట్టూ విధేయులైన మగ

వానిసయా అడబానిసయానూ. రేపు నా స్నేహితుల్తో కలిసి విందారగిస్తాను, ఈవేళలాగే. మరి లైపే అంటావా, చూచు న్నాడు పంజరంలో పిట్టలాగ. రేపు అతడికి నూమిలు గుచ్చు తారు, నాలిక వెళ్ళబెట్టి చచ్చిపోయేదాకా వాడు గిజగిజా తన్ను కుంటాడు, తరువాత వాడి కళేబరాన్ని కుక్కలు ముక్కలకింద చీరేస్తాయి.

ము——అతడి ప్రాణం నువ్వు నాశనం చెయ్యలేవు.

రా——అయితే నేను పధ్నాలుగు వందలమంది యోధుల్ని చంపేసి వాళ్ళ శవాల్తో ఒక పెద్ద దిబ్బ వెయించానే! నేను జీవించి ఉన్నాను, కాని వాళ్ళిప్పుడు లేరు. నేను ప్రాణాలు నాశనం చెయ్యగలను అనడానికి అది ఋజువు కాదూ ?

ము——వాళ్ళంతా లేరని నీ కెట్లా తెలుసునూ ?

రా——నాకు వాళ్ళు కనపడటం లేదుగనక. వాళ్ళు హింసలు పడ్డారు, నే పడలేదు. అందుకని వాళ్ళు చెడ్డారు, నాకు మేలైంది.

ము——అది కూడా నీకు ఊరికే అల్లా కనిపిస్తోంది. నిన్నే నువ్వు నిర్రవధ చేసుకున్నావు, వాళ్ళని చెయ్యడం కాదు.

రా——నాకు బోధపడటంలేదు.

ము——అసలు బోధపడాలని ఉందా ?

రా——ఆ. ఉంది.

ము——(ఒక పెద్దజలకోశం చూపిస్తూ) అయితే అక్కడికి

రా—(లేచి, ఆజలకోశాన్ని సమీపించాడు)

ము—పైదుస్తులు తీసేసి, ఇందులో దిగు.

రా—(అట్లా చేశాడు)

ము—(ఒక తూరీవంటి పాత్ర నీళ్ళలో ముంచుతూ) నేను ఇందులోంచి నీళ్ళు నీనెత్తిమీద పొయ్యడం మొదలెట్టగానే, నీతల నీళ్ళల్లో ముంచేసుగో. ముసిలివాడు రాజు నెత్తిమీద పాత్రలోని నీళ్ళు దిమ్మరించాడు. రాజు తన తల నీళ్ళల్లో మునిగేటట్టు వంచేసుగున్నాడు. తక్షణం తను ఈశరథం కాక మరొకణ్ణి అనే భావం అతనికి బయల్దేరించి. మరొకణ్ణనే భావంలో అతడు పడగానే, తను ఒక నొప్పపాన్పుమీద పడుండడమూ తన సరసని ఒక చక్కని యువతి ఉండడమూ అతడు చూశాడు. అతడు లోగడ ఎన్నడూ ఆవిణ్ణి చూడలేదు గాని, ఆవిడ తన భార్యే అని తనకి తెలుస్తోంది. ఆయువతి లేచి, అతనితో: "ప్రాణేశ్వరా! లైలీరాజా! నిన్నటిపనికి మీరు అలిసిపోయి ఎప్పటి కంటె దీర్ఘంగా నిద్రపోయారు. మీ విశ్రాంతికి భంగం రాకుండా జాగ్రత్తపడి, మిమ్మల్ని లేపనేనా లేపలేదు. కాని, మన కొలువు కూటంలో రాజకుమారు లంతా మీకోసం వేచి ఉన్నారు. దుస్తులు ధరించి వెళ్ళండి" అంది. ఈమాటలవల్ల తను లైలీయే అని ఈశరథానికి అర్థమైంది. ఈ సంఘటనకి అతడు నివ్వెరపడ లేదుగాని, ఈమాత్రం సంగతి పూర్వం ఎరక్కపోతినే అని ఆశ్చర్యపడ్డాడు. అతడు లేచి, దుస్తులు వేసుగుని, రాజకుమారులు వేచి ఉన్న కొలువుకి వెళ్ళాడు.

రాజకుమారులందరూ తమ రాజైన లైలీకి సాష్టాంగ అభివందనం చేసి, లేచి, ఆయన అనుజ్ఞ ఇయ్యగా ఎదట కూచు

న్నారు. రాజకుమాళ్ళలో పెద్దవాడు మాట్లాడాడు. దుష్టుడైన ఈశరథరాజు చేసే అపచారాలు భరించడం మరి అసంభవం అనిన్నీ, అతడితో యుద్ధం చెయ్యాలనిన్నీ అతడన్నాడు. కాని శైలీ అందుకు అంగీకరించక, ఈశరథరాజుని మందలించే టందుకు దూతన్ని పంపవలిసి ఉంటుందని ఉత్తరువిస్తూ, కొలువు చాలించి, రాజకుమారుల్ని పంపించేశాడు. తరవాత, రాయబారులుగా పనిచెయ్యడానికి సుప్రసిద్ధుల్ని నియమించి, ఈశరథ రాజుతో వాళ్ళనవలసిన మాటలు నొక్కి నొక్కి చెప్పాడు. ఈ పని పూర్తిచేసుగుని, శైలీరాజు సనుకునే ఈశరథం అడివి గాడిదల్ని వేటాడ్డానికి గుర్రంమీద వెళ్ళాడు. వేట తృప్తిగా జరిగింది. అతడు స్వయంగానే రెండింటిని చంపగలిగాడు. ఇంటికి వచ్చి మిత్రుల్తో కలిసి విందారగించాడు, బానిసపిల్లల నాట్యం తిలకించాడు, మర్నాడు రాజసభకి వెళ్ళాడు. అర్జీవార్లు, వ్యాజ్యాలవాళ్లు, నేరారోపణ జరిగి విచారణ జరగవలిసినవాళ్లు— అంతా కాచుగుని ఉండగా, అతడు, ఎప్పటిలాగే, దాఖలైన తగాదాలమీద తీర్పు చెప్పాడు. ఈ పని అల్లా పూర్తిచేసుగుని, వేట తన అభిమాన వినోదం గనక మళ్ళీ వేటకి వెళ్ళాడు. అక్కడ మళ్ళీ విజయవంతంగానే ఉంది. ఈసారి స్వంత హస్తంతో ఒక ముసిలి సింహాని చంపి దాని కూనల్ని పట్టే శాడు. వేటనించివచ్చి మళ్ళీ తన మిత్రుల్తో కలిసి భుజించి, గానమూ, నాట్యమూ ఆనందించి, రాత్రి తన ప్రియభార్యతో గడిపాడు. తనే అయుండిన ఈశరథం దగ్గిరికి తను పంపించి ఉన్న రాయబారులు ఎప్పుడు వెనక్కొస్తారా అని యెదురు

చూస్తూ, కొంతవరకు రాజవిషులకి తక్కింది వినోదాలకేందా తన కాలం కేటాయిస్తూ అతడు దినాలుకాదు, వారాలపాటు ఉండి పోయాడు. ఒక నెల గడచిం తరవాతగాని రాయబారులు వెనక్కి రాలేదు. ఆ రావడమైనా, ముక్కూ చెవులూ తెగ్గోసి పంపిం చెయ్యగా వచ్చారు. పైగా, వాళ్లు మోసుగు వచ్చిన కబురు ఏమిటీ, తక్షణం లైలీరాజు వెండి బంగారాలతో సైప్రెస్ కల పతో కానుక పట్టుగుని. స్వయంగా బయల్దేరి వెళ్ళి ఈశరథం యెడల తన ప్రభుభక్తి ప్రకటించని పక్షానికి, రాయబారులకి జరిగినంతపనీ లైలీరాజుకి కుడా జరుగుతుంది—అని.

(పూర్వం ఈశరథం అయిన) లైలీరాజు రాజకుమారుల్ని మళ్ళీ సమావేశపరిచి తన కర్తవ్యం గురించి వాళ్ళతో సంప్రతిం చాడు. ఈశరథం వచ్చి తమరిని ఎదుర్కొనక పూర్వమే, అతడి మీద యుద్ధానికి బయల్దేరాలని వాళ్లు ఏకగ్రీవంగా చెప్పారు. అందుకు రాజు అంగీకరించి, అగ్రభాగంలో ఉండి సేనని తనే నడిపిస్తూ సమరానికై సాగి వెళ్ళాడు. సమరం ఏడు రోజులపాటు జరిగింది. ప్రతిరోజూ యోధులకి ఉత్సాహం పొయ్యడానికి రాజు గుర్రంమీద సేనచుట్టూ తిరిగేవాడు. ఎనిమిదవనాడు లైలీ సేన ఒక నది ప్రవహిస్తూన్న ఒక వెడల్పాటి లోయలో ఈశరథం సేనకి ఎదురైంది. లైలీసేన ధైర్యంతో పోరింది. కాని (వెనక ఈశరథం అయిన) లైలీ శత్రుసేనలు పర్వత పార్శ్వాలలో చీమల పుట్టలులాగ బయల్దేరి దిగడమూ ఆ లోయని నిండెయ్య డమూ తన సేనని చుట్టుముట్టడమూ గమనించాడు. అతడు తన రథం ఎక్కి, సంగ్రామం దట్టంగాఉన్న మధ్యకి తను వెళ్ళి

పడి శత్రువుల్ని నరికేసి కూల్చేశాడు. కాని, లైలీ సేనలు ఎన్నివందలో ఈశరథం సేనలు అన్నివేలు అవడంచేత దెబ్బలు తగిలిన లైలీని ఖైదీగా పట్టేశారు. మరికొందర్ని కూడా బంధించి ఈశరథ యోధులు కాపలాలో తీసికెళ్ళారు. తొమ్మిదిరోజులు ప్రయాణంచేసి పదోనాడు వాళ్ళు నినెవే నగరంచేరి అక్కడ లైలీని ఒక బోనులో పెట్టేశారు. ఆకలి బాధనించీ దెబ్బలబాధనించీ కంటె తనకి జరిగిన అవమానానికీ కలిగిన వ్యర్థకోపానికీ లైలీ మరీ క్షోభపడ్డాడు. తను పడుతూన్న బాధకి శత్రువులమీద కసి తీర్చుగోవాలంటే తను ఎంత శక్తి హీనుడో అతనికి అనిపించింది అతడు చెయ్యగలిగిందల్లా ఒకటే! తన క్షోభనీ శత్రువులు ఆనందపడే అవకాశం తొలగిం చేసి, వాళ్ళు తనని ఏమి చేసినాసరే, నోరెత్తకుండా, అదంతా ధైర్యంతో భరిస్తూండాలని దృఢనిశ్చయం చేసుగున్నాడు. ఆ బోనులో అతడు ఇరవైరోజులు కూచున్నాడు, ఉరిశిక్ష నిరీక్షిస్తూ. ఈ లోపున తన బంధుమిత్రుల్ని ఉరికి తీసుగు పోవడం అతడు చూశాడు, ఉరితియ్యబడ్డవాళ్ళ చివరి ఏడుపులు అతడు విన్నాడు. కొందరికి కాళ్ళూ చేతులూ కొట్టేశారు, కొందరి చర్మం బతికుండగానే ఒల్చేశారు, కాని, ఏ ఆందోళనా ఏ కనికరమూ ఏ భయమూ అతడు ప్రకటించలేదు, తన ప్రాణమైన తన భార్యని బంధించి ఇద్దరు కొజ్జాలు ఈడ్చుకు పోయారు. ఈశరథానికి బానిసగా తనని తీసుగుపోతారని అత డెరుగును. ఆ విషయం కూడా అతడు నోరు నొక్కుగుని భరిం చాడు. కాని, తన కాపలాభటుల్లో ఒకడు, 'లైలీ! నిన్ను చూస్తే

జాలేస్తోంది. వెనకట్లో నువ్వు రాజువి. ఇప్పుడు ఏమిటి నీపని?' అన్నాడు. ఈ మాటలు విని శ్రైలీ తను నష్టపోయింది యావత్తూ స్ఫురణకి తెచ్చుగున్నాడు. ఆ బోనుకి ఉన్న ఇనప కమ్మిలెన్నిట్టి తన తల బద్దలు కొట్టుగుని ఆత్మహత్య చేసుగోవాలని అతడు చూశాడు కాని, అంత సత్తువ అతని దగ్గిర లేక పోయింది. నిరాశలో ఒక్క మూలుగు మూలిగి అతడు కుంగి కిందికి సాగారి పడిపోయాడు.

చివరికి ఎల్లాగో ఇద్దరు హంతకులు అతని బోను తలుపు తెరిచి, అతడి చేతులు వెనక్కి విరిచికట్టి, అతణ్ణి వధ్యస్థానానికి నడిపించుగు వెళ్ళారు. అదంతా రక్తమయం. కోసుగా ఉన్న ఉరికంబం రక్తం ఓడుతోంది. దాని మీదినించి అంతకి ముందే అతని స్నేహితుల్లో ఒకడి శవం వదిలించి పడగొటారు. కంబాన్ని ఆకీతిగా ఖాళీచెయ్యడం తన వధనిమిత్తమే అని అతడు అర్థంచేసుగున్నాడు. శ్రైలీ దుస్తులు వాళ్ళు తీసేశారు. పూర్వం సుందరంగా ఉండే తన శరీరం ఎంత సన్నంగా తయారైందో చూసుగుని అతడు హడిలిపోయాడు. ఈ యిద్దరు హంతకులూ పుడకలులా ఉన్న అతడి తొడలతో అతణ్ణి దొరకపుచ్చుగుని, పైకెత్తి కంబంమీద అతడు పడేటట్టు అతణ్ణి వదలడానికి సిద్ధంగా ఉన్నారు. 'ఇదే మరణం, విధ్వంసనం' అని శ్రైలీ అనుకుని, చివరదాకా తను ప్రశాంతంగా ఉండడానికి చేసుగున్న శపథంమరిచిపోయి, ఎగుపుల్తో ఏడుస్తూకనికరంకోసం ప్రార్థించాడు, కాని వినిపించుగున్నవాడు లేడు. అతడు తనలో 'ఇది అసంభవం. నిశ్చయంగా ఇది నా నిద్దట్లో వచ్చిన కల'

అనుకుని, మేలుకోడానికి యత్నించి, మేలుకున్నాడు. తీరా చూస్తే తను ఈశరథమూ కాడు, లైలీ కాడు—ఒక రకం జంతువు! అతడు తనొక జంతువని తెలుసుగున్నందుకు ఆశ్చర్యపడి అంతకి పూర్వమే ఆ సంగతి తెలుసుగోనందుకు ఇంకోసారి ఆశ్చర్య పడ్డాడు. తను ఒక లోయలో లేతపచ్చిక తన పళ్ళతో కొరుకుతూ, తన పొడుగాటి తోకతో ఈగల్ని తోలుకుంటూ మేస్తున్నాడు. కొంతదూరాన్ని విప్పి గంతులేస్తూ ఓ గాడిదపిల్ల ఉంది——పొడుగాటి కాళ్లు, నల్లబూడిదరంగు, వీపుమీదచారలు! అది వెనకకాళ్ల పైకి తన్ని రైంయిమని దౌడుతీస్తూ ఈశరథం కేసి వచ్చి అతణ్ణి పొట్టకింద పొడిచి తన నున్నటి చిట్టిమూతితో చంటికోసం పంటాలుపడి, అది దొరకగానే నిమ్మళపడి క్రమంగా గుటకలువేస్తూ పాలుతాగింది. తను ఒక ఆడగాడిద అయిన సంగతీ ఆ పిల్లకి తల్లి నన్నసంగతీ ఈశరథానికి అవగాహన అయింది. కాని, ఆ విషయం మూలంగా అతడు ఆశ్చర్యాపడలేదు, ఏడవనూలేదు. సరిగదా ఆనందించాడు. ఏమంటే: సంతోషకరమైన ఒక అనుభవం అతడు అప్పుడు పొందగలిగాడు, తనలోనూ తన సంతానంలోనూ కుడా ఒకే కాలంలో ప్రాణం ఉండడం!

కాని, అకస్మికంగా ఏదో ఎగురుతూ జివ్వుమనే ధ్వనిచేస్తూ వచ్చి తన పొట్టకి ఓ పక్క గుచ్చుకుని, మొన వాడిగా ఉండడం చేత చర్మంలోకీ కండలోకీ కుడా దిగింది, (ఇప్పుడు గాడిదకుడా అయిన) ఈశరథానికి అది గుచ్చుకున్నచోట భగ్గుమని పోయింది. పిల్ల నోట్లోంచి తన పొదుగు ఊడలాక్కుని, చెవులు

వెనక్కి నిగిడించి, ఛౌడు తియ్యడం మొదలెట్టి, తను తప్పిజారి వచ్చిన మందకేసి అతడు దారి తీశాడు. పిల్లకుడా ఛౌడుతీస్తూ సరసనే వచ్చింది. కొంతసేపటికిగాని అవి మందని చేరుకో లేదు. ఎందు చేతంటే, ఆ మందకుడా పరుగు ప్రారంభించింది. ఈ లోపుగా ఒక బాణం మిక్కిలి వేగంగావచ్చి ఆ పిల్ల కంఠానికి గుచ్చుకుంది. అది దాని చర్మంచీల్చి మాంసంలో ఇంకా దిగుతూనే ఉంది. పిల్ల చాలా దీనంగా ఏడుస్తూ మోకరించిపోయింది. ఈశరథం దాన్ని వదలిపెట్టి ఊరుకోలేక, తను ఏమీ చెయ్యలేక దాని దగ్గిరే నుంచున్నాడు. పిల్లలేచి తన పొడుగు కాళ్ళతో ఇటూ అటూ తప్పటడుగులువేసి మళ్ళీ తూలింది. భయంకరమైన ఒక రెండు కాళ్ళ జంతువు, అనగా ఒకమనిషి, పరిగెత్తుకువచ్చి దానిమెద తెగ్గోశాడు. 'ఇది అసంభవం. ఇది యింకా కలే!' అనుకుంటూ మేలుకోడానికి ఈశరథం చివరియత్నం చేశాడు. తను లేడికాడు గాడిదా కాడు ఈశరథమే అని అతడికి తోచింది. అతడు గట్టిగా అరిచి, తక్షణం తన తల నీళ్ళల్లోంచి పైకి ఎత్తాడు. ఆ ముసలివాడు పక్కని నిలబడి ఆ పాత్రలో మిగిలిన కాసిని చుక్కలూ ఇంకా దిమ్మరిస్తూనే ఉన్నాడు. 'అయ్యో! నే నెంత ఘోరంగా బాధపడ్డానూ! పైగా ఎంత దీర్ఘకాలం బాధపడ్డానూ!' అన్నాడు ఈశరథం. అందుకు ఆ ముసలివాడు, 'దీర్ఘకాలమా? నీ తలకాయ నువ్వు నీళ్ళల్లో ఇట్టే ముంచావు, ఇట్టే పైకి తీశావు. అంతే. నేను పోస్తూనే ఉన్నాను, పాత్రలో నీటిచుక్కలు ఇంకా మిగిలే ఉన్నాయి చూడు. ఇప్పుడు నీకు బోధపడిందా?' అని

అడిగాడు, ఈశరథం ఏమీ సమాధానంచెప్పక్క ముసిలివాడికేసి భయంతో చూశాడు. ముసిలివాడు నవ్వి అందుకుని, 'ఇప్పుడు నీకు బోధపడిందా? శైలీవీ నువ్వే, నువ్వు చంపేసిన యోధు లందరూనువ్వే, నువ్వు వేటల్లో చంపి విందుల్లో తినేసిన జంతు వులూ నువ్వే — అని? ప్రాణం అనేది నీలోనే మకాం చేసిందని అనుకున్నావు. కాని వ్యామోహం అనే తెర పక్కకి లాగేసి, ఇతరులకి కీడుచేస్తే నీకే నువ్వు కీడుచేసుకున్నట్టని నీకు చూపిం చాను. అందరిలో ఉన్న ప్రాణమూ ఒకటే! ఆ ఒకే ఉమ్మడి ప్రాణంలో ఒక లేశం నీలోఉంది. నీ స్వంతం అయిన ఆ ఒక్క ప్రాణలేశమూ పుచ్చుగుని, నువ్వు ప్రాణాన్ని ఇంకా బాగు చెయ్యచ్చు, లేక ఇంకా పాడుచెయచ్చు, పెంచవచ్చు లేక తగ్గించవచ్చు. నీలోని ప్రాణానికి అభివృద్ధి కావాలంటే, ఇతరుల ప్రాణంనించి నీ ప్రాణాన్ని వేరుచేసే అడ్డు నాశనం చేసెయ్యాలి, ఇతరులు కుడా నువ్వే అనుకోవాలి, వాళ్ళని ప్రేమించాలి. అల్లా చేస్తే ప్రాణంలో నీకు వచ్చిన వాటా పెరుగుతుంది. నీ ప్రాణం మాత్రమే ప్రాణం అనుకుని, ఇతరుల ప్రాణాలు బలిచెయ్యడం ద్వారా నీ ప్రాణంయొక్క క్షేమం ఎక్కువ చేసుగోవాలని యత్నించావా, నీ ప్రాణానికి హాని చేసుగున్నవాడ వవుతావు. అల్లాచేస్తే నీ వాటాకి వచ్చిన ప్రాణం తరిగిపోతుంది. ఇతరుల్లో వాసంచేస్తూన్న ప్రాణాన్ని నశింపచెయ్యడం నీ తరంకానిపని. నువ్వు చంపేసిన వాళ్ళ ప్రాణం నీ దృష్టికి మాయం అయిన ట్టుంటుందికాని, నిజంగా నాశనంకాదు. నీ ప్రాణం పొడిగించు గుని ఇతరుల ఇతరుల ప్రాణం పొట్టిచెయ్యలని ఆలోచించావుకాని,

అది నీవల్లకాదు. ప్రాణం అనబడేది దేశానికీ కాలానికీ అతీతం. క్షణకాల ప్రాణమూ వెయ్యేళ్ళ ప్రాణమూ సమానమే. నీ ప్రాణం ఎంతో ప్రపంచంలోని గోచర అగోచరాల ప్రాణం యొక్క మొత్తం అంతే. ప్రాణాన్ని నశింపుచెయ్యడంగాని, మార్చడంగాని, అసంభవం. ఏమంటే, ప్రాణం ఒకటే ఉంటూం దేది, తక్కినదంతా ఉన్నట్టు కనపడుతుంది' అన్నాడు. అని ఆ ముసిలివాడు మాయం అయాడు.

మర్నాడు ఉదయాన్నే, ఖైదీలనీ తక్కిన ఖైదీల్నీ స్వేచ్ఛగా విడిచిపెట్టవలిసిందనీ, ఉరిశిక్షలు ఆపెయ్యవలిసిందనీ ఈశ్వరథం ఉత్తరువులు జారీచేశాడు. మూడోనాడు అతడు తన కొడుకుని పిలిచి, రాజ్యం యావత్తూ వాడికి అప్పగించేసి, తను నేర్చుగున్న దాన్నిగురించి మననం చెయ్యడానికి నిర్జనప్రదేశానికి వెళ్ళి పోయాడు. తరవాత అతడు దేశంలో విహరించి పట్టణాలూ పల్లెలూ గడుపుతూ, ప్రాణం అంతా ఒకటే అని జనానికి ఉప దేశిస్తూ, ఇతరులకి హాని చెయ్యదల్చినవాళ్ళు నిజానికి తమకే కీడుచేసుగున్నవా ళ్ళవుతారని తెలియపరుస్తూ, కాలం గడిపాడు.

---

# ఎలియా

పూర్వకాలంలో ఉఫా అనే ప్రభుత్వంలో బష్కీరు అనే తెగకి చెందిన ఎలియా అనేవా డుండేవాడు. ఇతని తండ్రే ఇతనికి పిల్లనిచూసి పెళ్ళిచేసి, తరవాత ఒక సంవత్సరానికి గతించాడు. ఎలియాకి ఆయన పెద్దఆస్తి యేమీ అప్పగించి పోలేదు. అప్పుడు ఎలియాకి ఏడు గోడిగలూ, రెండు ఆవులూ, సుమారు ఇరవై గొఱ్ఱెలూ మాత్రం ఉండేవి. అయితేమట్టుకు? అతడు మంచి నిర్వాహకుడు గనక త్వరలోనే ఎక్కువగా ఆర్జించడం మొదలెట్టాడు. ఉదయాస్తమానాలూ, అతడూ, భార్యా పన్లు చక్కబెడుతూనే ఉండేవారు, ఇంకా ఎవరూ లేవక పూర్వమే లేవడం అంతా పరున్నతరవాతే పడుకోడం. అందుకని, ఆయేటి కాయేడు అతని ఆస్తి పెరుగుతోచ్చింది. ఎలియా ఇల్లా జీవించుగుపోతూ కాస్త కాస్త చొప్పునే వెనకేసి వోలెడంత సంపద సంపాదించాడు. ముప్పైఅయిదు ఏళ్ళయేసరికి అతనికి రెండు వందల గుర్రాలూ, నూటయాభై పశువులూ, పన్నెండువందల గొఱ్ఱెలూ ఉన్నాయి. అతడు తన గొఱ్ఱెమందల్నీ పశుగణాల్నీ కాయడానికి పాలికాపుల్ని పెట్టుగున్నాడు, గోడిగల్నీ ఆవుల్నీ పితగడానికీ వెన్నతియ్యడానికీ జున్నువండడానికీ గోడిగ పాలల్లోంచి మద్యం తయారు చెయ్యడానికీ ఆడకూలీల్ని నియమించుగున్నాడు. ఎలియాకి ప్రతీదీ సమృద్ధిగాఉంది. తనకి లేక పోయినా ఇతనికి ఉందేమిరా అని ఏడవనివాడు ఆ జిల్లాలోలేడు. జనం, 'ఎలియా అదృష్టవంతుడు. ఏదిపడితే అది అతనికి

పుష్కలంగా ఉంది. అతని దృష్టికి ఐహికజీవితం చాలా సుఖదాయకంగా ఉండాలిమరి' అనేవాడు. పెద్దపెద్ద పదవుల్లో ఉన్న వాళ్ళు ఎలియా సంగతి విని అతని పరిచయం చేసుగోవాలని తంటాలు పడేవారు. దూరప్రాంతాల్నించి అనేకులు అతణ్ణి చూడవచ్చేవారు, అల్లాంటివాళ్ళకి అతడు ఆహార పానీయాలు ఇచ్చేవాడు. అతడింటికి ఎవరొచ్చినా వెళ్ళసింది, ఎప్పుడూ బల్లమీద మద్యమూ, టీ. షర్బతూ, మాంసనంటకమూ ఉండేవి. గ్రామాంతరంనించి జనం అతణ్ణి చూడవచ్చినప్పుడు ఒక గొఱ్ఱెని వేసేసేవాడు, ఒక్కొక్కప్పుడు రెండింటిని. అతిథులు మరీ ఎక్కువమంది అయినప్పుడు, వాళ్ళనిమిత్తం ఒక గోడిగనే కోసేసి వండేసేవారు.

ఎలియాకి సంతానం ముగ్గురూ, ఇద్దరు కొడుకులూ ఒక కూతురూనూ. అతడు వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసేశాడు. పూర్వం అతడు దరిద్రావస్థలో ఉండేటప్పుడు, కొడుకులు అతనికి సాయపడి వాళ్ళే మందల్ని గణాల్ని కాసిపెట్టేవారు. కాని, ఎలియా దగ్గిర సొమ్ము చేరుకోగానే, వాళ్ళు పాడైపోయారు. పెద్దాడు తాగుడులోనే పడ్డాడు. వాణ్ణి ఒక జగడంలో పొడిచేసి చంపేశారు, రెండోవాడు పెళ్ళాడిన పిల్ల తనమాటే నెగ్గాలి అనేరకం. అందుకని వాడు తండ్రిని అనువర్తించడం మానేశాడు. మరి తండ్రితో సమిష్టిగా ఉండలేకపోయాడు.

అందుకని వాళ్ళు వేర్లడ్డారు. ఎలియా ఆ కొడుక్కి ఒక యిల్లూ కొన్నిపశువుల్నీ ఇచ్చేశాడు. దాన్తో అతని సంపద తరిగిపోయింది. మరికొద్దికాలంలోనే, ఎలియా గొఱ్ఱెల్లో ఏదోజాడ్యం

బయల్దేరి, వాటిని చాలాభాగం రాల్చేసింది. తరవాత పంటలు పోయాయి, గడ్డిపైరు చెడిపోయింది. మరి ఆ శీతగట్టునాటికి ఎన్నో పశువులు చచ్చిపోయాయి. అదీకాక కర్ఘిజ్ అనే బంది పోటు దండు అకడి అశ్వగణాల్లో మిక్కిలి ప్రశస్తమైన దాన్ని పట్టేసి లాక్కుపోయారు. ఆరీతిగా ఎలియా ఆస్తి క్షీణించి పోయింది. మరో అవస్థ. అవతల ఆస్తి క్రమక్రమంగా ఎల్లా క్షీణించిందో అతని ఒంట్లో సత్తువకుడా క్రమక్రమంగా అల్లానే సన్నగిల్లిపోయింది. చివరకి అతనికి డెబ్భైఏళ్లొచ్చిన సమయంలో తనకున్న ఉన్నిలూ తివాసీలూ జీనులూ డేరాలూ— అన్నీ అతడు అమ్మేసుగోడం మొదలెట్టాడు. మరి ఆఖరు పద్దుగా, మిగిలిన కాసిని పశువుల్ని తెగనమ్మి పారెయ్యగానే, లేకపోవడం అనేది అతని ఎదురుగుండా సిద్ధమైకూచుంది. ఇదంతా ఎల్లాపోతోందిరా అని అతడు ఆలోచన చేసుగోడానికి వ్యవధిలేకుండానే ఆస్తిఆస్తియావత్తూ ఎగిరిచక్కాపోగా, అంత వార్ధకంలో తనూ భార్యా కుడా నౌకరీ చేసుగో వలిసిన అగత్యం వచ్చింది. అతనికి మిగిలిందల్లా ఏమిటంటే: తన ఒంటిమీది దుస్తులూ, ఒక ఉన్నిఅంగీ, ఒక టోప్పీ, ఇంట్లో చెప్పులూ బయట తొడిగేచెప్పులూ, మరి తన భార్యా! ఆవిడకీ వార్ధకం వచ్చేసింది. ఆవిడపేరు షెంషెమ్మాగీ. పోనీ, వేరడ్డ కొడుకు ఉన్నాడుగదా అనుకోడానికి వీల్లేకుండా వాడు దూరదేశం వెళ్ళి పోయాడు. సరి, కూతురు ఏమీ అనుకొనే అక్కర్లేకుండా, చచ్చేపోయింది. అందుకని ఆముసిలి దంపతులు ఎక్కడా ఆసరా అనేది లేకుండా అయారు.

కాని, ఇరుగుపొరుగువాడైన మహమ్మద్‌షా పీక్కమీద జాలి దల్చాడు. మహమ్మద్‌షా ధనికుడూకాడు దరిద్రుడూకాడు. గాని హాయిగా జీవించేవాడు. మంచివాడు. పూర్వం ఎలియా చేసిన అతిథిసత్కారం జ్ఞాపకం ఉన్నవాడు గనక, అతడు హృదయం కరిగి, "ఎలియా! వచ్చెయ్యండి. నువ్వూ నీభార్యా నాదగ్గిరుండి కాలంగడపండి నువ్వు వేసంగిలో నా కర్బూజా తోటలో, ఎంత చెయ్యగలిగితే అంత, పనిచెయ్. శీతకాలంలో పశువుల్ని మేపు. షెంషెమాగీ గోడిగల్ని పితగడం, మద్యం తయారు చెయ్యడం చూసుగుంటుంది. మీకు తిండికీ బట్టకీ లోటు చెయ్యను. ఇంకా నీకు ఏదేనా ఎప్పుడవసరం ఉంటే అప్పుడు చెప్పు, తక్షణం అది నీ దగ్గిర ఉంటుంది" అన్నాడు. ఎలియా మహమ్మద్‌షాకి తన కృతజ్ఞత తెలియపరిచాడు. తనూ తన భార్యా మహమ్మద్‌షాకి పనిచేసి పెట్టడానికి కుదురుకున్నారు. మొట్టమొదట, వాళ్ళకి అది ఒక దురవస్థలా కనపడి కష్టం తోచింది గాని, వాళ్ల క్రమేపీ అందుకు అలవాటు పడిపోయి సత్తువ ఉన్నంతమట్టుకు ఒళ్ళు దాచుగోకుండా పనిచేస్తూ, జీవించేస్తూండేవారు. మహమ్మద్‌షా అల్లాంటివాళ్ళని పెట్టుగోడం తనకే లాభసాటిగా ఉంటూన్నట్టు గ్రహించుకున్నాడు. ఎందుచేతంటే, లోగడ వాళ్ళూ యజమానులుగానే ఉండేవాళ్ళు గనక పని నిర్వహణంగురించి వాళ్ళకి బాగా తెలుసు, ఒళ్లు దాచుకోరు, చెయ్యగలిగినంత చెయ్యకమానరు. కాని, మహమ్మద్‌షాకి ఎప్పుడూ విచారంగానే ఉండేది. అయ్యో, వీళ్ళు అంత పెద్ద బతుకు బతికి చితిగిపోయి చివరకి ఈ దీన దశకి వచ్చారు గదా, అని.

ఒకసారి, మహమ్మద్‌షాని చూసి వెళ్ళడానికి చాలా దూరా న్నించి కొందరు బంధువు లొచ్చారు. వాళ్ళతోకూడా ఒక దివ్యజ్ఞాని వచ్చాడు. మహమ్మద్‌షా ఎలియాని పిల్చి ఒక గొర్రెని వేసెయ్యన్నాడు. ఎలియా ఒక గొర్రెని చర్మం ఒల్చేసి. వండేసి, అతిథులకి వడ్డింపించాడు. వాళ్లు ఆ మాంసాహారం తిని, కొంచెం టీ తాగి, మద్యం సేవించడం ప్రారంభించారు. వాళ్ళందరూ ఆతిథేయుడితో సహా తూలికా తల్పాలున్న తివాసీలమీద కూచుని, ఇష్టాగోష్ఠి కాపిస్తూ పానపాత్రల్లోంచి మద్యాలు చవిచూస్తూ ఉన్నారు. అప్పుడు తెఱిచున్న ఒక ద్వారం ఎదర్నించి, పని పూర్తిచేసుగుని ఎలియా వెళ్ళడం తటస్థించింది. అతణ్ణి ఆ ద్వారం ఎదర్నించి దాటనిచ్చి. మహమ్మద్‌షా, ఒక అతిథితో, "ఇప్పుడు మన ఎదర్నించి ఇట్లా దాటివెళ్ళిన ముసిలివాణ్ణి చూశావా?" అని అడిగాడు. ఆ అతిధి 'ఆ చూశాను. ఏమిటి అతడిలో ఉన్న విశేషం?' అన్నాడు. మహమ్మద్‌షా, 'అబ్బే, మరేమీలేదు. ఒకప్పుడు అతడు మా ధనికవర్గంలో అగ్రేసరుడు. అతనిపేరు ఎలియా. బహుశా నువ్వు వినుండచ్చు' అన్నాడు. అప్పుడా అతిథి, 'ఓ వినకేం, విధాయకంగా విన్నాను. కానైతే ఇతణ్ణి ఎన్నడూ చూసుండలేదు. ఇతనిపేరు దేశదేశాలా వ్యాపించింది' అన్నాడు. అందుకు మమమ్మద్‌షా, 'అవును. అయితేం, ఇప్పుడితని దగ్గిర గవ్వేనా లేదు. నా దగ్గిర కూలికి కుదురుకుని నాతో ఉంటున్నాడు. ఇతడి ముసిలి భార్యకుడా ఇక్కడే ఉంది, గోడి గల్ని పాలుపితికి పెడుతూ.' అన్నాడు. ఆ అతిథికి ఛాలా

ఆశ్చర్యంవేసింది. అతడు నాలిక అంగట్ని నొక్కి 'త' అని పిలిచి, తల ఊగిస్తూ, 'అదృష్టం చక్రంలాగ తిరిగి పోతుంది. ఒక్కొక్కణ్ణి పైకి ఎత్తేస్తుంది, మరొకణ్ణి కిందికి దింపేసి కూలేస్తుంది. అయితే. ఈ ముసిలివాడు తను నష్టపోయిన ఆస్తి గురించి దుఃఖపడు తూంటాడా?' అని అడిగాడు. అందుకు మహమ్మద్‌షా, 'ఏమో! ఎవడు చెప్పగలడూ? అతడు నెమ్మదిగా ప్రశాంతంగా ఉంటూ పని బాగాచేస్తాడు మరి' అన్నాడు. ఆ అతిథి, 'అతనితో మాట్లాడ్డానికి వీలేనా? అతని జీవితం గురించి కనుక్కోవాలని నాకు మహాఉంది' అన్నాడు. అందుకు యజమాని, 'వీల్లేకపోవడేం?' అని లేచి తమరు కూచున్న తోపుడుగది కిటికీలోంచి "బాబా! (అనగా వాళ్ళ బష్కీరు భాషలో 'తాత' అన్నమాట), లోపలికివచ్చి, ఓ పాత్ర మద్యం సేవించి వెళ్ళు. మీ ముసిలావిణ్ణి కుడా ఇక్కడికి రమ్మను" అన్నాడు.

ఎలియా భార్య సహా వచ్చాడు. యజమానికీ అతిథులకీ వందనాదికం జరిపిం తరవాత, అతడు ఒక ప్రార్థన అనుకుని, తలుపుదగ్గిర కుర్చీలాక్కొని కూచున్నాడు. అతని భార్య తెర వెనక్కివెళ్ళి తన యజమాను రాలి దగ్గిర కూచుంది. మద్యంతో ఒక పానపాత్ర ఎలియాకి అందిచ్చారు. అతడు తన యజమానికీ వచ్చిన అతిథులకీ మేలుకోరి, కొద్దిగా పుచ్చుగుని పాత్ర కింద ఉంచాడు. అప్పుడు అతడితో ప్రసంగించ దల్చిన అతిథి, 'ఏం, తాతా! మేం కనపడగానే నువ్వు బాధే ఎక్కువ పడుతున్నా

వేమో, అనుకుంటాను. ఏమంటే, నీ పూర్వ వైభవాలూ నీ ప్రస్తుత కష్టాలూ జ్ఞాపకం వచ్చేస్తాయి మరి,' అన్నాడు.

ఎలియా చిరునవ్వు నవ్వి. 'సుఖం ఏమిటో కష్టం ఏమిటో నేను చెప్పేస్తే మీరు నమ్మరు. అంతకంటె, నా భార్యని అడగండి. స్త్రీ గదా, హృదయంలో ఉన్నది నాలికతో అనేస్తుంది, ఆమె చెబుతుంది ఇందులో యథార్థం యావత్తూ.' అన్నాడు.

అతిథి తెరకేసి తిరిగి, 'ఏం తాతమ్మా! నువ్వే చెప్పుపోసీ, మీ వెనకటి సుఖం స్మరించుగుంటూ మీ ప్రస్తుతకష్టం పడుతూంటే ఎట్లా ఉంటుందో,' అన్నాడు.

అప్పుడు షెంషెమాగీ తెర వెనకనించి, 'దాన్ని గురించి నా అభిప్రాయం ఏమంటే: మా ముసిలాయనా నేనూ ఓ యాభై యేళ్ళపాటు జీవిస్తూ సౌఖ్యంకోసం వెతికాం. కాని మా కది కనిపించనే లేదు. ఇదుగో, ఇప్పుడు, క్రితం రెండేళ్ళనించీ—అనగా మాకు ఉన్నదంతా పోయి మేం కాయ కష్టపడి బతగవలసిన అవసరం మాకు వచ్చినప్పటి నించీ. యథార్థ సుఖం ఏదో గుర్తించుకోగలిగాం. మా ప్రస్తుత స్థితికంటె శ్రేష్ఠతరమైన పదవి ఏదీ మేం కోరుకోం' అంది. అతిథులంతా ఆశ్చర్యపడ్డారు. యజమాని కుడా ఆశ్చర్యపడి, ఊరుకోక, లేచి వెళ్ళి, తెర వెనక్కి తీసేశాడు, ఆమె ముఖం చూడాలని. ఆమె మడిచిన బాహువులతో చిరునవ్వుతో భర్తని చూస్తూ నుంచుని ఉంది. అపెడికేసిచూసి భర్తా చిరునవ్వు నవ్వాడు. ముసిలావిడ ఇంకా మాట్లాడుతూ: 'నేను యథార్థమే చెప్పాను, హేళన చెయ్యడం లేదు. ఓ అర్ధ శతాబ్ద కాలం మేం సుఖంకోసం

వెతిగాం, మా చేతుల్లో ధనం ఉన్నంతకాలం, అది మాకు కనపడేలేదు. తరవాత, మా కున్నదంతాపోయి మేం కాయ కష్టానికి కుదురుకున్న తరవాత, మాకు ఎటువంటి సౌఖ్యం దొరికిందంటే, అంతకంటె ఎక్కువ మంచిది మా కక్కర్లే లేదు' అంది.

దానికా అతిథి, "అయితే నీ సౌఖ్యం యొక్క తత్త్వం ఏమిటి?" అని అడిగాడు, అందుకు బదులుగా ఆమె, 'ఇదుగో చెబుతూంటేనే: మేం ధనికులమై ఉండినప్పుడు మాకు ఎన్ని తాపత్రయాలో: అప్పు డెప్పుడేనా మేం వేరే కూచుని మాట్లాడు కునేటందుకుగాని, మా అంతరాత్మలగురించి ఆలోచించుగోడానికి గాని, ఆఖరికి దైవాన్ని ప్రార్థించుగునేటందుకు గాని, మాకే మన్నా వ్యవధి ఉంటేనా? అదుగో ఎవరో చూడొచ్చారనడం, వాళ్ళకి భోజనానికి ఏమేమి తయారు చెయ్యాలో, బహుమానాలు ఏమేమి ఇయ్యాలో ఆలోచించడం—లేకపోతే వాళ్ళేళ్ళి మమ్మల్ని యాగీచేస్తారేమో అని భయం: వాళ్ల వెళ్ళడంతోటే, పన్లుచేసేవాళ్ళని చూసుగోడం! ఎందుకంటే, వాళ్ళు పని వీలై నంత ఎగబెట్టి ప్రతిఫలం వీలైనంత ఎక్కువ లాగాలనీ, మేం ఎంతపని వాళ్ళవల్ల కాగలదో అంతా పుచ్చుగోవాలనీ: అల్లా మేం పాపం చేశాం. అదికాక మా కెప్పుడూ ఏ గుఱ్ఱపిల్లని ఏ ఆవుదూడని తోడేలు ఎక్కడ వేసుగుపోతుందో, దొంగలు పడి గుఱ్ఱాల్ని ఎక్కడతోలుకు పోతారో అని తెగభయమే. అడగొడ్డెలు పిల్లలమీద పడుకుని అణిచేస్తాయేమో అని బాధ పడుతూ మేం రాత్రెళ్ల చాలా సేపు మేలుకుని ఉంటూండడమే.

పైగా చీటికీ మాటికీ లేచి అంతా సరిగ్గా ఉందోలేదో చూసు గుంటూండడం! ఒక చిక్కు చక్కపరచడం అయిందే అను కుంటే మరో తప్పి ఉబికి సిద్ధంకావడం! ఎల్లాంటివీ? శీతకాలా నికి సరిపడ గడ్డి ఎట్లా సేకరించడమూలాంటివి. అవన్నీ అల్లా ఉండనీండి — నేనూ మా ముసిలాయనా అప్పుడప్పుడు ఎడ్డెం అంటే తెడ్డెం అనుకుంటూండడం. ఏదేనా పని మనం ఇట్లా ఇట్లా చెయ్యాలి అని ఆయనా, అట్లా ఎంతమాత్రం చెయ్య కూడదు అని నేనూ, అందుగురించి మేం ఎంతో సేపు ఖజ్జా ఆడుకునేవాళ్ళం—అంటే మళ్ళీ పాపం చేసేవాళ్ళం. ఆమోస్త రుగా ఒక కష్టంలోంచి మరోకష్టంలోకీ, ఓపాపంలోంచి మరో పాపంలోకీ, మేం దాటుకుంటూ వెడుతూ ఉండడంవల్ల, సౌఖ్యం అనేది మాకుదొరకలేదు, ఆ అతిథి, "సరి. మరి ఇప్పుడు?" అని అడిగాడు.

ఆమె. "ఇప్పుడా? నా భర్తా నేనూ ఉదయాన్నిలేవగానే, ఎప్పుడూ మనసుకి ఇంపైన మాట తప్ప ఆడుకోం. జగడం ఆడుకోవలసిన విషయం ఏమీ లేకపోబట్టి ప్రశాంతంగా జీవి స్తున్నాం. యజమానికి ఉత్తమసేవ చెయ్యడం ఎల్లాగా అని తప్ప మాకు ఏ ఆందోళనా లేదు. మా సత్తువ మమ్మల్ని ఎంత చెయ్యనిస్తే అంతా చేస్తాం. చేసేది ఇష్టంతో రూఢిగా చేస్తాం. యజమాని మన మూలంగానష్టపడకూడదు; లాభం పొందాలి గానీ, అనుకుని చేస్తాం. మేం పని చూసుగుని రాగానే మధ్యాహ్న భోజనమూ సిద్ధంగా ఉంటుంది, రెండో సబురు రాగానే రాత్రి భోజనమూ సిద్ధంగా ఉంటుంది. పైగా సేవించడానికి మద్యం

ఉంటుంది. చలికాగడానికి పొయిలోకి బోలెడు వంటచెరకుంది చలి ఆపడానికి ఉన్ని అంగీ ఉంది. మా ఇష్టాగోష్ఠి ప్రసంగాలకీ వ్యవధి ఉంది, మా అంతరాత్మల్ని గురించి ఆలోచించుగోడానికీ వ్యవధి ఉంది, మా దైవప్రార్థనలకీ వ్యవధి ఉంది. యాభై ఏళ్ళు సౌఖ్యంకోసం తెగవెతికాం, చిట్టచివరకి ఇప్పుడు ఇక్కడ సౌఖ్యం అనేది మాకు దొరికింది'' అని చెప్పింది.

అతిథులందరూ నవ్వేశారు.

కాని, ఎలియా, ''నవ్వకండి, స్నేహితులారా ! ఇది వేళా కోళానికి విషయంకాదు, జీవితం గురించిన సత్యం. మొట్టమొదట, మేం కూడా మా ఐశ్వర్యం పోయిందో అని గొల్లుమని ఏడ్చిన వాళ్ళమే. అటువంటివాళ్ళం ఇప్పుడిల్లా చెబుతున్నామూ అంటే, ఇది మమ్మల్ని మేమే ఓదార్చుగోడానికి కాదు, మీ మేలు కోసమే అన్నాడు.

అప్పుడు ఆ దివ్యజ్ఞాని, ''ఇది జ్ఞానంతో కూడిన సంభాషణ. ఎలియా చెప్పింది కేవల సత్యం. దివ్యగ్రంథంలోకూడా అమాటే చెప్పి ఉంది'' అన్నాడు.

అప్పుడు ఆ అతిథులు నవ్వడం మాని, ఆలోచించే ధోరణిలో పడ్డారు.

# ఢంకా

(వోల్గా ప్రాంతంలో చిరకాలం ప్రచారంలోఉన్న జానపదగాథ)

ఎమిల్యాన్ ఒక మోటపనివాడు. ఒక యజమానికి కుదురు కున్నాడు. అతడు ఒకనాడు పనికి వెడుతూ దారిలోఉన్న ఒక పచ్చికబయలుమీద తన పాదాలదగ్గిరికి దూకిన ఒక కప్పని తొక్కినంతపని చేశాడుగాని తొక్కలేదు, కాస్తలో దాటిపోయే ట్టు వ్యవహరించాడు. హఠాత్తుగా ఎవరో వెనకనించి తనని పిల్చినట్టయింది. అతడు వెనక్కి తిరిగి చూడగా ఒక చక్కని పిల్ల కనపడింది. ఆపిల్ల, 'ఎమిల్యాన్! పెళ్ళెందుకు చేసుగో కూడదు నువ్వు?' అంది.

ఎ—పెళ్ళెల్లా చేసుకోగలను, చిన్నదానా! నా వంటిమీది దుస్తులు తప్ప నాకు మరేమీలేవు. నేను భర్తగా ఉండాలని ఎవరూ కోరరు.

పి—నన్ను చేసుగో, భార్యగా.

ఎ—(ఆ పడుచంటే యిష్టపడుతూ) చేసుగోడం చాలా సంతోష దాయకమే. కాని ఉండడం ఎక్కడ? జీవించడం ఎట్లా?

పి—వాట్లనిగురించి బాధపడటం ఎందుకు? ఎవరైనాసరే పని కొంచెం ఎక్కువచేసి నిద్దర కొంచెం తక్కువచేస్తే, ఎక్క డున్నాగానీ తిండికీ బట్టకీ లోటురాదు.

ఎ—అయితే, మా భాగే. పెళ్ళాడదాం. ఇప్పు డెక్కడికి వెడదాం?

పి—పట్నానికి వెడదాం.

ఎమిల్యానూ పిల్లా పట్నం వెళ్ళగా, ఆ పట్టణానికి ఒక చివార్న ఉన్న ఒక గుడిసెలోకి ఆపిల్ల అతణ్ణి తీసిగెళ్ళింది. వాళ్ళు పెళ్ళిచేసుగుని కాపరం చేస్తున్నారు.

ఒకనాడు నగరం చూడవచ్చిన ఆ రాజుగారి శకటం ఎమిల్యాన్ గుడిసె పక్కనించి వెళ్ళింది. ఎమిల్యాన్ పెళ్ళాం రాజుని చూడడానికి వచ్చి గుమ్మంలో నిలబడింది. రాజు ఆవిణ్ణి గమనించి, చాలా నిర్ఘాంతపోయి 'ఎక్కణ్ణించి వచ్చింది చెప్మా ఇంత అందం ఇక్కడికి!' అనుకుని, శకటం ఆపుచేయించి. ఆవిణ్ణి సంబోధించి, 'ఏయ్, ఎవరునువ్వు?' అని అడిగాడు. 'ఎమిల్యాన్ అనే రైతు భార్యని' అంది ఆవిడ. 'ఇంత చక్కని చుక్కవిగదా, తీరామోసి ఒక రైతుని పెళ్ళాడేసేవేం? నువ్వు రాణివి కావలిసినదానవు' అని రాజు అన్నాడు. 'మీ మాటల్లో ఉన్న దయకి చాలా కృతజ్ఞురాల్ని. కాని, ఒక రైతు నాకు భర్త కావడం నాకు చాలు' అని ఆవిడ బదులు చెప్పింది. రాజు ఆమెతో కొంచెంసేపు ప్రసంగించి, శకటం పోనీం డన్నాడు. సౌధానికి వెళ్ళాడన్నమాటేకాని, ఎమిల్యాన్ భార్యసంగతి తన తలలోంచి వదిలించుకో లేకపోయాడు. రాత్రంతా అతనికి ఒక్క కునుకులేదు. ఆవిణ్ణి స్వంతం చేసుగోవడం ఎల్లానా అని ఆలోచించాడు, ఎంత ఆలోచించినా అతనికి ఓ దారంటూ కనపడ లేదు. అప్పు డతడు తన నౌఖర్లని పిల్చి, వాళ్ళేదేనా దారి చూసి తీరాలని వాళ్ళతో అన్నాడు. వాళ్ళు, 'ఎమిల్యాన్ వచ్చి రాజ సౌధంలో పనిచెయ్యాలి, అని ఆజ్ఞాపించండి. మేం అతనికి

తగనిపని చెబుతాం, చెయ్యలేక అతను చచ్చిపోతాడు. అతని పెళ్ళాం ముండమోస్తుంది. అప్పుడు ఆవిజ్ఞ మీరు స్వీకరించండి' అని సలహా ఇచ్చారు. వారి సలహా రాజు అనువర్తించాడు. పనివాడుగా ఎమిల్యాన్ రాజసౌధానికి రావలసి ఉంటుందనిన్నీ అతడు భార్యతో సహా వచ్చి సౌధంలోనే కాపరం చెయ్యవలసి ఉంటుందనిన్నీ రాజు ఉత్తరువులు జారీ చేశాడు. రాజమాతలు రాజాజ్ఞ ఎమిల్యాన్‌కి అందజేశారు. అతని భార్య, 'వెళ్ళు, ఎమిల్యాన్. రోజల్లా పనిచేసి, రాత్రి ఇంటికి వచ్చేసెయ్' అంది. ఎమిల్యాన్ బయల్దేరి వెళ్ళి సౌధం సమీపించగానే రాజు గారి కోశాధికారి వచ్చి, 'భార్యతో సహా రాకుండా, ఒంటరిగా వచ్చేశావేం?' అని అతణ్ణి అడిగాడు. 'ఆవిణ్ణి ఈడ్చడం ఎందుకూ ఇక్కడికీ అక్కడికీనూ? ఉండడానికి కొంప ఉంది గదా!' అని ఎమిల్యాన్ అన్నాడు. ఆ రోజున ఇద్దరు చెయ్యగల పని ఎమిల్యాన్‌కి అప్పగించారు. పూర్తిచెయ్యగల ఆశవదులుకునే అతడు ఆరంభించాడుగాని, సాయంత్రం పడేసరికి అదేమి అద్భుతమో, పని పూర్తిగా అయిపోయింది. అది పూర్తి అవడం చూసి కోశాధికారి తెల్లబోయాడు. మర్నాడు నలుగురు చెయ్యగలపని ఎమిల్యాన్ చెయ్యవలిసి ఉంటుందని అన్నాడు. ఎమిల్యాన్ తన ఇంటికి వెళ్ళాడు. అక్కడ అంతా తుడిచి సుబ్బరంచేసి నీటుగా ఉంది. పడుకునే వేడిమిద్దె వెచ్చపరిచి ఉంది, భోజనం వండి సిద్ధంగా ఉంది. బల్లదగ్గిర అతని భార్య కుట్టుగుంటూ అతనికోసం ఎదురుచూస్తూ కూచుంది. ఆవిడ వచ్చారా అని, బల్లమీద, పదార్థాలన్నీ అతడు తినడానికీ తాగ

డానికే ఉంచి, పని ఎల్లాఉంది అంటూ వాకబు చేసింది. 'అయ్యో! ఏం అడుగుతావ్, పాడుపని! నా శక్తికి మించిన పని చెయ్యా లంటున్నారు. పనితో నన్ను చంపెయ్యాలని వాళ్ళ కోరిక.' అన్నా డతడు. ఆమె, 'పని గురించి చికాకు పడకు. ఎంత పని చేశాం అని వెనక్కి గాని, ఎంత పని మిగిలింది అని ముందుకి గాని ఎన్నడూ చూడకు. పని చేస్తూనే ఉండు, చాలు, సర్వమూ సవ్యంగా ఉంటుంది' అని చెప్పింది. ఆ రాత్రి ఎమిల్యాన్ పడుకుని సుఖంగా నిద్రపో యాడు. మర్నాడు పొద్దున్న లేచి పనికివెళ్ళి తల ఎత్తకుండా పనిచేశాడు. చూసోండి, మహాద్భుతం! సాయంత్రానికి పని పూర్తి అయింది, చీకటి పడకుండా అతడు ఇల్లు చేరుకున్నాడు. ఇంకా ఇంకా అతడు చెయ్యవలిసిన పని పెంచుతోచ్చారు గాని, సకాలంలో అతడు దాని అంతం చూస్తూ రాత్రి పడకుండా పడుకోడానికి ఇంటికి పోయేవాడు. ఒక వారం జరిగింది. మోటు పని హెచ్చు చెయ్యడంవల్ల అతణ్ని లొంగదియ్యలేం అని రాజు అనుచరులు గ్రహించి, నేర్పు అవసరం ఉండే పని ఇచ్చి చూశారు. కాని, ఇందువల్లా లాభంలేకపోయింది. వడ్రంగం, తాపీపని, ఇంటినేత—ఏ పనిట అతడికి బెత్తాయించనీంది, ఎమిల్యాన్ సకాలంలో అది పూర్తిచేసేసి రాత్రికి భార్యదగ్గిరికి ఇంటికి పోయేవాడు. ఈ తీరుగా రెండోవారం జరిగింది. దాంతో రాజు అనుచర్లని పిలిచి, 'ఏమర్రా! వట్టిపుణ్యానికా నేను మిమ్మల్ని మేపుతూంటా! రెండువారాలు జరిగాయి. మీరు నిర్వహించింది కించిత్తూ నాకు కనపడదు. పని హెచ్చుచేసి

ఎమిల్యాన్ని మీరు విసిగించేస్తాం అన్నారేకాని, రోజూ నా కిటికీ లోంచి చూస్తునుగదా, సాయంత్రానికల్లా వాడు ఇంటికి తుర్రు మంటూనే ఉన్నాడు, కులాసాగా పాడుకుంటూనూ! నన్ను గాడిదని చెయ్యాలనా ఏమిటి మీ ఉద్దేశం?' అంటూ ఆగ్రహించాడు. అనుచరులు తమలో లోటు ఏమీలేదని చెప్పచూస్తూ, 'స్వామీ! మోటుపని చాలా హెచ్చుచేసి అతణ్ణి విసిగించెయ్యాలని మేం చాయశక్తులా తంటాలుపడ్డాం. ఏపని యిస్తేంగనక వాడి బలానికి అతీతం అంటూ కనపడలేదు. దాన్ని వాడు సుబ్బరంగా ఓకడికి తీసుగొచ్చేవాడు, ఓ చీపురు వుచ్చుగుని సుబ్బరంగా తుడిచేసినట్టు. వాడు అలిసిపోడం అనేది జరిగేటట్టు కనపడలేదు. తరువాత, నేర్పు అవసరం ఉండే పన్లు అతడి మీద పెట్టి చూశాం, అంత తెలివితేటలు ఇతడి కెక్కడ ఏడిశాయి, అని. కాని, అవీ నిర్వహించేశాడు. అతణ్ణి ఎవడు ఏపనికి నియమించనీండి, ఆపని యావత్తూ చేసేస్తాడు. ఎల్లా చేసేస్తాడోమాత్రం ఎవ్వడూ ఎరగడు. వీడిదగ్గిరో వీడి పెళ్ళాం దగ్గిరో వీళ్ళకి సాయంచేసే మంత్రం ఎదో ఉండుంటుంది. వీడంటే మాకే విసిగెత్తిపోయి, వీడికి స్వాధీనం కాని పని ఏమిటా అని చూస్తున్నాం. ఒక్క రోజులో ఒక గుడి కట్టడం పూర్తి చెయ్యడానికి అతణ్ణి నియమించదల్చాం. అతణ్ణి కబురంపి రాజసౌధంఎదుటఒక్కరోజులో ఒకగుడికట్టవలిసిందిగా ఆజ్ఞ ఇయ్యండి. అతడు అల్లా చెయ్యలేకపోతే, అవిధేయత నేరం మోపి అతడి తల తీసెయించండి'' అన్నారు. ఎమిల్యాన్ని రప్పించి, రాజు "జాగ్రత్తగా విను. ఇది నా ఆజ్ఞ. రేపు

సాయంత్రంలోపల సౌధానికి ఎదటి స్థలంలో ఒక కొత్తగుడి కట్టి సిద్ధం చెయ్యి. అల్లా సిద్ధం చేస్తావా నీకు బహుమతి ఇస్తాను. చెయ్యలేవా, నీ తల తీయించేస్తాను" అన్నాడు. రాజాజ్ఞ విన గానే మొహం తిప్పేసుగుని ఎమిల్యాన్ ఇంటిదారి పట్టాడు. "నాకు చావు దగ్గిరపడింది" అనుకున్నాడు. భార్య దగ్గిరికివెళ్ళి, "ప్రియా ! నడునడు. త్వరగా ఇక్కణ్ణించి పారిపోదాం. లేక పోతే నా తప్పేమీ లేందే, నేను నాశనం కావాలి" అన్నాడు. ఆమె "ఎందుకింత భయం? మనం పారిపోడం దేనికీ ?"అంది. అతడు, భయపడకుండా ఉండడం నా తరమా! రేపు ఒక్క రోజులోనూ సాయింత్రానికి ఓ గుడి నేను కట్టి సిద్ధంచెయ్యాలని రాజు ఆజ్ఞాపించాడు. నేను కట్టలేకపోతే నాతల తీసేస్తారట. అందుకని ఒకటే గత్యంతరం. వ్యవధి ఉండగానే మనం పరారీ అయిపోవాలి" అన్నాడు. కాని, ఆవిడ ఆమాటలు వినిపించు గోక, "రాజుకి బోలెడుమంది భటులున్నారు. మనం ఎక్కడికి వెళ్ళినా మనల్ని పట్టేస్తారు. రాజుని తప్పించుగుని తిరగలేం. ఒంట్లో ప్రాణ ఉన్నంతవరకు మనం రాజుని అనువర్తించాలి" అంది. దానికి అతడు "వియమించినపని నా శక్తిని మించిన రకం అయినప్పుడు రాజుని ఎట్లా అనువర్తించగలను?" అన్నాడు. ఆవిడ "అయ్యో నాథా! ఏమీ నిరుత్సాహం పడద్దు. సుబ్బరంగా భోజనం చేసి చక్కగా నిద్రించి ఉదయాన్ని పెంద రాళే లేస్తే అంతా తయారై పోతుంది" అంది. అల్లాగే ఎమి ల్యాన్ పడుకుని నిద్రపోయాడు. మర్నాడు పెందరాళే ఆవిడ అతణ్ణి లేవగొట్టింది. "త్వరగా వెళ్ళు. గుడిపని . పూర్తి

చెయ్యి. ఇయిగో మేకులు, ఇదుగో సుత్తి. గుడి పూర్తికి ఒక్కరోజు పనిమాత్రం దిగడింది'' అంది. ఎమిల్యాన్ పట్నం వెళ్ళి సౌధం ఎపటి స్థలం చూడగా అక్కడ పెద్దగుడి కట్టిఉంది, కొంచెం తరవాయిగా పూర్తి అయి. ఆ మిగతాపని చెయ్యడానికి ఎమిల్యాన్ ప్రారంభించి, సాయంత్రానికి పని పూర్తిచేశాడు. రాజు తను లేవడంతోటే చూశాడు సౌధంమీది నించి—గుడీ, ఎమిల్యాన్ హడావిడిగా తిరుగుతూ ఇక్కడో కొన్ని మేకులూ అక్కడో కొన్ని కొడుతూండడమూనూ! గుడి పూర్తి అవడం అతనికి సంతోషమా ఏమన్నానా! ఎమిల్యాన్ తల తీయించేసి అతడి భార్యని పుచ్చేసుగోడానికి వీలులేకుండా పోయెనే అని అతడు చాలా బాధపడ్డాడు. అనుచర్లని మళ్ళీ పిల్చి, 'ఏమర్రోయ్! ఎమిల్యాన్ ఈ పనికుడా పూర్తిచేశాడు. వాడి తల తీసెయ్యడానికి నెపం ఏమీ కనిపించదు. ఇంత పెద్దపనీకుడా అతడికి కష్టం అనిపించినట్టులేదు. మీరు ఇంత కంటె ఎక్కువ యుక్తితో పన్నాలి, లేకపోతే మీ తలకాయలు కుడా తీయించేస్తాను, వాడి తలకాయతోపాటు.' అని బెదిరించాడు. అనుచర్లంతా చేరి, మరోపన్నాగం పన్ని, ఓడలు విహరిస్తూండే ఒక నది సౌధంచుట్టూ కల్పించాలని ఎమిల్యాన్‌కి ఆజ్ఞ ఇయ్యాలనిరాజును కోరారు. రాజు ఎమిల్యాన్‌ని పిల్చి ఈ కొత్త పని అతనికి పురమాయిస్తూ, 'ఒక్కరాత్రిలోనే గుడి కట్టగలిగిన వాడవు, ఈపనీ చెయ్యగలవు. రేపటికి అంతాపూర్తికావాలి. కాని పక్షంలో, నీతల తీసెయ్యమంటాను' అన్నాడు. ఎమిల్యాన్ కిందటిమాటుకంటె నిరుత్సాహపడి గుండెల్లో రాయిపడి పెళ్ళాం

దగ్గిరికి వెళ్ళాడు. అప్పుడు భార్య, 'ఎంతో దుఃఖంలో ఉన్నావే: ఇంకోపని చెయ్యాలని ఆజ్ఞాపించాడా, రాజు?' అని అడిగింది. ఎమిల్యాన్ తన భార్యతో సంగతంతా చెప్పి 'మనం ఇప్పుడేనా పరారీ అయితీరాలి' అన్నాడు. కాని ఆవిడ, 'భటుల్ని తప్పించు గోవడం అనేది ఉండదు. మనం ఎక్కడికట వెళ్ళనీండి, వాళ్ళు మన్ని పట్టేస్తారు. రాజుకోరిన ప్రకారం చేసెయ్యడంతప్ప మరోటిలేదు.' అంది. 'సరే. నే నెల్లా చెయ్యగల్నూ?' అంటూ ఎమిల్యాన్ మూలిగాడు. 'అయ్యొయ్యో, ముసిలాయనా, నిరుత్సాహపడకు, లేచి భోజనంచెయ్, నిద్రపో, పెందరాళే లే, అంతా సకాలంలో జరిగిపోతుంది' అని ఆమె హెచ్చరించింది, అల్లాగే ఎమిల్యాన్ పడుకుని నిద్రపోయాడు. మర్నాడు పొద్దున్నే ఆవిడ అతణ్ణి లేపింది. 'సౌధంకేసి వెళ్ళు. అంతా సిద్ధంగాఉంది. సౌధంఎదటి రాతిగట్టుమీద ఒక గొప్పు మిగిలిపోయింది. పార పట్టిగెళ్ళి అది మట్టంచేసెయ్' అని ఆవిడ అతడితో చెప్పింది. రాజు లేవగానే, సౌధంచుట్టూ పూర్వం నేలగా ఉండిన చోట ఒక నది ప్రత్యక్షమైంది, అందులో ఇటు అటూ విహరిస్తూ ఓడలుకుడా ఉన్నాయి. ఎమిల్యాన్ ఓ పార పుచ్చుగుని ఓ గొప్పు మట్టం చేస్తున్నాడు. రాజుకి పరమాశ్చర్యం అయింది. కాని, నదికేసి చూసినా అతనికి సంతోషంలేదు, ఓడలకేసి చూసినా లేదు. అతడు ఎమిల్యాన్ తల తీయించడం శక్యం కాకపోయింది గదా అని గిజగిజలాడిపోయాడు. 'వీడు నిర్వహించలేని పని అంటూ కనపడదు. ఇప్పుడు ఏమిటి కర్తవ్యం?' అనుకుని, అనుచర్లని పిలిచి వాళ్ళ సలహా అడిగాడు. 'ఎమిల్యాన్ చుట్టి

బెట్టడానికి వీల్లేని పని ఆలోచించండి. ఏమంటే: వాడు మనం ఏంకోరితే అదల్లా పూర్తిచేస్తున్నాడు, వాడి భార్యని నేను లాక్కోడానికి వీల్లేకుండా ఉంది' అని వాళ్ళతో చెప్పాడు.

రాజానుచరులు యోచించి యోచించి, చిట్టచివరకి ఓ పథకం ఊహించి, రాజుని సమీపించి, "ప్రభూ! ఎమిల్యాన్‌కి కబురంపి ఇట్లా ఆజ్ఞాపించండి; ఎక్కడో తెలియని చోటికి వెళ్ళి, ఏమిటో తెలియని వస్తువు తీసుగురా—అని. అప్పుడు వాడు మిమ్మల్ని తప్పించుగోలేడు. వా డెక్కడికి వెళ్ళినా సరే, అది కాదు సరయైన చోటు అని మీరు డబాయించవచ్చు. అల్లాగే వాడేమట తీసుగురానీయండి, అదికాదు సరియైన వస్తువు—అనేసెయ్యవచ్చు. ఆపైని మీరతని తల తీసెయించవచ్చు, అతని భార్యని పుచ్చుగోవచ్చు" అని చెప్పారు. రాజు సంతోషించి, ఈ మాటు చాలాబాగా ఆలోచించారు" అని, ఎమిల్యాన్‌ని రప్పించి అతనితో, "ఎక్కడో తెలియని ఆక్కడికి వెళ్ళి, అక్కణ్ణించి ఏమిటో తెలియని అది తీసుగురా! తీసుగురావా, నీ తల తీయించేస్తాము" అన్నాడు. ఎమిల్యాన్ ఇంటికి వెళ్ళి రాజుగారి ఆజ్ఞ భార్యతో చెప్పాడు. ఆమె ఆలోచనలో పడింది. ఆమె, "ఓహో! నిన్నెల్లా పట్టుగోవచ్చో రాజుకి బోధించారు వాళ్ళు. ఇప్పుడు మనం మెళకువతో వ్యవహరించాలి" అని, కూచుని దీర్ఘంగా ఆలోచించి "నువ్వు చాలా దూరం వెళ్ళాలి మన తాతమ్మ దగ్గిరికి—ముసిలి రైతుస్త్రీ, యోధులందరికీ తల్లి—ఆవిడ దగ్గిరికి. వెళ్ళి ఆవిడ సాయంకోరాలి. ఆవిడ సాయం వల్ల నీకు ఏవస్తువేనా లభిస్తే, అది పుచ్చుగుని నువ్వు తిన్నగా

సౌధానికి నడు. నేనక్కడ ఉంటాను. ఏమంటే, నేను వాళ్ళని తప్పించుకోలేను. వాళ్లు బలిమిని తీసుకుపోతారు నన్ను. కాని, ఆ స్థితి చిరకాలం ఉండదు. ప్రతీదీ తాతమ్మ చెప్పిన ప్రకారం చేశావా, నన్ను త్వరలో విడిపించావన్నమాట.'' అంది. తరవాత, భర్త ప్రయాణానికి భార్య యావత్తూ సిద్ధంచేసింది. అతడికి ఓ సంచీ ఓ కదురూ ఇచ్చి ''ఇది ఆవిడకియ్యి. నువ్వు నా భర్తవని ఆవిడ గ్రహించడానికి ఇదీ చిహ్నం'' అని అతనితో చెప్పి, అతడు వెళ్ళవలిసిన దారి చూపించింది.

ఎమిల్యాన్ బయల్దేరి, పట్నం దాటి, యుద్ధ భటులకి కవాతు చెప్పేచోటికి వెళ్ళాడు. అతడు నిలబడి అదంతా గమనించాడు. కవాతు పూర్తికాగానే భటులు విశ్రమించారు. అతడు వాళ్ళని అడిగాడు: ''సోదరులారా! మీకు తెలుసా, ఎక్కడో తెలియని చోటికి దారిన్నీ, ఏమిటో తెలియని వస్తువు నాకు లభించగల మార్గమున్నూ?'' అని. భటులు ఈ ప్రశ్నలు ఆశ్చర్యంతో విన్నారు. ''ఎవరయ్యా మిమ్మల్ని ఈపనిమీద పంపినవారూ?'' అని అడిగారు వాళ్ళు, 'రాజు' అన్నాడతడు. ''మేం కూడా యుద్ధభటులం అయినప్పట్నించీ ఎక్కడో తెలియని చోటికి వెదుతూనే ఉన్నాం గాని అక్కడికి చేరుకోనేలేదు. ఏమిటో తెలియని వస్తువు వెతుకుతూనే ఉన్నాంగాని ఆవస్తువుని కనుక్కోనేలేదు. నీకు మేం సాయం చెయ్యలేం'' అని వాళ్ళన్నారు. ఎమిల్యాన్ వాళ్ళదగ్గిర కాస్సేపు కూచుని ప్రయాణం సాగించాడు. ఈడ్చుగుంటూ చాలా మైళ్ళు నడిచి ఒక అడివికి వచ్చాడు. అందులో ఒక గుడిసెలో ఎంతో ముసిలిస్త్రీ, రైతుయోధులతల్లి, నార ధారం తీస్తూ ఏడుస్తూ ఉంది. వడికేటప్పుడు చెయ్యి తడిచేసుగోవలిసిన

అవసరం కలిగితే ఆమె తన ఎంగిలితో తడి చేసుగోడంలేదు, తన కన్నీళ్ళతో తడిచేసుగుంటోంది. ముసలమ్మ ఎమిల్యాన్‌ని చూడగానే "ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని కేకేసింది. అప్పుడు ఎమిల్యాన్ ఒక కడురు ఆమె కిచ్చి తన భార్య పంపించిందని చెప్పాడు. ముసలమ్మ తక్షణం మార్దవం దాల్చి ప్రశ్నలు మొదలెట్టింది, ఎమిల్యాన్ తన చరిత్రయావత్తూ: ఒక కన్యని పెళ్ళాడడం, వాళ్ళు పట్నంలో కాపరం ఉండవెళ్ళడం, తను పనిచెయ్యడం, సౌధంలో బండపన్లూ నేర్పుపన్లూ చెయ్యడం, గుడికట్టడం, ఓడల్తో సహా నది తయారు చెయ్యడం, ఇప్పుడు రాజుగారు తనని ఎక్కడో తెలియని చోటికి వెళ్ళి ఏమిటో తెలియని వస్తువు తేవాలని ఆజ్ఞాపించడం—చెప్పాడు. ఇదంతా చివరదాకా ఆలకించి, తాతమ్మ ఏడుపు మానేసింది. "కాలం నిశ్చయంగా ఆసన్నమైంది" అనుకుని ఆమె అతనితో "సరే అబ్బాయి. బాగానే ఉంది. వచ్చికూచో. తినడానికి ఏమన్నా తెస్తాను" అంది. ఎమిల్యాన్ భోజనం చేసిం తరవాత, అతని కర్తవ్యం తాతమ్మ చెప్పింది. "ఇదుగో ఒక దారపు ఉండ. దీన్ని దొర్లించి అది వెళ్ళిన చోటికి వెనకాలే వెళ్ళు. నువ్వు చాలా లెక్క వెళ్ళవలిసుంటుంది, ఒక సముద్రం తగిలేవరకూ. అక్కడ నీకు ఒక మహానగరం కనపడుతుంది. అందులో ప్రవేశించి బస్తీకి అవతలకొస ఇంట్లో రాత్రి బస అడుగు, అక్కడ నువ్వు వెతిగే వస్తువుకోసం చూడు,' అని చెప్పింది. 'నే నేమి వెతుకు తున్నానో నా కెల్లా తెలుస్తుందీ?' అని అతడు అడిగాడు. 'తండ్రిమాట కంటె తల్లిమాట కంటె ఎక్కువగా జనం దేనిని అనువర్తిస్తారో దానిని చూసినప్పుడు తెలుస్తుంది. దాన్ని దొరకపుచ్చుగుని రాజు దగ్గిరికి పట్టిగెళ్ళు.

అప్పుడు రాజు అది సరియైన వస్తువు కాదంటాడు. దానికి సమాధానంగా నువ్వు ఏం చెప్పాలో తెలుసా? ఇది సరియైంది కాకపోతే, దీన్ని ముక్క ముక్కలు చేసెయ్యాలి, అని చెప్పాలి. చెప్పి దాన్ని బాత్తూ నదిదగ్గిరికి తీసిగెళ్ళాలి, అక్కడ దాన్ని ముక్క ముక్కలుచేసి నదిలో గిరవటెయ్యాలి. అప్పటితో నీ భార్య మళ్ళీ నీ కవుతుంది, నా కన్నీళ్ళు ఆరతాయి' అని తాతమ్మ చెప్పింది.

ఎమిల్యాన్ తాతమ్మ దగ్గిర సెలవు పుచ్చుగుని, దారపుఉండ దొర్లించడం మొదలెట్టాడు. అది దొర్లి దొర్లి చివరికి సముద్రాన్ని చేరుకుంది. సముద్రంపక్క పెద్ద బస్తీ ఉంది, దాని అవతల చివర పెద్ద ఇల్లుంది. అక్కడ రాత్రి బసకోసం ఎమిల్యాన్ ప్రార్థించగా, అనుగ్రహించారు. రాత్రి అక్కడ పడుకుని అతడు ఉదయాన్ని లేస్తూనే ఒక సంభాషణ విన్నాడు. ఒకాయన కొడుకుతో, 'అబ్బాయి, లే! లేచివెళ్ళి పుడకలు కొట్టుగురా, పొయిలోకి, అంటున్నాడు. కాని, కొడుకు ఆ మాటలువిని తత్ప్రకారం చెయ్యక, 'ఇంత మరీ పెంద్రాళే ఎందుకయ్యా! బోలెడు టైం ఉంటూంటేనూ!' అనేసి పడుకునే ఉన్నాడు. అప్పుడు తల్లి వచ్చి. 'వెళ్లు. నాయనా, మరీ! మీ నాన్నకి ఎముకలు నెప్పెట్టవూ పుడకలుకొడితే? ఆయన్నే వెళ్ళ మంటావా?' అంది. కొడుకు ఏవో కొన్ని మాటలు గొణుక్కుని మళ్ళీ నిద్రలో పడ్డాడు. అతడికి గాఢాంగా నిద్ర పట్టిందో లేదో, వీధులో ఏదో దబడబలాడుతూ గర్జించింది. ఆ మట్టున ఎగిరిపడి అతడు పక్కమీంచిలేచి, చిటిగెలో దుస్తులు వేసేసుగుని, వీధులోకి ఎగబడ్డాడు. ఎమిల్యాన్‌కూడా ఎగిరి పడుతూ, వాడివెనకాలే పరుగు లంకించు కున్నాడు—తండ్రి మాటకంటె తల్లిమాట

కంటె ఎక్కువగా కొడుకు అనువర్తించేది ఏమిటో చూడ్డామని! అతనికి కనపడింది ఏమిటంటే: ఒక మనిషి నడుచుగుంటూ, తన పొట్టకి బిగించి ఉన్న ఒక డోలులాంటి దాన్ని పుడకలు పుచ్చుగుని ఎడా పెడా బజాయిస్తూండడం. అదీ అంతగా డబడబలాడుతూ గర్జించేదిన్నీ, కొడుకు శిరసావహించిన దిన్నీ! అది గుండ్రంగా తొట్టెలాగా రెండు చివళ్ళా చర్మం బిగించి ఉంది. అతడు దాని పేరు కనుకున్నాడు. 'ఢంకా' అని చెప్పారు. 'అది ఖాళీయేనా?' అని అతడు అడిగాడు. 'ఆ, ఖాళీయే' అన్నారు. ఎమిల్యాన్ ఆశ్చర్యపడ్డాడు. అది నాకిచ్చెయ్యండి అని వాళ్ళని అతడు కోరాడు. వాళ్ళివ్వం అన్నారు. మరి అడగడం మానేసి ఎమిల్యాన్ ఆ వాద్యగాడి వెంట పడ్డాడు. రోజంతా వెంబడించగా, వాద్యగాడు ఆగి రాత్రి పడగానే పడుకుని నిద్రపోయాడు. వాడు నిద్దట్లో ఉండగా ఆ ఢంకా వాడిదగ్గిర్నించి ఊడలాక్కుని, ఎమిల్యాన్, అది పుచ్చుగుని చపాయించేశాడు. పరిగెత్తి పరిగెత్తి ఎల్లాగైతేం చివరకి తన పట్నంలోకి వచ్చి పడ్డాడు. ఇంటికి వెళ్ళిచూస్తే, పెళ్ళాంలేదు. అతడు వెళ్ళిన మర్నాడే రాజుగారు తీసి గెళ్ళినట్టు తెలిసింది. అందుచేత అతడు రాజ సౌధానికి వెళ్ళి రాజుకి కబురు చేశాడు, 'ఎక్కడో తెలియని చోటుకి వెళ్ళినవాడు ఏమిటో తెలియని వస్తువు పట్టుగు వచ్చాడు' అని. అతణ్ణి మర్నాడు రమ్మన్నాడు రాజు. 'రాజు కోరింది పట్టుగుని ఈ వేళే ఇక్కడికి వచ్చాననిన్నీ రాజేవతలకొచ్చి నన్ను చూడకపోతే నేను లోపలికొచ్చి రాజుని చూస్తాననిన్నీ చెప్పండి' అని అతడు మళ్ళీ కబురంపాడు. రాజు బయటికివచ్చి, 'నువ్వు ఎక్కడికి వెళ్ళావ్?' అని అడిగాడు. ఎమిల్యాన్ చెప్పాడు. 'అది సరియైన చోటుకాదు. సరే,

ఏం తెచ్చావ్ ?' అన్నాడు రాజు. ఎమిల్యాన్ ఢంకాకేసి చూపించాడు, గాని రాజు చూశాడుకాదు. 'సరియైన వస్తువు అది కాదు' అన్నాడు. 'ఇది సరియైంది కాకపోతే. దీన్ని ముక్కముక్కలుగా కొట్టాలి, వాట్ని ఏ సైతాను పట్టిగెళ్ళినా సరే' అని ఎమిల్యాన్ అన్నాడు. తరవాత ఎమిల్యాన్ సౌధంలోంచి ఢంకా మోగిస్తూ వచ్చేశాడు. ఆ ధ్వనికి రాజుగారిసేన యావత్తూ పోగై ఎమిల్యాన్ వెనకాలే పరిగెత్తడం, అధికార పూర్వకంగా అతనికే వందనం చెయ్యడం, అతని ఆజ్ఞకోసం వేచి ఉండడం జరిగింది. ఎమిల్యాన్ వెనకాలే వెళ్ళకండర్రా అని కిటికీలోంచి కేకలు పెడుతూ రాజు యత్నించాడు. కాని, ఏ ఒకడూ రాజు మాట వినిపించుగోలేదు. అంతా ఎమిల్యాన్ వెనకాల పడ్డారు. ఆ సంగతి రాజు గమనించి, ఉత్తరువులు జారీచేశాడు: 'ఎమిల్యాన్ భార్యని ఎమిల్యాన్‌కివాపసు, ఇచ్చెయ్యండి. ఢంకా నా కిచ్చెయ్యాలని అడగండి'—అని. కాని. ఎమిల్యాన్, 'అటా ఢంకా ఇచ్చెయ్యడానికి వీలులేదు. దీన్ని ముక్కలకిందకొట్టి నదిలో పారెయ్యాలి, అని నాతో చెప్పారు', అన్నాడు. అని, ఎమిల్యాన్ ఢంకా బజాయిస్తూ నదిదాకా వెళ్ళగా యోధులు వెనకాల వస్తూనే ఉన్నారు. నదీతీరం చేరగానే ఎమిల్యాన్ ఢంకాని ముక్కలకింద బద్దలుగొట్టి, ఆ ముక్కలన్నీ ప్రవాహంలోకి విసిరేశాడు. ఆ తరవాత యోధులంతా పారిపోయారు.

ఎమిల్యాన్ తన భార్యని తీసుగుని ఇంటికి వెళ్ళి పోయాడు. అది లగాయతు రాజువల్ల బాధ అనేది ఏదీ లేకుండా, వాళ్ళిద్దరూ సుఖంగా జీవించారు.

---

# సూరత్‌లో కాఫీఆలయం

(జెర్నార్డిన్ డి సెయింట్ పయేరి అనుసరణం)

ఇండియాలో సూరత్ నగరంలో ఒక కాఫీ ఆలయం ఉంది. పాన్లోచేరి చాలామంది ప్రయాణీకులూ భూమిమీది అనేక స్థలాల నించి వచ్చిన విదేశీయులూ సంభాషిస్తూ ఉంటారు.

ఒకనాడు ఆ కాఫీఆలయానికి పండితుడైన ఒక పారశీక దివ్యవేత్త వచ్చాడు. అతడు దేవుని స్వభావం గ్రహించడానికి పాటుపడుతూ ఆ విషయం గురించి గ్రంథాలు చదువుతూ రాస్తూ, తన జీవితం ధారపోశాడు. దేవుణ్ణి గురించి ఎంత ఆలోచించి ఎంత చదివి, ఎంత రాశాడనుకున్నారు—చివరకి తనకి ఉన్న మతి కుడా పోగొట్టుగుని, పూర్తిగా గందరగోళంలో పడిపోయి దేవుడు ఉన్నాడనే విషయం నమ్మడం కుడా మానుకున్నాడు. ఆ సంగతి రాజు విని, అతణ్ణి దేశంలోంచి పొమ్మన్నాడు. అతడు తన జీవితం అంతా వాదించిన విషయం 'ప్రథమకారణం' అనేది. వాదించి వాదించి, పాపం, ఆ దివ్యవేత్త చివరకి వచ్చే సరికి అగమ్యగోచర స్థితి మనస్సుకి తెచ్చుగుని, తన విచక్షణ నశించిందని గ్రహించుగోక, లోకాన్ని నడిపించడానికి దివ్య విచక్షణ ఉండదు పొమ్మన్నాడు. ఇతడికి ఒక ఆఫ్రికా బానిస ఎక్కడికి వెళ్ళినా వెనకాలే ఉండేవాడు. దివ్యవేత్త కాఫీ ఆలయం లోకి వెళ్ళినప్పుడు బానిస అవతలే ద్వారం దగ్గిర ఎండపొడని ఒకరాతిమీద కూచుని జుంయ్యిమని తన చుట్టూ మూగుతూన్న ఈగల్ని తోలుకుంటున్నాడు. పారసీకుడు లోపల ఒక సోఫాలో

పర్షకుని తనకి ఓ కప్పు నల్లమందు ద్రావకం తెమ్మన్నాడు. ఆ ద్రావకం పుచ్చుగుని నల్లమందు గుణంవల్ల మెదడు జోరుగా పనిచెయ్యడం మొదలెట్టగానే, తలుపులు తెరిచున్న ద్వారం లోంచి బానిసని సంబోధిస్తూ, "ఒరేయ్, దిక్కుమాలి బానిసా! దేవుడున్నాడనుకుంటావా, లేడనుకుంటావా?" అని అడిగాడు. 'ఉన్నాడు. సహజంగా' అంటూ తక్షణం ఆ బానిస తన పట్కా అడుగునించి ఒక చిన్న కర్రవిగ్రహం తీస్తూ, "ఇదుగో దేవుడు. నా పుట్టుకనించీ నన్ను సంరక్షిస్తున్నాడు. మా దేశంలో అంతా యక్షిణీచెట్టుని ఆరాధిస్తారు, ఆ కర్రతో ఈ దేవుణ్ణి చేశారు" అన్నాడు. దివ్యవేత్తకీ అతని బానిసకీ జరిగిన పై సంభాషణ కాఫీ ఆలయానికి వచ్చిన ఇతర ఆగంతుకులు జాగ్రత్తగా విన్నారు. యజమాని వేసిన ప్రశ్నకే వాళ్ళు ఆశ్చర్యపడి పోయారు, మరి ఆబానిస వాడిచ్చిన సమాధనంతో మరీ ఇదై పోయారు.

వాళ్ళల్లో ఒకడైన ఒక బ్రాహ్మడు ఆ బానిసవాడి మాటలు విని ఇట్లా అన్నాడు: 'ఓరి దుష్టమూర్ఖుడా! దేవుడు పట్కా కింద ఇమడడం ఏమిట్రా? అట్లా నువ్వు నమ్ముతున్నావని నమ్మలేకుండా ఉన్నాను. ఒకడే దేవుడు——బ్రహ్మ. ఈ ప్రపంచానికి పైవాడు, దీన్ని సృష్టించాడు గనక. బ్రహ్మ ఏకైక దేవుడు, బలసంపన్నుడు. ఆయన్ని పూజించడానికోసమే గంగా తీరాన్ని ఆలయాలు కట్టించీ, యధార్థ అర్చకులైన బ్రాహ్మలు ఆయన్ని ఆరాధించేదీనూ. దేవుడంటే వాళ్ళకే తెలుసు, వాళ్ళకి తప్ప మరోళ్ళకి తెలియదు. యుగాలు గడిచాయి, విప్లవం

తరవాత విప్లవం వచ్చిపోయింది. అయినాసరే ఆ అర్చకుల అధి
కారం యథారీతిగా సాగుతోంది. ఎందుచేత ? యధార్థ దేవుడైన
ఆ బ్రహ్మ వాళ్ళని సంరక్షిస్తున్నాడు.' ఇట్లా ఆ బ్రాహ్మడు
మాట్లాడి ప్రతీ శ్రోతనీ తనపక్షం చేసేసుగున్నా ననుకున్నాడు.
కాని, యూదుడైన ఒక మధ్యబేరగాడు అక్కడుండి ఆ బ్రాహ్మ
డికి సమాధానంగా ఇట్లా చెప్పాడు: 'కాదు. యధార్థ దేవుడి
ఆలయం ఇండియాలోనూ లేదు, దేవుడు బ్రాహ్మణజాతిని
సంరక్షించనూ సంరక్షించడు. బ్రాహ్మల దేవుడు యధార్థ దేవుడు
కాడు. అబ్రహాం, ఇసాకు యాకోబుల దేవుడే నిజమైన దేవుడు.
తను వరించిన ప్రజలైన ఇస్రయేల్ దేశీయులని తప్ప కడం
వాళ్ళ నెవళ్ళనీ దేవుడు రక్షించడు. సృష్ట్యాదిలగాయతు మాజాతి
మీద దేవుడికి మమకారం. పైగా మా జాతిమీదే అంత మమ
కారం. వర్తమానంలో మా జాతి భూమి అంతటా చెదిరిపడి
ఉందీ అంటే, అది మాజాతిని పరీక్షించడానికి వచ్చింది. కాని,
ఆయన తను వరించిన మాజాతిని యెరూషలేంలో ఎప్పుడో
ఏకంచేస్తానని వాగ్దానం చేశాడు. పురాతన మహాద్భుతాల్లో ఒక
టైన యెరూషలేం దేవాలయం తన పూర్వవైభవం తిరిగి ఆర్జిం
చుకోగానే, జాతు లన్నింటిమీదా ఇస్రయేల్ జాతియొక్క ఆధి
పత్యం స్థాపనవుతుంది.' ఆ యూదుడు ఇట్లా ఉపన్యసించి, గొల్లున
రాగా లెట్టాడు. పాపం, అత డింకా కొంత చెప్పదల్చుకున్నాడు
గాని, అంతలో ఒక ఇటలీదేశపు మతప్రచారకుడు అక్కడుండి
అతడికి అడ్డువచ్చాడు. అతడు ఆ యూదుణ్ణి ఉద్దేశిస్తూ, 'నువ్వు
చెబుతూన్నది అబద్ధం. నువ్వు దేవుడికిఅన్యాయంఆరోపిస్తువున్నా.

కడంవాటిని మానేసి మీజాతిని ఒక్కదాన్నీ మాత్రం ఆయన అభిమానించలేదు. అసలు అల్లా అనడంకంటె ముందే ఏమనచ్చునంటే: ఒకవేళ దేవుడు ఇస్రయేల్ దేశీయుల్ని పూర్వం అభిమానించాడు అనేమాట యథార్థమైనా, పందొమ్మిది వందల యేళ్ళ క్రితమే వాళ్ళు దేవుడికి కోపం తెప్పించగా ఆయన ఆజాతిని నాశనంచేసి భూమిమీద వెదజల్లి పారేసేసరికి, అది మతాంతరుల్ని తనలోకి లాక్కోలేకపోయి ఇక్కడ ఒకనలుసూ అక్కడ ఒకనలుసూ మిగిలినా గతించింది అనే చెప్పాలి. దేవుడు ఏ ఒకజాతిమీదా అధికతరాభిమానం కనపరచడు. రక్షణకోరే వాళ్ళంతా రోమీయమైన సర్వజనమతసంస్థ ఒళ్ళోకి రండి అని దేవుడు పిలుస్తాడు. ఆ సంస్థయొక్క ఆవరణకి బయట సంరక్షణ దొరకదు'. ఇట్లా ఇటలీయుడు అంటూండగానే, ఒక లూథర్ మతాధికారి అక్కడ ఉండడం తటస్థించింది. అతడు నిర్ఘాంతపోయి సర్వజన మతప్రచారకుడికేసి తిరిగి, బాధతో. 'సంరక్షణ నీమతంలో ఉంటుందని నువ్వెట్లా చెప్పగలవు? సువార్తలో ఉన్నరీతిగా ఆత్మపూర్వకంగా సత్యపూర్వకంగా క్రీస్తుమాటలలో ఉండే ఆజ్ఞలప్రకారం దేవుణ్ణి సేవించేవాళ్ళు మాత్రమే రక్షింపబడతారు,' అన్నాడు. అప్పుడు ఒక తురక, సూరత్ రేవు ఓడ సరుకుల దిగుమతిపన్ను కచేరీలో ఉద్యోగి, కొంకిగొట్టంలోంచి పొగపీలుస్తూ కాఫీ ఆలయంలో కూర్చున్నవాడు, పైయిద్దరి క్రైస్తవులమీదా తనకి ఆధిక్యం ఉన్నట్టు కనపడే వైఖరితో, 'మీ రోమీయ మతాన్ని మీరు నమ్మకోడం వ్యర్థం. దాన్ని గీటుకొట్టేసి పన్నెండువందల ఏళ్ళైంది అసలు మతం వచ్చి!

ఏదీ అంటే, మహమ్మదు మతం. మీకు తెలియకుండా ఉండ డానికి వీల్లేదే, యథార్థమైన మహమ్మదీయ మతం ఆసియా ఐరోపాలలోనే కాకుండా జ్ఞానవంతమైన చైనాలోకూడా విజృం భించిపోతూన్న సంగతి! దేవుడు యూదుల్ని విసర్జించాడని మీరే అంటిరిగదా! అందుకు నిదర్శనంగా, యూదులు నశ్రమ పరచబడడమూ వాళ్ళ మతము వ్యాప్తిచెందకపోవడమూ, మీరు జ్ఞాపకం చేస్తిరిగదా! అటువంటప్పుడు ఒప్పేసుగోండి మహమ్మ దీయంయొక్క యాథార్థ్యం. ఎందుకంటే! విజయవంతంగా అది దశదిశలా వ్యాపిస్తోంది. మహమ్మదీయ మతం అవలం బించిన వాళ్ళకి తప్ప మరెవళ్ళకీ రక్షణలేదు. మహమ్మదే దేవుని కడసారి ప్రవక్తగనక. అందులోనూ మక్లీ ఓమార్ అనుయాయులకే ఆరక్షణ! అలీ అనుయాయులకి కాదు—వీళ్లు మతద్రోహులు కాబట్టి!' అని వాదించాడు.

పైవాదానికి ఆలీ తెగకి చెందినవాడైన ఆ పారసీక దివ్యవేత్త ప్రతివాదం చేద్దాం అనుకున్నాడు. కాని, ఈపాటి కప్పుడే పరస్పర అపరిచితులైన ఆ భిన్నభిన్నమత మతాంతరాల వాళ్ళలో ఒక దెబ్బలాట రేగింది. వాళ్ళల్లో అబిస్సీనియా క్రైస్తవులు, టిబెట్‌నించి లామాలు, ఇస్మాయిల్ వాసులు, అగ్నిపూజాపరులు ఉన్నారు. దేవుడి యొక్క ప్రకృతిగురించీ, దేవపూజావిధానం గురించీ తర్కించారు. తన దేశంలోమాత్రమే యధార్థదేవుణ్ణి సరిగా గ్రహించి అర్థంగా పూజిస్తారని ఎవడి మట్టుకివాడు నొక్కివక్కాణించాడు. ఆ దెబ్బలాటలో కలగ చేసుగోకుండా కాఫీఆలయంలో ఒకమూల కూర్చున్న ఒక చైనీ

యుడైన కన్‌ఫ్యూషన్ శిష్యుడు తప్ప తక్కిన ప్రతివాడూ యథాశక్తి వాదించి గోలచేశాడు. అతడు మాత్రం టీ పీలుస్తూ ఇతరులన్నది వింటూ తను మౌనంగా ఉంటూ అక్కడ కూర్చు న్నాడు. అతడక్కడ కూర్చుని ఉండడం తురక గమనించి, నువ్వు తీర్పు అన్నట్టు అతనితో, ''సజ్జన చైనీయుడా! నే చెప్పేది నువ్వు స్థిరపరచ గలవ్. కాని, మౌనవ్రతం పట్టావు. నువ్వు మాట్లాడడమే జరిగితే నన్నే వెనకేసుగొస్తావని నాకు తెలుసు. మీ దేశవర్తకులు ఎవరేనా నా సాయంకోసం నాదగ్గిరికి వచ్చినప్పుడు చెబుతూంటారు: చైనాలోకి అనేక మతాలు ప్రవేశ పెట్టబడినా మహమ్మదీయమతమే ఉత్తమం అని యెంచి మీ చైనీయులు దాన్నే యిష్టపడి స్వీకరిస్తూంటారు—అని. కాబట్టి, నువ్వు నామాటలు సిద్ధాంతీకరించి, యధార్థదేవుణ్ణి గురించీ ఆయన ప్రవక్తని గురించీ నీ అభిప్రాయం ఏమిటో చెప్పు'' అని కోరాడు. తక్కిన వాళ్ళంతా కుడా చైనీయుడి కేసి తిరిగి, ''అవునవును. ఈ విషయంలో నువ్వు ఎల్లా ఆలోచిస్తావో విని పించు'' అన్నారు. అప్పుడు కన్‌ఫ్యూషన్ శిష్యుడైన ఆ చైనీ యుడు కళ్ళు మూసుగుని కాస్సేపు యోచించాడు. అతడు కళ్ళు తెరిచి, చొక్కా చేతుల చివరి మడతల్లో మునిగిపోయిన తన చేతులు పైకి తీసుగుని, గుండెలమీద వాటిని అని, ప్రశాంతంగా నెమ్మదిగా ఈక్రిందిరీతిగా మాట్లాడాడు: ''అయ్యలారా! మత విషయములలో పరస్పరమైత్రికి ప్రతిబంధకం గర్వమే అని నాకు తోస్తోంది. మీరు ఆలకించగలిగితే, ఒక కథ చెబుతాను. అది సోదాహరణంగా ఆసంగతి విశదపరుస్తుంది. ప్రపంచాన్ని

చుట్టివచ్చిన ఒక ఇంగ్లీషుస్టీమరులో చైనానించి ఇక్కడికి వచ్చాను నేను. సుమిత్రాద్వీపం తూర్పుతీరాన్ని నుంచినీళ్ళ నిమిత్తం ఆగి దిగాం. అది మిట్టమధ్యాహ్నం. దిగినవాళ్ళం కొబ్బరిచెట్ల నీడని గట్టుమీద కూచున్నాం. ద్వీపవాసులగ్రామం ఒకటి దగ్గరలోనే ఉంది. కూర్చున్న జట్టులో వివిధజాతుల వాళ్ళున్నారు. మేం అక్కడ కూర్చుండగా ఒక అంధుడు వచ్చాడు. సూర్యుడంటే ఏమిటో కనిపెట్టి సూర్యకాంతిని దొరకపుచ్చుకోవాలనే యత్నంలో సూర్యుడికేసి మరీ దీర్ఘంగా మరీ అదేపనిగా చూస్తూండడంవల్ల అతనికి అంధత్వం సంక్రమించిందని మాకు తరవాత తెలిసింది. అతడు తను తలపెట్టింది నిర్వహించడానికి చిరకాలం తంటాలుపడి నిరంతరంగా తన దృష్టి సూర్యుడికేసి సారించాడు. కాని, కలిగిన ఫలితం ఒకటే. ఏమిటంటే, సూర్యతేజంవల్ల తన కళ్ళకే మొప్పంరాగా, అంధుడయ్యాడు. అప్పుడు తనలో అతడనుకున్నాడు: 'సూర్యకాంతి ద్రవంకాదు. ఏమంటే: ద్రవం అయుంటే, ఒక పాత్రలోంచి మరొక పాత్రలోకి దాన్ని పొయ్యడం సంభవం అయుండేది, పైగా గాలి వల్ల నీరు చలించినట్టే గాలివల్ల అదీ చలించడం జరిగుండేది. సూర్యకాంతి అగ్నిగుడా కాదు. ఏమంటే: అగ్ని అయుండే, నీరు దాన్ని ఆర్పేసి ఉండేది. సూర్యకాంతి ఓ భూతమూ కాదు. ఏమంటే: అది కంటపడుతుంది. సూర్యకాంతి పదార్థమూ కాదు. ఏమంటే: దాన్ని జరిపి మరోచోట పెట్టలేం. కాబట్టి సూర్యకాంతి ద్రవమూ కాకపోయి, అగ్నీ కాకపోయి, భూతమూ కాకపోయి, పదార్థమూ కాకపోయినప్పుడు

'అది హాస్యం అన్నమాట' అలా తర్కిస్తూ, అస్తమానమూ సూర్యుణ్ణి ఆలోకించడంవల్ల దృష్టిన్నీ అస్తమానమూ సూర్యుడి గురించి ఆలోచించడంవల్ల బుద్ధిన్నీ అతనికి పోయాయి. అంధత్వం పరిపూర్ణంకాగానే, సూర్యుడు లేనేలేడని అతనికి పూర్తిగా నచ్చిపోయింది. ఆ అంధుడితోకుడా ఒక బానిస వచ్చాడు. వాడు తన యజమానిని ఓ కొబ్బరిచెట్టు నీడని కూర్చో పెట్టిన తరవాత, నేలమీదనించి ఓ కొబ్బరికాయ ఏరి, దాన్నించి రాత్రికి పనికొచ్చే దీపం తయారు చెయ్యడం మొదలెట్టాడు. పీచుని వత్తిగాపేని, కొబ్బరిలోంచి నూనె పిండి. పెంకులో లవత్తి నానేశాడు. వాడు ఈపని చేస్తూ కూర్చోగా. అంధుడు నిట్టూరుస్తూ బానిసతో, "సరేగాని, ఓరి బానిసా! సూర్యుడు లేడని నేనన్నమాటలో యథార్థం లేదంటావా? అంతా ఎంత చీకటిగా ఉందో నీకు కనపడటంలేదూ? యథార్థం ఇట్లా ఉంటూన్నప్పుడు సూర్యుడు ఉన్నాడంటూ కొందరు దేవుళ్లాడతారే!....పోనీ, ఉన్నాడే అను, ఉంటే సూర్యుడంటే ఏమిటి? అన్నాడు. ఆబానిసవాడు, 'సూర్యుడంటే ఏమిటో నాకుతెలియదు. అది తెలుసుగోడంనా పనికాదు. కాని, వెలుగుఅంటే ఏముటో నాకు తెలుసు. ఇదుగో, రాత్రివేళ పనికొచ్చే దీపం ఒకటి కల్పించాను. దీంతోమిమ్మల్ని సేవించడానికి ఇంట్లో ఏది ఎక్కడుందో తెలుసుగుంటాను' అని బదులుచెప్పాడు. అని, ఆకొబ్బరిపెంకు పట్టుగుని, 'ఇదే నాసూర్యుడు' అన్నాడు. చంకకర్రలు తనపక్కని పెట్టుగుని, దగ్గిరే కూర్చున్న ఒక కుంటివాడు ఈ మాటలకి నవ్వి, అంధుడితో, 'సూర్యుడంటే ఏముటో తెలియకపోతే నువ్వు యావజ్జీవి

తమూ అంధులవే అని వివాదం అవుతోంది. నేను చెబుతాను విను. సూర్యుడంటే: సూర్యుడు ఒక అగ్నిగోళం. సూర్యుడు సముద్రంలో ఉదయించి లేచి కొంతసేపటికి మా ద్వీపంలో ఉండే పర్వతాలున్నాయే, వాటిల్లో దిగిపోతాడు. ఈ సంగతి మేం అంతా చూశాం, నీకు దృష్టి గనక ఉండుంటే నువ్వూ చూసి ఉండేవాడవు,' అన్నాడు. పై సంభాషణ ఒక జాలరి విని, 'సరి సరి. నువ్వు నీ ద్వీపం దాటి వెళ్ళనట్టు స్పష్టంగా తెలిసి పోతోంది. పాపం, నీకే ఆ కుంటి లేకుండా ఉండి నాతో పాటు వేట నావలో నువ్వూకుడా సముద్రంమీద వచ్చుంటే సూర్యుడు మీ ద్వీప పర్వతాలలో దిగడం లేదనీ, సముద్రంలో ఉదయించి లేచినట్టే మళ్లీ సముద్రంలోకే దిగి అస్తమిస్తాడనీనీ నీకు బోధపడి ఉండేది. నేను చెబుతున్నది యథార్థం. ఎందు చేతంటే, ఈ సంగతి అనుదినమూ నా కళ్ళతో నేను చూస్తూ న్నాను,' అన్నాడు. అప్పుడు మా జట్టులో ఒకడైన ఒక హైందవుడు అతడికి అడ్డు తగులుతూ, 'బుద్ధిగలిగి ఉండివలిసిన మానవుడు, ఇంత బుద్ధితక్కువ ప్రకటన చేసుగోడంచూసి నేను నిశ్చేష్టుణ్ణి అవుతున్నాను. అగ్నిగోళం నీళ్ళల్లోకి దిగి ఆరిపో కుండా ఉండడం సంభవనీయమా, చెప్పండి: అందుకని, సూర్యుడు ఒక అగ్నిగోళం ఎంతమాత్రమూ కాదు. అతడు దివాకరుడనే దేవత. బంగారు పర్వతమైన మేరువుచుట్టూ అతడు తన రథంలో ప్రదక్షిణంచేస్తాడు. ఒక్కొక్కప్పుడు రాహు కేతువులనే క్రూరసర్పాలు సూర్యుణ్ణి గ్రహించి మింగేస్తాయి, అప్పుడు భూమి చీకటవుతుంది, కాని అర్చకులు ఆ దేవతని

విడిపించవలసిందిగా ప్రార్థనలు చేస్తారు. ఆ మీదట అతడికి మోక్షం కలుగుతుంది. మీ ద్వీపం దాటి వెళ్ళకుండా ఉండిపోయిన నీవంటి అజ్ఞానులు, మీ దేశాల్ని వెలిగించడానికి మాత్రమే సూర్యుడు ఉంటాడని ఊహించుకుంటాను అని దిద్దుతూ ప్రసంగించాడు. అప్పుడక్కడున్న ఒక ఐగుప్తదేశపు ఓడ నిర్వాహకుడు, తన వంతు చొప్పున మాట్లాడుతూ, 'అబ్బెబ్బే. నువ్వన్నదీ తప్పే. సూర్యుడు దేవతకాడు, ఇండియా చుట్టూనూ అందులోని బంగారు పర్వతం చుట్టూనూ మాత్రమేకాదు అతడు తిరిగేది. నేను ఎంతో మేర ఓడప్రయాణం చేశాను—నల్ల సముద్రం, అరేబియాతీరాలు, మెడగోస్కర్ దీవి, ఫిలిపైన్ ద్వీపాలు తిరిగొచ్చాను. సూర్యుడు ఇండియాని మాత్రమేకాదు, భూమినంతనీ వెలిగిస్తాడు. అతడు ఒకేపర్వతం చుట్టూ తిరుగుతూ కూచోడు, జపాను దీవులకి చాలా దూరంగా తూర్పున ఎక్కడో ఉదయించి ఇంగ్లాండు దీవులకి చాలా చాలా దూరంగా పడమట ఎక్కడో అస్తమిస్తాడు. అందువల్లే, జపానీయులు తమ దేశాన్ని 'నిప్పన్' అని వ్యవహరించుకుంటారు—'నిప్పన్' అంటే సూర్యజననం అని అర్థం గనక, ఇది నాకు బాగా తెలుసు; స్వయంగా బోలెడు చూశాను, సముద్రాంతాలు చూసి వచ్చిన మా తాత చెప్పగా బోలెడు విన్నాను.' అన్నాడు. అతడల్లాగే మాట్లాడుకుంటూ పోయుండేవాడే కాని మా ఓడమీది ఒక ఇంగ్లీషు నావికుడు, అతని మాటకి అడ్డొచ్చి, 'ఇంగ్లండులో ఎరుగున్నంతగా సూర్యుడి గతి భేదాల గురించి ఏ యితర దేశంలోనూ ఎరగరు. సూర్యుడికి ఉదయించడమూ లేదు. అస్త

మించడమూ లేదని, ఇంగ్లండులో ప్రతీ వాడికీ తెలుసు. అది భూమిచుట్టూ ప్రదక్షిణం చేస్తోంది. ఈ మాట రూఢే అని మీరు నమ్మవచ్చు. ఏమంటే! మేమే యావత్తు భూమిచుట్టూ తిరిగి వచ్చాం. కాని ఎక్కడా కూడా సూర్యుణ్ణి డీకొట్టలేదు మేం ఎక్కడికట వెళ్ళనీండి, సూర్యుడు ఉదయానే ఉదయించ డమూ రాత్రెళ్ళు దాక్కోడమూనూ! సరిగ్గా ఇక్కడలాగే!' అని చెప్పేసి, అంతటితో ఆగక ఒక చిన్న కర్రతో ఇసుకమీద సున్నగీసి, సూర్యుడు ఆకాశంలో పోతూ భూమిని ఎల్లా చుట్టి వస్తుంటాడో బోధించడం మొదలెట్టాడు. కాని, అతడు విషయం సుబోధకం చెయ్యలేకపోయి, ఒక సరంగుకేసి చూపిస్తూ 'ఈ మనిషికి నాకంటె బాగా తెలుసు. ఇతడు ఈ విషయం చెప్పతగ్గ రీతిని చెప్పి విశదం చెయ్యగలడు' అన్నాడు. సరంగు చాలా తెలివిగలవాడు గనక మౌనంగా సకలమూ ఆలకిస్తూ మాట్లాడండని అడిగేవరకూ ఊరుకున్నాడు. అంతా అతడికేసి తిరిగి ఆలకించగా, అతడు; 'మీలో ఒకర్ని ఒకరు తప్పునారి పట్టించుతూ ఎవడి మట్టుకి వాడు మోసపోతున్నాడు. భూమిచుట్టూ సూర్యుడుపోడు, భూమే సూర్యుడిచుట్టూ పోతోంది. ఆ పోవడంలో ఇరవై నాలుగు గంటల్లో తనుకూడా గిర్రున తిరుగుతూ, జపానునేకాదు, ఫిలిప్పైన్లని, మనం ఉన్న ఈ సుమిత్రాని, ఆఫ్రి కాని, యూరప్‌ని అమెరికాని సూర్యుడికేసితిప్పి చూపిస్తోంది. సూర్యుడు ప్రకాశిస్తూన్నది ఒక పర్వతం నిమిత్తమే, లేక ఒక ద్వీపం నిమిత్తమే, లేక ఒక సముద్రం నిమిత్తమే, లేక కేవలం భూమి నిమిత్తమేకాదు, భూమితోపాటు గ్రహా లన్నింటి

నిమిత్తంగా కూడానూ! నీ కాళ్ళకింది భూమిని నువ్వు చూసే బదులు నీ నెత్తిమీది ఆకాశంకేసి నువ్వు చూస్తే ఆసంగతి నీకు అవగాహన అవుతుంది. తరవాత ఎన్నడూ కుడా సూర్యుడు ప్రకాశించేది నీకోసమే అనిగాని నీ దేశానికోసమే అనిగాని నువ్వు అనుకోవు' అన్నాడు. భూమిమీద చాలాభాగం ఓడమీద తిరిగి చూసి పైన ఆకాశంకేసి కుడా చిరకాలం నిదానించి చూసిన వివేకి గనక ఆ సరంగు అల్లా చెప్పాడు.

అని, కన్‌ఫ్యూషన్ శిష్యుడైన ఆ చైనీయుడు చెప్పడం సాగిస్తూ, 'అల్లాగే మతవిషయాల్లో, జనంయొక్క ప్రమాదాలకీ చీలికకీ కారణం గర్వమే. సూర్యుణ్ణి గురించి ఎంతో, దేవుణ్ణి గురించీ అంతే. ప్రతిమనిషికీ తనకి ఓ ప్రత్యేకదేవు డుండాలి, అని. లేకపోతే, హీనపక్షం, తన మాతృదేశానికేనా ఓ ప్రత్యేక దేవు డుండాలి, అని. ఏలోకాలూ పట్టకుండా దేవుడుంటే, అతణ్ణి లాక్కొళ్ళి తమ దేవాలయాల్లో బంధించేసుగోవాలని ప్రతీజాతి ఉద్దేశమూనూ! ఒకే మతవిశ్వాసంలోనూ ఒకే మతంలోనూ మానవజాతిని ఐక్యం చెయ్యదల్చుగుని దేవుడే కట్టిన ఆలయానికి సాటి మరి ఏ ఆలయమేనా ఉందా? దేవుడు కట్టిన ఆలయం ఒరవడినే మానవులు దేవాలయాలు కట్టేది. ఆ ఆలయం, ఏది అంటే దేవుడి స్వంతమైన ఈ ప్రపంచమే. మానవులు కట్టిన ప్రతీదేవాలయానికీ జలకోశాలు, కమానులు గల పైకప్పు, దీపాలు, పఠాలు, బొమ్మలు, వ్రాతలు, న్యాయశాస్త్ర గ్రంథాలు, బలులు, బలిస్థానాలు—ఉంటూంటాయి. కాని, ఏ దేవాలయపు జలకోశం సముద్రంతోసాటీ? ఏ దేవాలయపు కమాను ఆకాశంతో పోల్తుందీ? ఏ దేవాలయపు దీపాలు సూర్యచంద్ర నక్షత్రాలకి తుల్యం అవుతాయీ? ఏ దేవాలయపు విగ్రహాల్ని సజీవులై

సాసురాగులై పరస్పర సాహాయ్యం చేసుగునే మానవుల్తో ఉపమించడం? దేవుని మంచితనం సుగమంగా తెలియపరచడం విషయంలో, ఏ దేవాలయపు వ్రాతలు మానవ సౌఖ్యం నిమిత్తం దేవుడు సర్వత్రా వెదచల్లిన ఆనందాలకి ప్రతి? ఏ దేవాలయపు న్యాయశాస్త్రగ్రంథం విస్పష్ట మనవచ్చునూ హృదయంలో లిఖితమై ఉన్నదానిముందూ? ఏ దేవాలయపు బలులు అంతఃకరణగల స్త్రీపురుషులు ఒకరి నిమిత్తం మరొకరు చేసుగునే ఆత్మబలులకి సమానం? ఏ దేవాలయపు బలిస్థానాన్ని దేనిమీది బలిని దేవుడు స్వయంగా స్వీకరిస్తాడో అటువంటి సజ్జన హృదయపీఠంతో సాపత్యం చెయ్యడం?

మానవుడు దేవుణ్ణి మరీ ఉన్నతంగా భావించినకొద్దీ మరీ బాగా తెలుసుకోగలడు. దేవుణ్ణి మరీబాగా తెలుసుకున్నకొద్దీ, మానవుడు ఆయనకి మరీ సమీపంగా ఆకర్షింపబడి, ఆయన మంచితనం, ఆయన కనికరం, ఆయన సకల మానవప్రేమా అనుకరిస్తాడు. కాబట్టి, సూర్యుడి సంపూర్ణతేజం ప్రపంచాన్నం తనీ నింపడం చూడగలవాడు వెళ్ళి ఆ తేజంయొక్క ఒక కిరణాన్ని మాత్రమే తన స్వంతవిగ్రహంలో చూడగల మరొకణ్ణి నిందించడంగాని ద్వేషించడంగాని మానుకోవాలి. అంతేకాక, సూర్యుణ్ణి చూడడానికి దృష్టేలేని అంధుడైన అవిశ్వాసిని సయితమూ అతడు ద్వేషించడం కూడదు'

అని, కన్‌ఫ్యూషస్ శిష్యుడైన ఆ చైనీయుడు ముగించాడు. కాఫీ ఆలయంలో ఉన్నవారంతా మౌనం వహించారు. ఎవరి మతవిశ్వాసం ఉత్తమం అనే విషయంగురించి వాళ్ళు మరి యెన్నడూ వాదించుకోలేదు.

# ముగ్గురు ఋషులు

(వోల్గా ప్రదేశంలో ప్రచారంలో ఉన్న ఒక పాత పుక్కిటపురాణం)

[ఇంకా ఏమనగా, ప్రార్థనలలో వ్యర్థపునరుక్తులు వాడవద్దు, అక్రైస్తవులు వాడేటట్లు. తమరెంతో ఎక్కువగా మాట్లాడారు గనక, అవతలవారు వినిపించుకోక ఏంజేస్తారని వాళ్ళ ఊహ. అందుచేత, వాళ్ళలాగ ఉండవద్దు, ఏమంటే మీ ఆ జనకుడు, మీరింకా ఆయన్ని అడక్కపూర్వమే, ఎరుగును మీకవసరమైనవి ఏమిటో—మత్తయి vi; 7, 8]

ఒక క్రైస్తవమతగురువు ఆర్కేంజెల్‌పట్నంలో ఓడెక్కి సోలవాట్ మఠానికి వెడుతున్నాడు. ఆ మఠప్రాంతంలోని పవిత్రాలయాలు దర్శనం చేసుకువచ్చే నిమిత్తం చాలామంది యాత్రికులుకూడా ఆ ఓడలో ఉన్నారు. సముద్రయానం సాఫుగా జరిగింది. పవనం అనుకూలంగానూ వాతావరణం హాయిగానూ ఉన్నాయి. ఓడ అంతస్థుమీద యాత్రికులు పడుకున్నవాళ్ళు పడుకున్నారు, తినేవాళ్ళు తింటున్నారు, గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకునేవాళ్ళు చెప్పుకుంటున్నారు. ఆ మతగురువు కూడా అంతస్థు మీదికి వచ్చి ఎదరకీ వెనక్కీ పచారుచేస్తూ ఓడ తలదగ్గిర ఒక ఒక జనసమూహాన్ని చూశాడు. వాళ్ళు ఒక జాలరి చెబుతూన్న మాటలు ఆలకిస్తున్నారు. ఆ జాలరి ఏదో చెబుతూ సముద్రంలోకి చూపిస్తున్నాడు. మత గురువు నిల్చిపోయి ఆ జాలరి చూపించే దిశలో తనూ చూశాడు. కానైతే, ఆయనకి ఏమీ కనిపించలేదు, సూర్యకిరణాలు తరంగశిఖరాలమీద ప్రతి

ఫలించడం తప్పు. ఆయన ఆ సమూహం సమీపానికి నడిచాడు. ఆ జాలరి ఆయన్ని చూసి, టోపీతీస్తూ వందనం చేసి, చెప్పడం మానేశాడు. తక్కిన జనం అందరూ కూడా తమ టోపీలు తీసి పట్టుకుని. తలలువంచి ఆయనకి వందనం చేశారు. అప్పుడా మత గురువు, 'మీకు నేను అడ్డువచ్చాననుకోకండి, నాయనలారా! ఈ సుజనుడు చెప్పే సంగతులు వినాలనే నే వచ్చిందీనూ!' అన్నాడు. దానికి, ఒక వర్తకుడు—తక్కినవాళ్ళకంటె ఎక్కువ ధైర్యం గలవాడే అనాలి—'ఆ ఋషులగురించి చెబుతున్నాడండి, ఈ జాలరి' అని చెప్పాడు

మతగురువు, 'ఏ ఋషులూ?' అంటూ, ఎవరకి వాళ్ళకేసి నడిచివెళ్ళి ఒక పెట్టెమీద కూచుంటూ, 'చెప్పు బాబూ చెప్పు. ఏమిటి వాళ్ళని గురించీ? నాకు వినాలని ఉంది. నువ్వు దేనికేసో చూపించావే!' అన్నాడు. జాలరి, ఆ ఓడవెళ్ళే దిశకి కొంచెం కుడివైపు చూపిస్తూ, 'అవ్వే, ఆ చిన్న ద్వీపంకేసి—నలుసులా కనిపిస్తోందే? అక్కడ ఆ ఋషులు ఉంటూంటూ, తమ ఆత్మల్ని రక్షించుకునే టందుకు!' అన్నాడు.

మతగురువు, 'నాకుఏమీ కనిపించడంలేదే! ఎక్కడుంది ద్వీపం?' అని అడిగాడు. జాలరి, 'అదుగో, దూరాన్ని. నా చెయ్యి చూపించే వాటంలో దయచేసి చూడండి. పైన చిన్న మేఘం ఒకటి కనపడుతోందా? దానికి అడుగున, కొద్దిగా ఎడంవైపున కనపడీ కనపడని చారలేదూ? అదీ ఆ ద్వీపం,' అన్నాడు.

మతగురువు కళ్ళుచించుకుని చూశాడుగాని, అంత దూర దృష్టితో చూడ్డం ఆయనకి అలవాటు లేకపోవడంవల్ల, అక్కడ ఏమీ కనపడలేదు, నీళ్ళమీది ఎంత జిగ జిగ తప్ప. 'నాకేమీ కనిపించడంలేదుమరి కాని, అక్కడ ఉంటూండే ఋషు లెవరూ?' అని అడిగాడు.

జాలరి, 'వాళ్ళు పుణ్యపురుషులండి. చిరకాలం వాళ్ళని గురించే చెప్పగా వింటూండేవాణ్ణిగాని వాళ్లదర్శనం చెయ్యలేదు, రెండేళ్ళ క్రితం వరకూ.' అన్నాడు. అని ఆ గాథ యావత్తూ చెప్పుకొచ్చాడు:

'ఒకసారి నేను సముద్రంలో చేపవేటకి వెళ్ళాను. ఆ రాత్రి కొట్టుకుపోయి ఆ ద్వీపంమీద పడ్డాను. ఎక్కడున్నానో నాకు తెలియదు. ఉదయాన్ని ఇటూ అటూ తిరగడం మొదలెట్టాను. ఒక మట్టిగుడిసె కనపడింది, దాని పక్కని ఒక ముసలాయన నుంచున్నాడు అప్పుడే మరి యిద్దరు బయిటికి వచ్చారు, నాకు తిండిపెట్టారు, నా వస్తువులన్నీ ఆరబెట్టారు, నా నావ మరమ్మతు చెయ్యడంలో సాయపడ్డారు' అన్నాడు.

మతగురువు, 'ఎల్లా ఉన్నా రేమిటి, వాళ్ళు?' అని అడిగాడు.

జాలరి, "ఒకడు సన్నగా రెవటటూలా ఉన్నాడు, నడుంవంగి రెండైంది. అర్చకుడు ధరించే నల్లగౌను ధరించాడు. అతడు అతివృద్ధుడు. వందయేళ్ళకి పైమాటే, అనవలిసుంటుంది. ఆయన ఎంత వృద్ధుడంటే, ఆయన గడ్డం యొక్క తెల్లదనానికి ఆకు పచ్చ ధాళకుడా బయల్దేరింది. కాని, ఎంతసేపూ ఆయన చిరు

నవ్వుతోనే ఉన్నాడు. ఇక ముఖవర్చస్సు స్వర్గాన్నించి దిగిన దేవదూత ప్రభలా ఉంది. రెండో ఆయన అంత పొట్టికాడు. కాని ఆయనా ముసిలిపండే. ఆయన, రైతులు తొడుక్కునే కోటు, చిరిగిపోయింది, తొడుక్కున్నాడు. ఆయన గడ్డం విశాలంగా, పసుపెక్కిన బూడిదరంగుగా ఉంది. ఆయన బలిష్ఠుడు. మరమ్మత్తు చెయ్యడానికి నావని తిప్పవలసొచ్చినప్పుడు, ఓవేపు పట్టుగుందాం అని నేను అనుకునే లోపలే, ఆయన ఒక్కడూ బాల్చీని తిరగేసినట్టు నావని బోర్లించేశాడు. ఆయనకూడా దయగానూ కులాసాగానూ ఉంటాడు. మూడో ఆయన పొడగరి. ఆయనకి మంచులాంటి తెల్లటి గడ్డం ఉంది మోకాళ్ళదాకా. ఆయన చాలా తీవ్రంగా కనుబొమలు వాల్చేసి ఉంటాడు. మొల చుట్టూ చుట్టిన చాపముక్క తప్ప ఆయన ఒంటిమీద ఏమీలేదు.' అన్నాడు.

మతగురువు, 'మరి వాళ్ళు మాట్లాడారా నీతో?' అని కనుక్కున్నాడు.

జాలరి, 'చెయ్యవలసొచ్చిన ప్రతిపనీకూడా వాళ్ళు చాలా వరకు తమ మౌనానికి భంగం కలగకుండానే నిర్వహించుగున్నారు. వాళ్ళు పోనీ తమరిలో తమరేనా మాట్లాడుకున్నారా అంటే: అదీ జరగలేదనే అనుకోవాలి. వాళ్ళల్లో ఏ ఒకడో చటుక్కున ఒక ముఖవాలకం పెట్టా డనుకోండి, తక్కిన యిద్దరూ అతని భావం గ్రహించేసు గుంటూండేవాళ్ళు. చాలా పూర్వం నించీ అక్కడ వాసంగా ఉంటున్నారా అని వాళ్ళల్లో మిక్కిలి

పొడగరిని నేను ప్రశ్నించాను. ఆ ప్రశ్నకి ఆయన కనుబొమలు చిట్లించి, కోపంలో పడ్డాడా అనిపించేటట్టు లోపల లోపల ఏమిటో గొణుక్కోడం సాగించాడు. కాని, అతివృద్ధు అతని చెయ్యి పుచ్చుగుని కాస్త మందహాసం చేశాడు. ఆ తరవాత పొడగరి శాంతించాడు.

అప్పుడా అతివృద్ధు, 'మమ్మల్ని కాస్తంత కటాక్షించాలి మరి' అనే మాటలు మాత్రం ఉచ్చారణచేసి మందస్మితం చేశాడు'—అని నివేదించాడు.

జాలరి ప్రసంగం కానిస్తూండేలోపల ఓడ క్రమేణా ద్వీపానికి చేరువైంది.

తరవాత, వర్తకుడు తన చూపుడు వేలితో సూచిస్తూ, 'అదుగో అదుగో. ఇప్పుడది అతిస్పష్టంగా గోచరిస్తోంది. దయచేసి, గురుస్వాములు అటువైపు దృష్టి నిగిడించండి' అన్నాడు.

మతగురువు ఆ దిశ చూశాడు. ఇప్పుడు ఒక నల్లటి చార ఆయనకి యథార్థంగానే గోచరించింది. ఆ నల్లటి చారే ద్వీపం. కొంచెంసేపు ఆయన దానికేసి పరికించి, ఓడయొక్క శిరోభాగం నించి పుచ్ఛభాగానికి వెళ్ళాడు.

వెళ్ళి, అక్కడున్న సరంగుని 'అది ఏ ద్వీపం?' అని అడిగాడు.

అతడు మతగురువుకి సమాధానం చెబుతూ, 'అదాండీ! దానికి ఫలానా పేరు అంటూ ఏదీ లేదండి. ఈ మహాసముద్రంలో అటువంటివి వందలూ వేలూ నండి' అన్నాడు.

అందు మీదట మతగురువు, 'అయితే, నిజమేనా అక్కడ ఋషు లుండడంమాట? తమ ఆత్మల మోక్షంకోసం అక్కడే వసతి ఏర్పరుచుగుని ఉంటూన్నారట?' అంటూ, వైనం తెలుసుకో గోరి, అడిగాడు.

సరంగు, 'ఉన్నారని అంటారు, స్వాములూ! కాని, యథార్థం నాకు తెలియదు. జాలర్లు వాళ్ళని చూశామనే చెబుతారుమరి. కాని, అల్లిపారేస్తూండడం వాళ్ళకి సహజమేకదా!' అన్నాడు.

మతగురువు, 'ఆ ద్వీపం మీద దిగి, ఆ మనుషుల్ని చూడా అని నాకు మహాఉంది. అది నాకు సాధ్యపడడం ఎల్లా?' అని అడిగాడు.

సరంగు, 'ఓడ ఆ ద్వీపం సరసకి వెళ్ళడానికి వీల్లేదు. కాని, మిమ్మల్ని ఒక పడవలో దింపి తెడ్లేసి అక్కడ చేర్చవచ్చు. ఓడ కెప్తానుతో మాట్లాడి చూడండి, పోనీ,' అన్నాడు.

ఓడ కెప్తానుని అక్కడికి రప్పించారు.

మతగురువు, 'ఏమయ్యా కెప్తాన్! ఆ ఋషుల్ని చూడాలని నాకుంది. తెడ్లపడవలో నన్ను గట్టుచేర్చడానికి వీలుండదూ?' అని అడిగాడు.

కెప్టాను అయన్ని ఎల్లాగేనా మాన్పించ దల్చుగుని, 'ఓ, వీల్లుండకేం? మహారాజులా ఉంటుంది: కాని చాలా కాల యాపన అవుతుంది. అయినా, స్వాముల్తో చెప్పడానికి సాహ సించని స్తే, మీ శ్రమకి కిట్టేటట్టు ఉండరండి, ఆ ముసిలివాళ్ళు. నేను వినడం వాళ్ళు మూర్ఖులైన ముసిలిఘటాలు——అని. వాళ్ళకే ఏమీ తెలియదుట, ఏమాటా ఆడరుట. సముద్రంలోచేపలు ఎంత మాట్లాడతాయ్? అంతకంటె ఎక్కువ వీళ్ళూ మాట్లాడరుట," అన్నాడు.

అందుకు మతగురువు, 'వాళ్ళని చూడాలనే నాకోరిక. నీ శ్రమకీ కాలనష్టానికీ ముదరా ఇచ్చుగుంటానుగాని, నాకు ఒక పడవ చూడు,' అన్నాడు.

మరి గత్యంతరంలేక కెప్టాను అనుజ్ఞ ఇచ్చాడు. తెరచాపల వాళ్ళు తెరచాపలు సరిదిద్దారు, సరంగు చుక్కాను లేవనెత్తి పట్టాడు. ఓడ కుడిపక్కకి కొంచెం మళ్ళి, ద్వీపానికి సూటిగా నడిచింది. ఓడ తలమీద ఒక కుర్చీ వేశారు, దానిమీద, ఎదరికి చూస్తూ మతగురువు కూచున్నాడు. ప్రయాణీకులు చాలామంది ఆ యెదరభాగానికే పోగై, తేడబారి ద్వీపంకేసి చూశారు. వేగ కళ్ళవాళ్ళకి అప్పుడే ద్వీపంమీది గుట్టలు కనిపించాయి, మట్టి గుడిసెకుడా అనింది. ఒకడు 'అరుగో ఋషులు' అని కేకేశాడు. కెప్టాను ఒక దూరదృష్టిని తెచ్చి, ముందు తనుచూసి, మత

గురువుచేతి కిస్తూ, 'నిజమే గట్టున ముగ్గురు మనుషులు నిలబడి ఉన్నారు—ఆ పెద్దగుట్టకి కొంచెం కుడిపక్క' అన్నాడు. మత గురువు దూరదర్శిని తీసుకుని, అది తనకి అమర్చుగుని చూడగా, ముగ్గురు మనుషులు కనిపించారు—ఒకడు పొడగరి, ఒకడు అంతకంటె పొట్టి, ఒకడు వంగిపోయి యింతేమనిషి. వాళ్ళు చెట్టాపట్టాలు పట్టుగుని గట్టున నుంచున్నారు.

కెప్టాను మతగురువుకేసి తిరిగి, 'ఓడ ద్వీపాన్ని ఇంతకంటె సమీపించడానికి వీలుపడదు. మీరు గట్టుకి వెళ్ళా లంటే, మిమ్మల్ని పడవలోకి ఎక్కమనాలి, మేం ఇక్కడ లంగరు వెయ్యాలి,' అన్నాడు.

లంగరు గొలుసు గబగబా వదిలేశారు, లంగరు పడింది, తెరచాపలు చుట్టేశారు. తోపు తిన్నట్టై ఓడ కదిలింది. ఒక పడవ దింపగానే, తెడ్లవాళ్ళు వాట్లోకి దూకారు. మతగురువు నిచ్చెనదిగి పడవలో కూచున్నాడు. పడవవాళ్ళు తెడ్లువేశారు. పడవ ద్వీపంవగ్గిరికి చకచకా వెళ్ళింది. ద్వీపానికి బెడ్డవేటు దూరంలోకి వెళ్ళగానే, వాళ్ళకి ముగ్గురు ముసలివాళ్ళూ కన పడ్డారు: మొలకి చాపముక్కమాత్రం చుట్టుగున్న ఒక పొడగరి, చిరిగిపోయిన రైతుకోటు తొడుక్కుని అంత ఎత్తరి కాని ఒకడు, వయస్సుతో వంగిపోయి పాతనల్ల అంగి ధరించిన అతి వృద్ధుడు ఒకడు—ముగ్గురూ ఒకర్ని ఒకరు చేతుల్తో పట్టుగుని. తెడ్లవాళ్ళు పడవని గట్టుకిచేర్చి పడవకొక్కెంతో ఆపి పట్టగా మతగురువు గట్టుమీద కాలుపెట్టాడు.

ముసిలివాళ్ళు తలవంచి నమస్కరించగా, మతగురువు వాళ్ళని ఆశీర్వదించాడు. అప్పుడు వాళ్ళు తలలు మరీ వంచారు. మత గురువు వాళ్ళతో మాట్లాడ్డం ప్రారంభిస్తూ, 'పుణ్యాత్ములారా! మీ ఆత్మల రక్షణ నిమిత్తమున్నూ సాటిమానవుల తరఫున క్రీస్తుప్రభువుని ప్రార్థించడం నిమిత్తమున్నూ మీ రిక్కడ ఉంటూన్నట్టు నేను విన్నాను. నేను క్రీస్తు సేవకుణ్ణి అని పించుకోగల అర్హత లేనివాణ్ణయినా, దైవకృపవల్ల, ఆ గొల్ల వాని మందకాసి, ఆ మందకి బోధించే పనికి ఆహ్వానింప బడ్డాను—దైవసేవకులైన మిమ్మల్ని చూసి, మీకు కూడా బోధించే విషయంలో ఏమిచెయ్యగలనో అది చెయ్యాలనే నాకోరిక,' అన్నాడు.

ముసలివాళ్లు ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుగుని చిరునవ్వు నవ్వు కున్నారుగాని, మౌనంగానే ఉన్నారు.

మతగురువు, 'ఏదీ చెప్పండి. మీ ఆత్మల రక్షణకోసం మీరు ఏమేమిటి చేస్తున్నారూ? ఈ ద్వీపంమీద దేవుణ్ణి ఎట్లా సేవిస్తున్నారూ?' అన్నాడు.

రెండో ఋషి నిట్టూర్పు పుచ్చి, అతివృద్ధై అతిపురాతనుడైన వ్యక్తికేసి చూడగా, అతడు చిరునవ్వు నవ్వి, 'ఓ దేవసేవకా! మాకు దేవుణ్ణి సేవించడం ఎట్లాగో తెలియదు. మే మమ్మల్నే సేవించుగుని రక్షణ చేసుగుంటున్నాం,' అన్నాడు.

మతగురువు, 'పోనీ మీరు దేవుడికి ప్రార్థన ఎట్లా చేస్తూం టారూ?' అని కనుక్కున్నాడు.

ఆ ఋషి, 'ఏముందీ? ఇల్లాగే! ''మీరు ముగ్గురూ, మేం ముగ్గురం, మామీద కనికరించండి' అని, అన్నాడు.

అతివృద్ధు ఇల్లా అనగానే, వాళ్ళు ముగ్గురూ కూడా ఒకసారి తమ దృష్టులు ఆకాశం మీదికి తిప్పి, మళ్ళీ, 'మీరు ముగ్గురూ, మేం ముగ్గురం, మా మీద కనికరించండి' అన్నారు.

మతగురువు చిరునవ్వు నవ్వి, 'ఓహో! అదా! దేవత్రయం గురించి మీరేదో కొంచెం విన్నట్టున్నారు. కాని మీరు సరిగ్గా ప్రార్థించడంలేదు. మీరు దివ్య పురుషులు కాబట్టి నా ప్రేమ జూరగొన్నారు. ఆ ప్రభువుని సంతోషపరచాలనే మీకోరిక అని నాకు తెలుస్తోంది, కాని ఆయన్ని ఎల్లా సేవించాలో మీరెరగరు. ప్రార్థించే మార్గం ఇది కాదు. జాగరత్తగా వినండి, నేను మీకు విధిగా బోధిస్తున్నాను, నేను మీకు బోధించబోయేది నాస్వంతానికి చెందిన మార్గంకాదు, తనను ప్రార్థించే నిమిత్తం మానవులందరికీ దేవుడు దివ్యగ్రంథంలో విధించిన మార్గం,' అన్నాడు. అని ఆ మతగురువు, మానవులకి దేవుడు ఏరీతిగా గోచరం అయాడో, జనకుడైన దేవుడూ కుమారుడైన దేవుడూ దివ్యగణమైన దేవుడూ అనగా ఏమేమిటో ఆ ఋషులకి విశద పరచడం మొదలెట్టాడు. కుమారుడైన దేవుడు భూమిమీద అవతరించింది మానవుల్ని రక్షించడానికి. ప్రార్థన చెయ్యడం గురించి అందరికీ ఆయన బోధించిన రీతి ఇదుగో చెప్పబోతు న్నాను. మీరు జాగ్రత్తగా ఆలకించి, నేనన్నట్టే మళ్ళీ అంటూండండి: 'మాతండ్రీ' మొదటి శతవృద్ధుడు ఆరీతిగానే 'మాతండ్రీ' అన్నాడు. రెండో ఋషి 'మాతండ్రీ' అన్నాడు. మూడో

ఆయనకుడా 'మాతండ్రీ' అన్నాడు. మతగురువు, 'స్వర్గంలో ఉంటూండే మాతండ్రీ' అనండి అన్నాడు. మొదటి ఋషి అల్లాగే, 'స్వర్గంలో ఉంటూండే మాతండ్రీ' అన్నాడు. రెండో ఋషి మాటలు తడబడ్డాడు, సరి ఆ పొడగరి ఆమాటలు సరిగా అనలేకపోయాడు. ఆయనకి మూతిమీద రోమాలు విజృంభించడంవల్ల స్పష్టోచ్చారణకి వీలే చెడిపోయింది. శతవృద్ధుకుడా, పళ్ళులేకపోబట్టి, అస్పష్టంగా నవుల్తూన్నట్టే పలికాడు.

మతగురువు మళ్ళీ ఆమాటలు అన్నాడు. ముసిలివాళ్ళు ఆ ప్రకారమే మళ్ళీ అనేశారు. మతగురువు ఒక రాతి మీద కూచున్నాడు, ఆ ముసిలివాళ్ళు ఆయన ఎదట నుంచుని ఆయన నోటికేసి జాగ్రత్తగా చూస్తూ, ఆయన ఉచ్చారణ చేసినట్టే చేస్తోచ్చారు. ఒక్కొక్కమాట ఇరవైకాదు ముప్పైకాదు. ఒక వందేసిసార్లు అనిపించాలని యత్నిస్తూ ఆరోజు రోజంతా ఆయన శ్రమపడిపోయాడు పాపం, వాళ్ళు అన్నిసార్లూ ఆ ప్రకారమే అనాలని యత్నించేవారు. వాళ్ళకి తప్పులు వస్తూండేవి, ఆయన దిద్దుతూండేవాడు, మళ్ళీ మొదణ్ణించీ అనండి, అనేవాడు. ఇల్లాగ్గా ఆ మతగురువు ప్రభువు ప్రార్థన యావత్తూ వాళ్ళకి బోధించడంలో ఎంత పట్టుపట్టాడంటే, తను అని, అన్నది వాళ్ళు విని, తరవాత తత్ప్రకారం వాళ్లు అనగలగడంకాదు, తను చెప్పకుండా వాళ్ళంతట వాళ్ళే అది చెప్పేసెయ్యగలిగేవరకూ అతడు బోధించడం విరమించుగోలేదు. అది తెలుసుగుని యావత్తూ మొదట అప్పగించ గలిగినవాడు మధ్యఋషి. ఆయన చేతే మతగురువు అది మళ్ళీమళ్ళీ అనిపించాడు. దాన్తో ఎల్లాగో చచ్చిచెడి కడం వాళ్ళుకుడా అది అప్పగించారు.

మతగురువు మరి ఓడకి వెళ్ళిపోదాం అని అనుకోకపూర్వమే అస్తమయం అయి, నీటి మీదికి చంద్రుడు లేచాడు. ఆ ముసిలి వాళ్ళదగ్గిర ఆయన సెలవు తీసుగునే టప్పుడు వాళ్లు ఆయనకి సాష్టాంగపడ్డారు. ఆయన వాళ్ళని లేవదీసి, ప్రతి మనిషినీ ముద్దెట్టుగుని, తను బోధించిన ప్రకారం ప్రార్థన చేసుగో వలిసింది గా వాళ్ళతో చెప్పాడు. తరవాత ఆయన పడవఎక్కి ఓడకి వెళ్ళిపోయాడు.

ఆయన పడవలో కూచోగానే తెడ్లవాళ్ళు తెడ్లేస్తూనే ఉన్నా ప్రభువు ప్రార్థన గట్టిగా అంటూన్న ఆ ముగ్గురు ఋషుల కంఠస్వరాలూ ఆయన వినగలిగాడు. పడవ ఓడకి చేరువైనకొద్దీ వాళ్ళ కంఠస్వరాలు మరి విన శక్యం కాలేదు. కాని, ఆ వెన్నెల్లో, ఆయన వచ్చేనేటప్పుడు ఎక్కడ నుంచున్నారో అక్కడే నుంచుని. ముగ్గురూ కనిపించారు—శతవృద్ధు మధ్యనీ, పొడగరి కుడిపక్కా, తక్కినవాడు ఎడమనీ, మతగురువు ఓడ చేరుకుని ఓడ చెక్కమీద కాలు పెట్టగానే లంగరు ఎత్తేశారు. తెరచాపలు విప్పేశారు. చాపలు గాలి బాగా పోసుగున్నాయి, ఓడ వేగంగా కోసుగుంటూ పోయింది. మతగురువు ఓడ పుచ్చం దగ్గిర ఒక పీఠం వేసుగుని, తమరు వదిలిపెట్టి వచ్చిన ద్వీపంకేసి చూస్తూ కూచున్నాడు. కొంత సేపటిదాకా ఆ ఋషులు కనపడుతూనే ఉన్నారుగాని, వెంటనే ఇంకా ద్వీపం కనిపిస్తూ ఉన్నా వాళ్లు మాత్రం దృష్టికి అందకుండా పోయారు. చివరకి ఆ ద్వీపంకుడా మాయమైంది. మరి సముద్రం ఒక్కటీ మాత్రం ఉంది కళ్ళ ఎదట, వెన్నెట్లో కెరటాలేస్తూ!

యాత్రికు లందరూ నిద్రకి పడ్డారు. అంతస్థుమీద అంతా నిశ్శబ్దంగా ఉంది. మతగురువు నిద్రపోదల్చుకోలేదు, తనొక్కడూ ఓడ పుచ్ఛం దగ్గిరే, ద్వీపం మాయమైన సముద్ర భాగంకేసి చూస్తూ. ఆ ముసిలి పుణ్యపురుషుల్ని గురించి ఆలోచిస్తూ కూచున్నాడు. తను వాళ్ళకి ప్రభువు ప్రార్థన నేర్పినందుకు వాళ్ళు ఎంత సంతోషపడుంటారో గదా అనుకున్నాడు. అటువంటి దివ్య పురుషులకి బోధించి సాయపడడానికి తనని పంపించిన ఆ దేవుడికి వందనం చేశాడు.

ఆ రీతిగా, ద్వీపం మాయమైన దిశ తేరబారి చూస్తూ ఆలోచన చేస్తూ ఆ మత గురువు కూర్చున్నాడు. కెరటాలమీద ఇక్కడోసారీ అక్కడోసారీ తళుక్కుమంటూ వెన్నెల ఆయన కళ్ళ ముందు చలించ సాగింది. కాని, అకస్మికంగా, వెన్నెలవల్ల సముద్రంమీదపడ్డ ఒక వెలుగు చారలో ఏదో తెల్లగా ప్రకాశిస్తూన్నట్టు ఆయనకి కనపడింది. ఏదేనా నీటిపక్షిఅయి యుంటుందా లేక ఏదేనా చిన్నపడవకి ఎత్తిన చిన్న తెరచాప వెలుగుతోందా! ఆయన ఆశ్చర్యంతో దృష్టి ఆపేగుచ్చి ఉంచి, మా వెనకాలే వస్తూన్న పడవేదేనా అయుండాలి. కాని గబగబా మా ఓడికి వచ్చి పడుతోందే! క్షణం కిందట అది దూరంగా, ఎంతో దూరంగా ఉంది. కాని, ఇప్పుడు చాలా చేరువైందే! అది పడవకాదు, ఏమంటే తెరచాప కనిపించడంలేదు. అది ఏమైతే అదే కావచ్చు గాని, మమ్మల్ని తరుముకొచ్చి పట్టేసేలాగే ఉంది." అనుకున్నాడు.

అదేమిటో ఆయనకి బోధపడలేదు. పడవా కాదు, పక్షీకాదు, చేపాకాదు! మనిషా అంటే అంతకి మరీ ఎక్కువగా ఉంది. పైగా మనిషైతే నడిసముద్రంలో నీటిమీద ఎల్లా నుంచో గలడూ? మతగురువు లేచివెళ్ళి సరంగుని, 'అల్లాచూడు, అదే మిటి, నేస్తం! అదేమిటి?' అని రెట్టించి అడగడం మొదలెట్టాడు. ఆయనికి తెలియకకాదు, స్పష్టంగా కనపడుతూంటేనే! ఆ ముగ్గురు ఋషులూనూ! వాళ్ళు నీళ్ళమీద పరుగెత్తుతున్నారు. అంతటా తెల్లగా వెలిగిపోతున్నారు, వాళ్ళ బూడిదరంగు గడ్డాలు ప్రకాశిస్తున్నాయి, ఓడ కదలడమే లేదా అనిపించే వేగంతో వచ్చి పడుతున్నారు.

సరంగు అటుచూసి భయంవేసిపోయి చుక్కాను వదిలేసి, 'ఓయ్ దేవుడోయ్, ఆ ఋషులు మనకేసి నీటిమీద పరిగెత్తుగుని వస్తున్నారు, పొడినేలమీదైతే పరిగెత్తినట్టు!' అన్నాడు. యాత్రికులు ఈమాటలువిని పక్కలమీంచి ఎగిరి ఓడ పుచ్చుందగ్గిర పోగయ్యారు. ఆ ఋషులు చెట్టాపట్టాలు పట్టుగుని రావడం వాళ్లు చూశారు. ఆ ఋషుల్లో ఈ చివరవాడూ ఆ చివరవాడూ ఓడ ఆపండని సంజ్ఞలు చేస్తున్నారు. పాదాలు కదపకుండానే వాళ్ళు నీటిమీద జారుతూ నుంచునే వస్తున్నారు. ఓడ ఆపే వ్యవధి లేకుండానే, ఋషులు ఓడని సమీపించి, తలెత్తి, అందరికీ కంఠం ఒకటే అయినట్టు, 'ఓ దేవసేవకా! నీబోధ మేం మరిచిపోయాం. అది మేం అంటూన్నంతసేపు మాకు జ్ఞాపకం ఉంది. ఒకసారి అనడం మానేసేసరికి అందులో ఒకమాట రాలిపోయింది. సరి యిప్పుడు అది యావత్తూ ముక్కముక్కలైపోయింది. మాకు మళ్ళీ బోధించుదూ,' అన్నారు.

మతగురువు శిలువ రక్షపెట్టుగుని, ఓడ అంచు కమ్మీమీద వాలి, 'ఓ దివ్యపురుషులారా! మీ స్వంతప్రార్థనే ప్రభువుని చేరుకుంటుంది. మీకు బోధించడంపని నామేరలోలేదు. పాపుల మైన మాగురించి ప్రార్థించండి,' అన్నాడు.

అని, ఆ మతగురువు ఆ ముసలివాళ్ళకి తలవంచి వందనం చేశాడు. వాళ్ళు వెనక్కి తిరిగి నీటిని కోసుగుంటూ వెళ్ళి పోయారు. వాళ్ళు మాయమైన చోట, సూర్యోదయంవరకూ ఒక తేజం ప్రకాశిస్తూనే ఉంది.

సమాప్తం.

## భమిడిపాటి కామేశ్వరరావుగారు

జననం ఏప్రిల్ 1897. పాఠశాలా విద్య – ఏలూరు, నర్సాపురం. కాలేజీ చదువు-కాకినాడ, రాజమహేంద్రవరం. 1918 లో బి. యే. (గణితశాస్త్రం). 1922 లో యల్. టి. నాటినించి వీరేశలింగం హైస్కూలులో గణితాధ్యాపకులు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగ. జూన్ 1953 లో ఉద్యోగ విరమణము. పద్యపఠనంమీదా అభినయంమీదా ఆసక్తి కలవారు.

జీవితంలోని వాక్చమత్కృతుల సేకరణ మొదటి కృషి. 'భారతి' కి 1926 నించి సంబంధి. చమత్కార సంభాషణలూ, 'త్యాగరాజ ఆత్మవిచారం' అనే త్యాగరాజ రచనల సారమూ ప్రకటించారు. భాగయ్య, పర్వతాలు, శఠకోపం, శానయ్య, మాలోకం మొదలైన పాత్రల పరిచయం సర్కార్లలోనూ రాయలసీమలోనూ నైజాం ప్రాంతాలలోనూ కలిగించారు. ఇటీవలి నాటకాలూ కథలూ ప్రశంసలూ అచ్చు కానున్నవి.